www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

జత చేయని పత్రాలను అప్‌లోడ్ చేయండి



- ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులకు మరో అవకాశం
- 75 శాతం అప్లికేషన్లు అసంపూర్తిగానే...
- మునిసిపాలిటీలు, కలెక్టరేట్లలో హెల్ప్ డెస్కులు
- ఇప్పటి వరకు 60,213 దరఖాస్తులకు ఆమోదం
- ఫీజు కింద వచ్చిన ఆదాయం రూ.96.60 కోట్లు

13

శనివారం | 17-8-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 | సంచిక (Issue) : 140

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, శుక్లపక్షం; తిథి: ద్వాదశి ఉ. 8.06, త్రయోదశి తె. 5.51 వరకు; నక్షత్రం: పూర్వాషాఢ ఉ. 11.49 తదుపరి ఉత్తరాషాఢ వర్జ్యం: రా. 7.17-8.47; దుర్ముహూర్తం: ఉ. 6.02-7.42; అమృతఘడియలు: ఉ. 7.12-8.44, తె. 4.16-5.54; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 6.02; సూర్యాస్తమయం: 6.35

వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఫాక్స్‌కాన్ చైర్మన్ యాంగ్ లియూతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



బీజేపీలో బీఆర్ఎస్ విలీనం!

కేసీఆర్‌కు గవర్నర్, కేటీఆర్‌కు కేంద్రమంత్రి పదవి ఇస్తారు

- మీడియాతో ఇష్టాగోష్ఠిలో సీఎం రేవంత్ సంచలన వ్యాఖ్యలు
- హరీశ్‌రావు అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు అవుతారు
- కవితకు బెయిల్.. రాజ్యసభ ఎంపీ పదవి
- మా కుటుంబీకులకు ఎక్కడా, ఏ పదవీ ఇవ్వలేదు: రేవంత్
- **ఖర్గేతో భేటీ.. పీసీసీ చీఫ్, నామినేటెడ్ పదవులపై చర్చ**
- క్యాబినెట్ విస్తరణ మీడియా సృష్టేనన్న ముఖ్యమంత్రి
- **ఫోర్త్ సిటీలో ఫాక్స్‌కాన్!.. సీఎంతో కంపెనీ చైర్మన్ భేటీ**

న్యూఢిల్లీ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ.. బీజేపీలో విలీనం అయ్యే అవకాశముందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. బేరసారాలు వివిధ స్థాయుల్లో జరుగుతున్నాయని, కేసీఆర్‌కు గవర్నర్ పదవి, కేటీఆర్‌కు కేంద్ర మంత్రి పదవి ఇస్తారని, హరీశ్‌రావు అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు అవుతారని వ్యాఖ్యానించారు. రాజ్యసభలో బీఆర్ఎస్‌కు ఉన్న నలుగురు ఎంపీలకు బదులుగా కవితకు బెయిల్ వస్తుందని, ఆమెకు రాజ్యసభ ఎంపీ పదవి ఇస్తారని తెలిపారు. శుక్రవారం ఢిల్లీలో ముఖ్యమంత్రి తన అధికారిక నివాసంలో తెలుగు మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. కాంగ్రెస్‌పై బీఆర్ఎస్, బీజేపీ పలు రకాలుగా విమర్శలు చేశాయని అన్నారు. ఎన్నికల ముందు.. కాంగ్రెస్ పోటీలోనే లేదన్నారని, తాము అధికారంలోకి వచ్చాక.. ఈ ప్రభుత్వం ఎక్కువ రోజులు ఉండదన్నారని గుర్తు చేశారు. కానీ, ఇప్పుడు రాష్ట్రంలో ప్రతిపక్షం ఉంటుందా? ఉండదా? అనే పరిస్థితి వచ్చిందని ఎద్దేవా చేశారు. ఇక ఎస్సీ వర్గీకరణపై మోదీ ప్రభుత్వానికి ఎటువంటి విధానం లేదని రేవంత్ ఆరోపించారు. మందకృష్ణ మాదిగకు ప్రధాని మోదీ 'బిగ్ హగ్' ఇవ్వడం తప్ప.. సుప్రీంకోర్టు తీర్పును స్వాగతించలేదన్నారు. వర్గీకరణకు

మిగతా 13వ పేజీలో...

త్వరలోనే కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ విలీనం!

11

- కేసీఆర్‌కు ఏఐసీసీ, కేటీఆర్‌కు పీసీసీ చీఫ్, కవితకు ఎంపీ
- కవిత బెయిల్‌తో మాకేం సంబంధం? దమ్ముంటే కేసీఆర్‌ను జైలులో పెట్టండి: కేంద్ర హోంశాఖ సహాయమంత్రి సంజయ్

రుణమాఫీ కాని వారి కోసం స్పెషల్ డ్రైవ్

ఇంటింటికీ వెళ్లి ఫిర్యాదుల స్వీకరణ.. కొత్తగా మార్గదర్శకాలు జారీ

13



హైదరాబాద్‌లోని ఎంజే మార్కెట్ వద్ద జూనియర్ డాక్టర్ల నిరసన ర్యాలీ

రాష్ట్రంలో 24 గంటల పాటు

ఓపీ సేవలు బంద్

కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారానికి నిరసనగా..

- ఐఎంఏ పిలుపుతో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో నిలిపివేత
- నేడు ఉదయం 6 నుంచి రేపొద్దున ఆరు గంటల దాకా
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి: వైద్య మంత్రి దామోదర
- రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో నిరసనలు, ఆందోళనలు
- **ఆర్జీ కర్‌పై దాడి.. బెంగాల్ సర్కారు వైఫల్యం వల్లే!**
- 7వేల మంది గుమిగూడితే ఇంటెలిజెన్స్ ఏం చేస్తోంది?
- ఆస్పత్రిని మూసేయిస్తాం.. జాగ్రత్త: కోల్‌కతా హైకోర్టు
- వైద్యసిబ్బందిపై దాడి జరిగిన 6 గంటల్లోపు ఎఫ్ఐఆర్..
- ప్రభుత్వాస్పత్రుల అధిపతులదే ఈ బాధ్యత: కేంద్రం

హైదరాబాద్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): జూనియర్ డాక్టర్‌పై కోల్‌కతాలోని ఆర్జీ కర్ ఆస్పత్రిలో జరిగిన హత్యాచారానికి నిరసనగా.. దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. తెలంగాణలోనూ పలు జిల్లాల్లో వైద్యులు, నర్సులు, ఇతర వైద్య సిబ్బంది ఆందోళనలు చేపట్టారు. ధర్నాలతో పాటు నిరసన ర్యాలీలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో.. శనివారం ఉదయం 6 గంటల నుంచి ఆదివారం ఉదయం 6 వరకూ.. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో అత్యవసర వైద్యసేవలు మినహా.. ఓపీ వైద్యసేవలను నిలిపివేయాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) పిలుపునిచ్చింది. ఈమేరకు డాక్టర్ల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టనున్నట్టు ఐఎంఏ తెలంగాణ విభాగం ప్రకటించింది. రాష్ట్రప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేసింది. అలాగే.. తెలంగాణ ప్రభుత్వ వైద్యులందరూ శనివారం

మిగతా 11వ పేజీలో...

కోయంబత్తూరులో మహిళా డాక్టర్‌పై అత్యాచారయత్నం

2



కోదండరాం, అలీఖాన్ ఎమ్మెల్సీలుగా ప్రమాణం

- చేయించిన మండలి చైర్మన్ గుత్తా
- ఉద్యమకారుల ఆకాంక్షల మేరకు పని చేస్తా: కోదండరాం

14



జాతీయ చలనచిత్ర అవార్డుల్లో..
దుమ్మురేపిన సౌత్ సినిమా

- ఉత్తమ చిత్రంగా.. మలయాళ సినిమా 'ఆట్టమ్'
- కార్తికేయ-2కు ఉత్తమ ప్రాంతీయ చిత్రం అవార్డు
- 'కాంతార' హీరో రిషభ్‌శెట్టికి ఉత్తమ నటుడు పురస్కారం

10

రెండు రాష్ట్రాల్లో ఎన్నికల నగారా



- జమ్ముకశ్మీర్‌కు సెప్టెంబరు 18 నుంచి 3 దశల్లో..
- హరియాణాకు అక్టోబరు 1న.. 4న ఫలితాలు
- మహారాష్ట్ర, ఝార్ఖండ్, ఢిల్లీకి తర్వాత?
- వారి బాస్ అనుమతి ఇవ్వలేదేమో: ఆదిత్య ఠాక్రే

2

గ్రూపు-1 మెయిన్ పరీక్షల సమయాల్లో మార్పులు!

- 30 నిమిషాల ముందుగానే పరీక్ష ప్రారంభం
- మధ్యాహ్నం 2 గంటల నుంచే మొదలు
- అక్టోబరు 21 నుంచి 27 వరకు పరీక్షలు
- షెడ్యూల్ విడుదల చేసిన అధికారులు

హైదరాబాద్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): గ్రూపు-1 మెయిన్ పరీక్షలను షెడ్యూల్ సమయం కంటే 30 నిమిషాల ముందుగానే ప్రారంభించాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీసు కమిషన్ అధికారులు శుక్రవారం షెడ్యూల్‌ను విడుదల చేశారు. దాని ప్రకారం.. మెయిన్ పరీక్షలను అక్టోబరు 21 నుంచి 27వ తేదీ వరకు ప్రతిరోజూ మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నారు. గతంలో జారీ చేసిన వెబ్‌నోట్‌లో ఈ పరీక్షలను మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహిస్తామని అని ప్రకటించగా తాజాగా స్వల్ప మార్పు చేశారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు పర్సనలైజ్డ్ ఆన్సర్ బుక్‌లెట్‌ను అందించాలని అధికారులు నిర్ణయించారు. అందులో అభ్యర్థి ఫోటోతో పాటు, ఇతర వివరాలు ముద్రించి ఉంటాయి. పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు వీలుగా అభ్యర్థులకు నమూనా ఆన్సర్ బుక్‌లెట్ ఇవ్వనున్నారు. ఈనెల 17 నుంచి ఈ బుక్‌లెట్‌లు పబ్లిక్ సర్వీస్ కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తెస్తారు. అభ్యర్థులు వాటిని డౌన్‌లోడ్ చేసుకొని పరీక్ష విధానాన్ని ప్రాక్టీస్ చేసుకోవడంతో పాటు నిబంధనలను తెలుసుకోవచ్చు. వీటితో పాటు హాల్‌టికెట్లపైన ఉన్న నిబంధనలను పరిశీలించుకోవాలని, వాటిని విరుద్ధంగా వ్యవహరిస్తే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. గ్రూప్-1 మెయిన్ పరీక్షలను హైదరాబాద్(హెచ్ఎండీఏ) పరిధిలోనే నిర్వహిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.. రాష్ట్రంలో 563 గ్రూప్-1 పోస్టుల భర్తీలో భాగంగా ఇప్పటికే ప్రిలిమనరీ పరీక్షలు పూర్తిచేసి, ఫలితాలు వెల్లడించిన సంగతి తెలిసిందే. అందులో ప్రతిభకనబరిచిన వారిని ఒక్కో పోస్టుకు 50 అభ్యర్థుల చొప్పున మెయిన్ పరీక్షకు ఎంపిక చేశారు. ఇంటర్వ్యూలు లేకుండా పరీక్షల్లో చూపే ప్రతిభ ఆధారంగానే ఈ గ్రూప్-1 పోస్టులను భర్తీ చేయనున్నారు.

గ్రూపు-1 మెయిన్ పరీక్షల షెడ్యూల్ వివరాలు

పరీక్ష పేరు	తేదీ
జనరల్ ఇంగ్లీషు (క్వాలిఫై టెస్ట్)	21-10-2024
పేపర్-1 జనరల్ ఎస్సే	22-10-2024
పేపర్-2 చరిత్ర, కల్చర్ అండ్ జాగ్రఫీ	23-10-2024
పేపర్-3 ఇండియన్ సొసైటీ రాజ్యాంగం-పాలన	24-10-2024
పేపర్-4 ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్	25-10-2024
పేపర్-5 సైన్స్ అండ్ టెక్నాలజీ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్	26-10-2024
పేపర్-6 తెలంగాణ మూవ్‌మెంట్ అండ్ స్టేట్ ఫార్మేషన్	27-10-2024

లోకం తీరు



బెంగళూరు, థాణె, పుణెల్లో మెట్రో విస్తరణ

న్యూఢిల్లీ, ఆగస్టు 16: కేంద్ర మంత్రివర్గం శుక్రవారం అయిదు మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. బెంగళూరులో మెట్రో రైలు విస్తరణ, అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న మహారాష్ట్రలోని పుణె, థాణేల్లో మెట్రో రైళ్ల ఏర్పాటు ఇందులో ప్రధానమైనవి. బిహార్, ఉత్తర పశ్చిమ బెంగాల్‌లో విమానయాన సౌకర్యాలను పెంచేందుకు కూడా ఆమోదముద్ర వేసింది. ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయాలు తీసుకున్నట్లు సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. మహారాష్ట్రలో ఆధునిక మౌలిక సదుపాయాల కల్పనకు మోదీ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. జూన్‌లో అధికారం చేపట్టిన తరువాత రూ.2లక్షల కోట్ల ప్రాజెక్టులకు ఆమోదం తెలిపిందని వివరించారు. అంతకుముందు మహారాష్ట్రలోని వధవాన్‌లో రూ.76,200 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఆల్ వెదర్ మేజర్ పోర్టు నిర్మాణానికి అంగీకారం తెలిపింది. వారణాసిలో రూ.2,869 కోట్లతో అంతర్జాతీయ విమానాశ్రయం, రూ.24,657 కోట్లతో ఎనిమిది కొత్త రైల్వే లైన్లు, రూ.50,655 కోట్లతో 8 జాతీయ హైస్పీడ్ రోడ్ కారిడార్ల నిర్మాణానికి కూడా ఆమోదముద్ర వేసింది.

మోదీకి యూనస్ ఫోన్.. హిందువుల భద్రతపై హామీ

న్యూఢిల్లీ, హరిద్వార్, ఆగస్టు 16: బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు యూనస్ శుక్రవారం ప్రధాని మోదీకి ఫోన్ చేశారు. బంగ్లాలోని పరిస్థితులపై వారు చర్చించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న హిందువులు, మైనారిటీల భద్రత గురించి ప్రధాని మోదీ ఆరా తీశారు. వారికి రక్షణ కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని యూనస్ హామీ ఇచ్చారని మోదీ ఎక్స్ వేదికగా వెల్లడించారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా శుక్రవారం హరిద్వార్‌లో సాధువులు నిరసన వ్యక్తం చేశారు. హిందువులపై హింస వెంటనే ఆపకపోతే బంగ్లాదేశ్‌కు పాదయాత్ర చేస్తామని వారు హెచ్చరించారు. మరోవైపు, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గేలా కృషి చేయాలని ప్రధాని మోదీ శుక్రవారం ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమన్ నెతన్యాహూను ఫోన్లో కోరారు.

చంపేస్తారేమోనని భయమేస్తోంది: సౌదీ యువరాజు

న్యూఢిల్లీ, ఆగస్టు 16: ఇజ్రాయెల్‌తో శాంతి ఒప్పందం తన ప్రాణాల మీదకు తెస్తోందని అమెరికా చట్ట సభ్యుల ముందు సౌదీ యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ ఆందోళన వ్యక్తం చేశారు. పాలస్తీనా ఆందోళనలు పట్టించుకోకుండా సౌదీ అరేబియా-ఇజ్రాయెల్ మధ్య సంబంధాలను సాధారణస్థితికి తీసుకొస్తే.. తనను చంపుతారేమోనని భయమేస్తోందంటూ వాపోయారు. ఇజ్రాయెల్‌తో శాంతి ఒప్పందం చేసుకుని ఉగ్రవాదుల చేతుల్లో హత్యకు గురైన ఈజిప్టు మాజీ అధ్యక్షుడు అన్వర్ సాదత్ విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. సాదత్ భద్రత విషయమై ఆనాడు అమెరికా ఏం చర్యలు తీసుకుందని ఆయన ఆరా తీసినట్లు ఆ దేశ డిజిటల్ వార్తాపత్రిక 'పొలిటికో' పేర్కొంది. అయితే తనకు ప్రాణభయమున్నప్పటికీ ఇజ్రాయెల్‌తో సంబంధాల విషయంలో తాను ముందుకెళ్లడానికే నిశ్చయించుకున్నట్లు సౌదీ యువరాజు స్పష్టం చేశారు.

మన సీఎం అభ్యర్థి ఎవరో తేల్చండి: ఉద్ధవ్ ఠాక్రే

ముంబై, ఆగస్టు 16: త్వరలో ఎన్నికలు జరగనున్న మహారాష్ట్రలో మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ) తరఫున సీఎం అభ్యర్థి ఎవరో ముందుగానే తేల్చాలని మాజీ సీఎం, శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే డిమాండ్ చేశారు. కాంగ్రెస్, ఎన్సీపీల నుంచి ఎవరిని ప్రకటించినా తన మద్దతు ఉంటుందన్నారు. ఎక్కువ సీట్లు గెలిచిన పార్టీ నాయకుడే సీఎం అనే పద్ధతిని పక్కనపెట్టాలని సూచించారు. శుక్రవారం ముంబైలో జరిగిన ఎంవీఏ భేటీలో ఉద్ధవ్ ఈ ప్రతిపాదన చేశారు. ఎంవీఏ సీఎం అభ్యర్థిని తేల్చాలన్న ఉద్ధవ్ సూచనపై సమావేశంలో పాల్గొన్న ఎన్సీపీ (ఎస్పీ) అధ్యక్షుడు శరద్‌పవార్ మౌనం దాల్చారు. రాష్ట్రంలో పరిస్థితి మారాలంటే బీజేపీ సారథ్యంలోని మహాయుతి కూటమిని ఓడించడమే ఏకైక లక్ష్యం కావాలని పిలుపునిచ్చారు. సమాజ్‌వాదీ, వామపక్షాలతో కలిసి సంఘటిత శక్తిగా ప్రజల ముందుకెళ్దామని పేర్కొన్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్ పేరుతో రూ.400 కోట్ల మోసం

న్యూఢిల్లీ, ఆగస్టు 16: ఆన్‌లైన్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్ యాప్ పేరుతో రూ.400 కోట్ల మేర మోసం చేసిన నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఈడీ తెలిపింది. చైనాకు చెందిన 'ఫీవిన్' యాప్‌తో వారికి సంబంధం ఉందని పేర్కొంది. ఒడిశాలోని రౌర్కెలాకు చెందిన అరుణ్ సాహు, అలోక్ సాహు, పట్నాకు చెందిన సివిల్ ఇంజినీరు చేతన్ ప్రకాశ్, చెన్నైకి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీరు జోసెఫ్ స్టాలిన్‌లను మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద అరెస్టు చేసింది. అరుణ్ సాహు, అలోక్ సాహులు యాప్ ద్వారా తమ బ్యాంకు ఖాతాలో జమైన సొమ్మును క్రిప్టో కరెన్సీగా మార్చారు. దానిని ఫారిన్ క్రిప్టో ఎక్స్ఛేంజ్ అయిన బియాన్స్ ద్వారా చైనా జాతీయుల ఖాతాలకు అక్రమంగా మళ్లించారు. మరోవైపు, పోంజీ స్కీం నడిపి జనాలను మోసగించిన పెరల్‌వైన్.కామ్ అనే పోర్టల్‌కు చెందిన రూ.29.25 కోట్ల ఆస్తులను జప్తు చేసినట్టు ఈడీ తెలిపింది.

అనంత్ టెక్నాలజీస్ 'సెంచరీ'

- ఇస్రో ప్రయోగించిన 100 ఉపగ్రహాలకు విడి భాగాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఇస్రో శుక్రవారం విజయవంతంగా ప్రయోగించిన ఎస్ఎస్ఎల్‌వీ-డీ3కి హైదరాబాద్‌కు చెందిన అనంత్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్, ఎస్ఈసీ ఇండస్ట్రీస్, ఎంటార్ టెక్నాలజీస్ సంస్థలు కీలక విడిభాగాలు అందించాయి. ఈవోఎస్-8 ఉపగ్రహానికి, ఎస్ఎస్ఎల్‌వీ-డీ3 రాకెట్ రెండింటికీ అనంత్ టెక్నాలజీస్ లిమిటెడ్ (ఏటీఎల్) కీలక భాగాలను సమకూర్చింది. ఇస్రోకు తాము విడిభాగాలు అందించిన 100వ ఉపగ్రహం ఈవోఎస్-8 అని, 80 ఉపగ్రహ వాహక నౌకలకూ విడి భాగాలు అందించామని ఏటీఎల్ చైర్మన్, ఎండీ డాక్టర్ పావులూరి సుబ్బారావు తెలిపారు. ఈవోఎస్-8లోని ఇంటర్నల్ రిఫరెన్స్ యూనిట్‌కు పవర్ కన్వర్టర్ మాడ్యూళ్లు అందించామని, ఇది ఉపగ్రహ నావిగేషన్ డేటాను చేరవేస్తుందని ఏటీఎల్ వివరించింది. ఎస్ఎస్ఎల్‌వీ-డీ3కి నావిగేషన్, గైడెన్స్, కంట్రోల్ వ్యవస్థ (ఎన్‌జీసీ), పైరో సిస్టమ్, ఎన్‌జీసీకి పవర్ స్విచింగ్ మాడ్యూల్, టెలీమెట్రీ, ట్రాకింగ్, కంట్రోల్ ప్యాకేజీలు (టీటీసీపీ) సమకూర్చినట్లు పేర్కొంది. 120 టన్నుల బరువున్న ఎస్ఎస్ఎల్‌వీ రాకెట్‌కు ఎస్ఈసీ ఇండస్ట్రీస్ స్టేజ్-1 రాకెట్ మోటార్‌ను అందించింది. ఉపగ్రహాలను అంతరిక్ష కక్ష్యలో ప్రవేశపెట్టడానికి అవసరమైన గమన వేగం అందించడంలో ఈ రాకెట్ మోటార్ కీలకంగా ఉంటుందని ఎస్ఈసీ ఎండీ డి.విద్యాసాగర్ తెలిపారు.

రెండు రాష్ట్రాల్లో ఎన్నికల నగారా

జమ్మూకశ్మీర్, హరియాణా అసెంబ్లీ ఎన్నికల షెడ్యూలు విడుదల

- జమ్మూకశ్మీర్ శాసనసభకు 3 దశల్లో
- హరియాణా అసెంబ్లీకి అక్టోబరు 1న
- 2 రాష్ట్రాల్లోనూ అక్టోబరు 4న ఫలితాలు



విలేకరుల సమావేశంలో ఎన్నికల కమిషనర్లు జ్ఞానేశ్, రాజీవ్‌కుమార్, సుఖ్‌బీర్

న్యూఢిల్లీ, ఆగస్టు 16: రెండు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల నగరా మోగింది. జమ్మూకశ్మీర్‌లో మూడు దశల్లో (సెప్టెంబరు 18, 25, అక్టోబరు 1).. హరియాణాలో అక్టోబరు 1న శాసనసభ ఎన్నికలు నిర్వహించనున్నట్టు కేంద్ర ఎన్నికల కమిషన్ శుక్రవారం వెల్లడించింది. అక్టోబరు 4న కౌంటింగ్ జరిపి ఫలితాలను ప్రకటించనున్నట్టు తెలిపింది. ఆర్టికల్ 370 నిర్వీర్యం తర్వాత.. జమ్మూకశ్మీర్‌లో ఎన్నికలు జరగడం ఇదే మొదటిసారి. చివరిసారిగా అక్కడ 2014లో ఐదు దశల్లో ఎన్నికలు జరిగాయి. అప్పట్లో ఏర్పాటైన పీడీపీ-బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం 2018లో పడిపోయింది. ఆ తర్వాత జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మోదీ 2.0 సర్కారు ఏర్పాటయ్యాక.. 2019 ఆగస్టు 5న.. జమ్మూకశ్మీర్‌కు స్వతంత్ర ప్రతిపత్తి కల్పించే 370 అధికరణను రద్దు చేసింది. ఆ నిర్ణయం సరైనదేనని పేర్కొంటూ గత ఏడాది డిసెంబరులో తీర్పునిచ్చిన ఐదుగురు సభ్యుల సుప్రీం రాజ్యాంగ ధర్మాసనం.. ఈ ఏడాది సెప్టెంబరు 30లోగా ఆ రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు జరిపించాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలోనే ఎన్నికల కమిషన్ షెడ్యూలు ప్రకటించింది. అయితే, మూడో దశ ఎన్నిక.. అక్టోబరు 1న, అంటే సుప్రీంకోర్టు పెట్టిన గడువు (సెప్టెంబరు 30) తర్వాత జరగడంపై కేంద్ర ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్‌ను మీడియా ప్రశ్నించింది. దీనికి ఆయన.. కోర్టు తీర్పునిచ్చింది 2023 డిసెంబరులో అని, ఆ వెంటనే సార్వత్రిక ఎన్నికలువచ్చాయని గుర్తుచేశారు. ఆ ఎన్నికల ప్రక్రియ జూన్ 4 నాటికి ముగిసిందని.. ఆ తర్వాత వాతావరణం బాగోలేదని, అమర్‌నాథ్‌యాత్ర మొదలైందని.. ఆ యాత్ర ఆగస్టు 19న ముగుస్తోందని పేర్కొన్నారు. కశ్మీర్‌లో పండగల సీజన్, యాపిల్స్ సీజన్, ట్యులిప్స్ సీజన్.. ఇలా అన్నింటినీ దృష్టిలో పెట్టుకుని ఈ తేదీలు ఎంపిక చేశామని చెప్పారు. ఒక్కరోజు అటూ ఇటూ అవడం పెద్ద విషయమేమీ కాదని.. సుప్రీం కోర్టు తీర్పు స్ఫూర్తికి అనుగుణంగా ఎన్నికలు నిర్వహిస్తున్నామా లేదా అన్నదే ముఖ్యమని స్పష్టం చేశారు. అయినా, ఈ ఎన్నికలు సుప్రీం పెట్టిన గడువులోపే మొదలవుతున్నాయని.. నిర్ణీత షెడ్యూలు ప్రకారం ముగుస్తాయని స్పష్టం చేశారు. ఎన్నికల నిర్వహణను తామేమీ ఆలస్యం చేయలేదని తేల్చిచెప్పారు. జమ్మూకశ్మీర్‌లో 90 లక్షల మంది రిజిస్టర్డ్ ఓటర్లున్నారని.. ఈ ఏడాది అక్కడ జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 58.46 శాతం మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని.. ఇది మూడున్నర దశాబ్దాల గరిష్ఠమని గుర్తుచేశారు. కాగా, జమ్మూకశ్మీర్ మొత్తం 90 స్థానాలకుగాను.. సెప్టెంబరు 18న తొలి దశలో 24 స్థానాలకు, రెండో దశలో 26 సీట్లకు.. మూడో దశలో 40 సీట్లకు ఎన్నికలు నిర్వహించనున్నారు.

మహారాష్ట్రలో ఇప్పుడే కాదు!

గత మూడు దఫాలుగా (2009, 2014, 2019) హరియాణాతోపాటే మహారాష్ట్రలోనూ ఎన్నికలు నిర్వహించారు. ఆ లెక్క ప్రకారం ఇప్పుడు హరియాణాతో పాటే అక్కడ కూడా ఎన్నికలు జరపాలి. కానీ మహారాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికల షెడ్యూలు ప్రకటించలేదు. దీనిపై సీఈసీని ప్రశ్నించగా.. జమ్మూకశ్మీర్‌లో భారీస్థాయిలో భద్రతా ఏర్పాట్లు చేయాల్సి ఉందని.. మహారాష్ట్రలో ప్రస్తుతం వానాకాలం కారణంగా ఓటర్ల జాబితా అప్‌డేట్ చేయడం ఆలస్యమవుతోందని.. దీనికితోడు పితృపక్షాలు, వినాయక చవితి, దీపావళి వంటి పండుగలు, ఆధ్యాత్మిక కార్యక్రమాల సీజన్ నడుస్తోందని.. కాబట్టి మహారాష్ట్ర ఎన్నికల షెడ్యూలును తర్వాత ప్రకటిస్తామని సమాధానమిచ్చారు. ఈ రెండు రాష్ట్రాల్లో ఎన్నికలు పూర్తయ్యాక.. మహారాష్ట్ర, ఝార్ఖండ్, ఢిల్లీ ఎన్నికలను నిర్వహించే అవకాశం ఉందని సమాచారం. కాగా.. మహారాష్ట్రలో ఎన్నికలు నిర్వహించకపోవడానికి కేంద్ర ఎన్నికల కమిషన్ చెప్పిన కారణాలపై శివసేన (ఉద్ధవ్ వర్గం) నేత ఆదిత్య ఠాక్రే స్పందించారు. "బహుశా వారి బాస్ (కేంద్రప్రభుత్వం) మహారాష్ట్రలో ఎన్నికలు నిర్వహించడానికి ఇంకా అనుమతి ఇచ్చి ఉండకపోవచ్చు" అని వ్యంగ్యంగా ట్వీట్ చేశారు. "మహారాష్ట్రలో ప్రస్తుతం అధికారంలో ఉన్న రాజ్యాంగవిరుద్ధమైన, చట్టవిరుద్ధమైన బీజేపీ-మిందే సర్కారుకు కొనసాగే నైతిక అర్హత లేదు. ప్రజలు వారిని ఒకసారి తిరస్కరించారు. మళ్లీ తిరస్కరిస్తారు. అందుకే ఈసీ వారికి కాస్త ఊపిరి పీల్చుకోవడానికి, రాష్ట్రాన్ని లూటీ చేయడానికి వారి కాంట్రాక్టర్లకు సమయం ఇస్తోంది" అని దుయ్యబట్టారు. మరోవైపు.. ఎన్నికల షెడ్యూలు ప్రకటనకు 12 గంటల ముందు జమ్మూకశ్మీర్‌లో భారీస్థాయిలో 198 మంది ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. వీరిలో ఐదుగురు డిప్యూటీ కమిషనర్లు, 10 మంది సీనియర్ సూపరింటెండెంట్స్ ఆఫ్ పోలీస్ సహా 83 మంది పోలీసు అధికారులున్నారు.

ఆర్థిక సేవల శాఖ కార్యదర్శిగా

నాగరాజు మద్దిరాల

భారీగా కేంద్ర కార్యదర్శుల బదిలీ



న్యూఢిల్లీ, ఆగస్టు 16: కేంద్ర ప్రభుత్వం శుక్రవారం భారీగా కార్యదర్శులను బదిలీ చేసింది. ఆర్థిక, రక్షణ, ఆరోగ్యం, మైనార్టీల సంక్షేమం తదితర శాఖలకు కొత్త కార్యదర్శులను నియమించింది. ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శిగా పుణ్య సలిల శ్రీవాత్సవ నియమితులయ్యారు. ఆమె ప్రస్తుతం ప్రధాని కార్యాలయంలో ప్రత్యేక కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఆరోగ్య శాఖలో తొలుత ఆమె ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీగా (ఓఎస్‌డీ) చేరనున్నారు. ప్రస్తుత కార్యదర్శి అపూర్వ చంద్ర సెప్టెంబరు 30న పదవీ విరమణ చేసిన అనంతరం పూర్తి బాధ్యతలు చేపట్టనున్నారు. రక్షణ శాఖ కార్యదర్శిగా రాజేష్ కుమార్ సింగ్ నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఆయన కూడా రక్షణ శాఖలో ఓఎస్‌డీగా చేరనున్నారు. రక్షణ శాఖ కార్యదర్శి అరమనే గిరిధర్ అక్టోబరు 31న పదవీ విరమణ చేసిన అనంతరం ఆ శాఖ కార్యదర్శిగా పూర్తి బాధ్యతలు చేపట్టనున్నారు. మైనార్టీ వ్యవహారాల కార్యదర్శి కటికితల శ్రీనివాస్.. హౌసింగ్- అర్బన్ వ్యవహారాల కార్యదర్శిగా నియమితులయ్యారు. బొగ్గు శాఖ అదనపు కార్యదర్శి నాగరాజు మద్దిరాల ఆర్థిక వ్యవహారాల కార్యదర్శిగా బదిలీ అయ్యారు. ఆర్థిక శాఖ వ్యవహారాల కార్యదర్శి వివేక్ జోషి.. సిబ్బంది, శిక్షణ శాఖ కార్యదర్శిగా నియమితులయ్యారు. రాష్ట్రపతి కార్యదర్శిగా దీప్తి ఉమాశంకర్ బదిలీ అయ్యారు.

ఆదివారంలోగా కేసును తేల్చేయాలి

కోల్‌కతా, న్యూఢిల్లీ, ఆగస్టు 16: జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటన నేపథ్యంలో బెంగాల్ సీఎం మమత రాజీనామా చేయాలంటూ శుక్రవారం ఆ రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ ర్యాలీలు చేపట్టింది. బెంగాల్‌లో శాంతి భద్రతలు అదుపుతప్పాయని.. పాకిస్థాన్, అఫ్ఘానిస్థాన్‌లో మాదిరి పరిస్థితులు నెలకొన్నాయని వ్యాఖ్యానించింది. అయితే బీజేపీ డిమాండ్‌ను టీఎంసీ సీనియర్ నేత కునాల్ ఘోష్ తప్పుబట్టారు. మరోవైపు.. జూనియర్ వైద్యురాలి కుటుంబానికి న్యాయం చేయాలని.. హత్యాచార దోషులకు మరణశిక్ష విధించాలని డిమాండ్ చేస్తూ సీఎం మమత శుక్రవారం కోల్‌కతాలో ర్యాలీ నిర్వహించారు. వైద్యురాలిపై అత్యాచారం, హత్య వెనుక వాస్తవాలను మరుగున పరిచేందుకే బీజేపీ, సీపీఎం కలిసి ఆర్జీ కర్ ఆస్పత్రిపై దాడికి పాల్పడ్డాయని మమత ఆరోపించారు. హత్యాచారం కేసును ఆదివారంలోగా సీబీఐ అధికారులు తేల్చేయాలని.. దోషులను ఉరితీయాలని ఆమె డిమాండ్ చేశారు.

కోయంబత్తూరులో మహిళా డాక్టర్‌పై అత్యాచారయత్నం

చెన్నై, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని కోయంబత్తూరు వైద్యకళాశాల ఆసుపత్రి వద్ద బుధవారం రాత్రి ఓ మహిళా వైద్యురాలిపై అత్యాచారయత్నానికి పాల్పడిన ఆగంతకుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటనను ఖండిస్తూ కోయంబత్తూరు ఆసుపత్రి వైద్యులు సుమారు 150 మంది గురువారం ధర్నా నిర్వహించారు. బుధవారం రాత్రి ఆ మహిళా వైద్యురాలు వాహనాల పార్కింగ్ ప్రాంతంలో తన స్కూటర్‌ను తీసుకునేందుకు వెళుతుండగా ఆమెను వెంబడించిన ఓ వ్యక్తి అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు. ఈ విషయమై ఆ ఆసుపత్రి డీన్ డాక్టర్ నిర్మల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని ఆ దుండగుడిని అరెస్టు చేశారు. ఆసుపత్రిలో పనిచేస్తున్న మహిళా వైద్యులకు పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు కల్పించామని, ఆగంతకులు ఎవరూ చొరబడకుండా ఉండేందుకు ఇటీవలే వెనుక వైపు గేటును కూడా మూసివేశామని డీన్ ఈ సందర్భంగా తెలిపారు.

బెంగాల్ సర్కారు వైఫల్యం వల్లే..

- 7వేల మంది గుమిగూడితే ఇంటెలిజెన్స్ ఏంచేస్తోంది.. ఆర్జీ కర్ ఆస్పత్రిపై దాడి ఘటనపై కలకత్తా హైకోర్టు వ్యాఖ్య
- హత్యాచారం జరిగిన ఫ్లోర్‌లోనే అర్జెంటుగా మరమ్మతులేమిటని ప్రశ్న
- ఆస్పత్రిని మూసేయిస్తామని హెచ్చరిక


హత్యాచార దోషులకు మరణశిక్ష విధించాలని మమత ర్యాలీ

కోల్‌కతా, న్యూఢిల్లీ, ఆగస్టు 16: ఆర్జీ కర్ వైద్యకళాశాల, ఆస్పత్రిపై బుధవారం అర్ధరాత్రి దుండగులు పాల్పడిన దాడి ఘటనపై కలకత్తా హైకోర్టు శుక్రవారం తీవ్రంగా స్పందించింది. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం వల్లే ఈ హింసాత్మక దాడి జరిగిందని చీఫ్ జస్టిస్ టీఎస్ శివగణం, హిరణ్మయి భట్టాచార్య ఆధ్వర్యంలోని ద్విసభ్య ధర్మాసనం తీవ్రంగా ఆక్షేపించింది. పోలీసులకంటూ ఓ ఇంటెలిజెన్స్ విభాగం ఉంటుందని.. ఆస్పత్రి వద్ద భారీ సంఖ్యలో 7వేల మంది గుమిగూడితే ఆ విభాగానికి తెలియదనుకోవాలా? కచ్చితంగా 'రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం వైఫల్యం వల్లే జరిగిన దాడి ఇది' అని వ్యాఖ్యానించింది. జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటనకు నిరసనగా దాదాపు 7వేల మంది ఆస్పత్రి ప్రాంగణం వద్ద గుమిగూడారని రాష్ట్ర ప్రభుత్వ తరపు న్యాయవాది చెప్పడంతో హైకోర్టు పైవిధంగా వ్యాఖ్యానించింది. ఆస్పత్రిపై దుండగుల దాడి వెనుక కారణం ఏమిటనేది తేల్చాలని ఆదేశించింది. విధ్వంసకర, హింసాత్మక చర్యల ద్వారా దుండగులు సృష్టించిన బీభత్సం ఆస్పత్రిలో నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యులను భయాందోళనల్లోకి నెట్టిందని.. ఆస్పత్రిలో పనిచేస్తున్న వైద్యులకు భద్రత కల్పించాలని నిర్దేశించింది. లేదంటే వారు అక్కడ వైద్య సేవలు అందించే పరిస్థితి ఉండదని పేర్కొంది. జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం జరిగిన ఆస్పత్రిలోని నాలుగో అంతస్తులోనే నవీకరణ పనులు చేపట్టినట్లుగా దృష్టికి రావడంతో కోర్టు విస్మయం వ్యక్తం చేసింది. నేరం జరిగిన ఫ్లోర్‌లోనే అంత అర్జెంటుగా మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఏమొచ్చింది? అని ప్రశ్నించింది. తాము అనుకుంటే ఆస్పత్రిని మూసివేయాలని, రోగులను ఇతర ప్రభుత్వాస్పత్రులకు తరలించాలని ఆదేశాలివ్వగలమని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆస్పత్రిపై దాడి, అనంతర పరిణామాల పట్ల వేర్వేరుగా అఫిడవిట్లు దాఖలు చేయాలని పోలీసులు, ఆస్పత్రి వర్గాలను ఆదేశించింది. హత్యాచారం కేసులో మధ్యంతర నివేదిక సమర్పించాలని సీబీఐని కోరింది. కాగా ఆర్జీ కర్ ఆస్పత్రిపై దాడిలో ఇప్పటిదాకా 19మందిని అరెస్టు చేశారు. ఇక.. జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటన, ఆర్జీ కర్ ఆస్పత్రిపై గూండాల దాడికి నిరసనగా దేశవ్యాప్తంగా అన్ని ఆస్పత్రుల్లోనూ శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి 24 గంటలపాటు 'నాన్ ఎమర్జెన్సీ' సేవలను నిలిపిస్తున్నట్లు జాతీయ వైద్య మండలి (ఐఎంఏ) ప్రకటించింది.

హత్యాచార ఘటనలో వైద్యులూ

జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటనలో నిందితుడు సంజయ్ రాయ్‌ని పోలీసులు ఇప్పటికే అరెస్టు చేశారు. అయితే ఇందులో ఒకరికి మించి నిందితులున్నారంటూ వాదిస్తున్న హతురాలి తల్లిదండ్రులు తమకు అనుమానం ఉన్న, ఆర్జీ కర్ ఆస్పత్రిలోనే పనిచేస్తున్న కొందరు వైద్యుల పేర్లను అందజేశారని సీబీఐ అధికారులు వెల్లడించారు. ఆ పేర్ల ఆధారంగా తాము 30 మంది వైద్యులను గుర్తించామని.. కేసులో భాగంగా వారిని విచారిస్తామని చెప్పారు. కాగా ఘటన జరిగిన రోజు.. విధుల్లో ఉన్న ఓ వైద్యుడు, ఇద్దరు జూనియర్ వైద్యులకు సీబీఐ అధికారులు శుక్రవారం సమన్లు జారీ చేశారు.

దాడి జరిగిన 6గంటల్లోపు ఎఫ్ఐఆర్

జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటనకు నిరసనగా ఆందోళనలు హింసాత్మకంగా మారడం.. ఆర్జీ కర్ ఆస్పత్రిపై దుండగుల దాడి నేపథ్యంలో కేంద్ర ఆరోగ్య శాఖ సీరియస్ అయింది. ఆస్పత్రిపైన, వైద్యులపైన దాడి జరిగిన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించింది. హింసాత్మక ఘటనలపై ఆరు గంటల్లోపు ఎఫ్ఐఆర్ నమోదయ్యేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాస్పత్రుల చీఫ్‌లదేనని స్పష్టం చేసింది. ఈ మేరకు ఎయిమ్స్ సహా దేశవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆస్పత్రులకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ (డీజీహెచ్ఎస్) డాక్టర్ అతుల్ గోయల్ ఆదేశాలు జారీ చేశారు. కాగా వైద్యసిబ్బంది ఎలాంటి భయాందోళనలు లేకుండా సురక్షితంగా పని చేసుకోగలమన్న భరోసా కలిగేందుకుగాను ఎయిర్‌పోర్టుల మాదిరిగా దేశవ్యాప్తంగా అన్ని ఆస్పత్రులు సేఫ్ జోన్‌లో ఉన్నట్లు ప్రకటించాలని ఐఎంఏ చీఫ్ ఆర్వీ అశోకన్ పేర్కొన్నారు. మూడంచెల భద్రతతో ఎయిర్‌పోర్టులు సేఫ్‌జోన్‌లో ఉన్నాయని.. కనీసం ప్రధాన ఆస్పత్రుల్లో సెక్యూరిటీ ప్రొటోకాల్ ఉండాలన్నారు.

ఎస్ఎస్ఎల్వీ-డీ3 ప్రయోగం సక్సెస్

- 17 నిమిషాల్లో రోదసీలోకి ఈవోఎస్-08
- మరింత కచ్చితంగా విపత్తుల సమాచారం


నాలుగో దశలో విడిపోతున్న ఉపగ్రహం

సూళ్లూరుపేట, ఆగస్టు 16: ఎస్ఎస్ఎల్వీ-డీ3 ప్రయోగం విజయవంతమైంది. దీంతో ఇస్రో మరో చారిత్రాత్మక మైలురాయికి చేరింది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని అంతరిక్ష ప్రయోగ కేంద్రం సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి శుక్రవారం ఉదయం 9.17 గంటలకు ఎస్ఎస్ఎల్వీ-డీ3 రాకెట్ ప్రయోగం చేపట్టారు. ఈ రాకెట్ ద్వారా 175.5 కిలోల బరువున్న ఈవోఎస్-08 ఉపగ్రహాన్ని రోదసీలోకి పంపారు. దీంతో పాటు ఎస్ఆర్-0, డెమోశాట్ మరో రెండు చిన్న ఉపగ్రహాలను కూడా కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. శుక్రవారం ఉదయం 9.17 గంటలకు షార్‌లోని ప్రథమ ప్రయోగ వేదికపై ఉన్న ఎస్ఎస్ఎల్వీ-డీ 3 రాకెట్ నిప్పులు చిమ్ముతూ నింగిలోకి దూసుకెళ్లింది. నాలుగు దశల్లో సునాయాసంగా ప్రయాణించిన రాకెట్ తొలుత 16నిమిషాల్లో ఈవోఎస్-08 ఉపగ్రహాన్ని భూమికి 475కిలోమీటర్ల ఎత్తులో చేర్చింది. అనంతరం నిమిషం వ్యవధిలో మరో 2చిన్న ఉపగ్రహాలను నిర్ణీత కక్ష్యలోకి చేర్చింది. ఉపగ్రహాలు కక్ష్యలోకి చేరిన వెంటనే మిషన్ కంట్రోల్ సెంటర్‌లో ఉన్న ఇస్రో చైర్మన్ ఎస్. సోమనాథ్ ఎస్ఎస్ఎల్వీ-డీ3 ప్రయోగం విజయవంతమైనట్టు ప్రకటించారు. 500 కిలోమీటర్ల ఎత్తులోని కక్ష్యలోకి తక్కువ బరువున్న ఉపగ్రహాలను ప్రవేశపెట్టేందుకు ఎస్ఎస్ఎల్వీ వాహక నౌకను రూపొందించినట్టు తెలిపారు. తాజా ప్రయోగంతో విపత్తులను మరింత కచ్చితంగా తెలుసుకునేందుకు వీలు కలగనుంది. అదేవిధంగా సముద్ర మట్టాలు, అగ్నిపర్వతాల పరిస్థితిని కూడా అంచనావేయొచ్చు. ఈ ఉపగ్రహం ఏడాది పాటు పనిచేయనుంది. మూడేళ్లపాటు తీవ్రంగా శ్రమించిన ఇస్రో శాస్త్రవేత్తలు.. స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్(ఎస్ఎస్ఎల్వీ)ను రూపొందించడంలో విజయం సాధించారు. దీంతో ఇంధన ఆదాతో పాటు తక్కువ ఖర్చుతో విదేశీ ఉపగ్రహాలను రోదసీలోకి పంపేందుకు శ్రీకారం చుట్టారు. ప్రపంచ దేశాల్లో భారత శాస్త్రవేత్తల సత్తా ఏమిటో నిరూపించారు. ఇప్పటి వరకు ఇస్రో ప్రయోగించిన 5 రకాల రాకెట్లతో పాటు ప్రస్తుతం సరికొత్త రాకెట్ చేరింది. ఏఎస్ఎల్వీ, ఎస్ఎల్వీ, పీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ-మార్క్3 తర్వాత ఎస్ఎస్ఎల్వీ ఆరో వరుసలో ఆరో రాకెట్‌గా చేరింది. ఎస్ఎస్ఎల్వీ-డీ3 ప్రయోగం విజయవంతం కావడం పట్ల ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. భారత అంతరిక్ష రంగంలో ఇది అతిగొప్ప మైలురాయి అని పేర్కొన్నారు.

క్రయోస్పియర్ అధ్యయనం..

భారత రాకెట్ ప్రయోగాల్లో ఇప్పుడు సరికొత్త వాహక నౌక చేరిందని ఇస్రో చైర్మన్ సోమనాథ్ అన్నారు. ఈవోఎస్-08 భూ పరిశీలన ఉపగ్రహమని, ఇందులో ఉండే ఎలక్ట్రో ఆప్టికల్ ఇన్‌ఫ్రారెడ్(ఈవోఐఆర్) పేలోడ్ మిడ్‌వేవ్, లాంగ్‌వేవ్ ఇన్‌ఫ్రా-రెడ్‌లో చిత్రాలను క్యాప్చర్ చేసి పంపిస్తుందన్నారు. విపత్తు నిర్వహణలో ఈ సమాచారం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈవోఎస్-08 ఉపగ్రహం హిమాలయాల్లోని క్రయోస్పియర్ అధ్యయనం కోసం ప్రధానంగా పని చేస్తుందన్నారు. భవిష్యత్‌లో బుల్లి ఉపగ్రహాలను తక్కువ ఎత్తులోకి ఈ రాకెట్ ద్వారా పంపేందుకు సులువుగా ఉంటుందన్న ఉద్దేశంతో ఎస్ఎస్ఎల్వీ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. ఇకపై చిన్న ఉపగ్రహాలు ఎస్ఎస్ఎల్వీ వాహక నౌక ద్వారానే పంపుతామన్నారు. ఈ ఏడాది డిసెంబరులో గగన్‌యాన్ ప్రయోగం కూడా ఉంటుందన్నారు. దీంతో పాటు పీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ-మార్క్3 ప్రయోగం ఉంటుందని వెల్లడించారు.

శత్రు విధ్వంసక ఆత్మాహుతి డ్రోన్

- వెయ్యి కి.మీ.ల రేంజ్
- స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ఎన్ఏఎల్



న్యూఢిల్లీ, ఆగస్టు 16: శత్రుదేశాల గుండెల్లో గుబులు పుట్టించగల స్వీయ విధ్వంసక డ్రోన్‌ను 'నేషనల్ ఏరోస్పేస్ ల్యాబొరేటరీస్' (ఎన్ఏఎల్) పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించింది. 30 హెచ్‌పీ సామర్థ్యం గల ఇంజిన్‌తో కూడిన ఈ డ్రోన్ వెయ్యి కి.మీ.ల దూరంలోని లక్ష్యాలను కూడా చేదించగలదు. దాదాపు 40 కిలోల బరువైన పేలుడు పదార్థాలను మోసుకెళ్లగలుగుతుంది. కమాండ్ సెంటర్ నుంచి నియంత్రించగలిగే ఈ మానవ రహిత డ్రోన్.. లక్ష్యం వద్దకు చేరుకోగానే పేలిపోయి లక్ష్యాన్ని ధ్వంసం చేస్తుంది. శత్రువుల రాడార్లకు, రక్షణ వ్యవస్థలకు దొరకకుండా ఈ డ్రోన్‌ను ప్రయోగించటానికి వీలవుతుంది. అంతేకాదు, జీపీఎస్ సంకేతాలను శత్రువులు అడ్డుకుంటే కూడా దీనిని నడపవచ్చు. ఇస్రో అభివృద్ధి చేసిన నావిక్ నావిగేషన్ సిస్టమ్ ద్వారా డ్రోన్‌ను ఆపరేట్ చేయవచ్చు. ఎన్ఏఎల్ డ్రోన్‌ను దేశీయ కామకాజీగా వ్యవహరిస్తున్నారు. రెండో ప్రపంచయుద్ధంలో జపాన్ వాయుసేనకు చెందిన ఒక ఆత్మాహుతి దళాన్ని కామకాజీగా పిలిచేవారు. ఈ దళంలోని పైలట్లు పేలుడు పదార్థాలతో నింపిన విమానాలను శత్రువుల నౌకలు, సైన్యాలపైకి తీసుకెళ్లి ఢీకొట్టేవారు.



హరీశ్.. దమ్ముంటే రాజీనామా చెయ్

» హైదరాబాద్‌లో మైనంపల్లి అభిమానుల పేరిట ఫ్లెక్సీలు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): 'రుణమాఫీ అయిపోయె.. నీ రాజీనామా ఏడబోయె.. రాజీనామాకు భయపడి బాలిలో మకాం వేశావు.. హరీశ్‌రావు.. దమ్ముంటే రాజీనామా చెయ్' అని పేర్కొంటూ మైనంపల్లి అభిమానుల పేరిట ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు హైదరాబాద్‌లో కలకలం రేపాయి. సికింద్రాబాద్, బేగంపేట, ప్యాట్నీ, ప్యారడైజ్, రసూల్‌పురా ప్రాంతాల్లో ఈ ఫ్లెక్సీలు దర్శనమిచ్చాయి. అదేవిధంగా పలు చోట్ల బస్టాప్‌లకు ఫ్లెక్సీలు.. కరీంనగర్ వైపు వెళ్లే రాజీవ్ రహదారి మార్గంలో హోర్డింగ్‌లు పెట్టారు. రేవంత్ ఇచ్చిన మాట ప్రకారం రూ.2 లక్షల రుణ మాఫీ చేశారని.. సవాల్‌కు కట్టుబడి హరీశ్ రాజీనామా చేయాలని అందులో డిమాండ్ చేశారు.

తీరు మార్చుకోకపోతే వేటు తప్పదు

» అంగన్‌వాడీలకు నాణ్యమైన వస్తువులు సరఫరా చేయాలి

» సరఫరాదారులతో సమావేశంలో మంత్రి సీతక్క

హైదరాబాద్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలకు నాణ్యమైన వస్తువులను సరఫరా చేయాలని, లేకపోతే కాంట్రాక్టులను రద్దు చేస్తామని సరఫరాదారులను మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం సచివాలయంలో ఆమె సరఫరాదారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. అంగన్‌వాడీలకు నాసిరకం గుడ్లు ఎందుకు వస్తున్నాయని ఆమె ప్రశ్నించారు. అంగన్ వాడీ కేంద్రాల్లో అందించే కోడిగుడ్ల విషయంలో సమస్యలు లేవని, ఇంటికి తీసుకెళ్లే(టేక్‌హోమ్ రేషన్) గుడ్లను సకాలంలో వాడకపోవడం వల్ల ముగిరిపోతున్నాయని సరఫరాదారులు వివరించారు. నాణ్యతలేని వస్తువులు వస్తే తిరస్కరించాలని అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బందికి సీతక్క సూచించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కోడిగుడ్ల రేట్లను పెంచాలని, గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేసి బిల్లులు చెల్లించాలని సరఫరాదారులు మంత్రిని కోరారు. అయితే ఒప్పందాల్లో కుదుర్చుకున్న నిబంధనలను ఉల్లంఘించి, ధరలు పెంచే ప్రసక్తే లేదని సీతక్క చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో అంగన్‌వాడీల బిల్లుల చెల్లింపునకు గ్రీన్‌ఛానెల్ ఉండేదని, ఆ విధానాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వం రద్దు చేసిందని తెలిపారు. పదేళ్లలో ఈ వ్యవస్థ గాడి తప్పిందని, తమ ప్రభుత్వం మళ్లీ దానిని గాడినపెడుతోందని అన్నారు.

లాయర్ పరీక్షలు రాస్తున్న సీతక్క

మంత్రి సీతక్క లాయర్ పరీక్షలు రాస్తున్నారు. ఉస్మానియా యూనివర్శిటీలో శుక్రవారం నుంచి ప్రారంభమైన ఎల్.ఎల్.ఎమ్ రెండో సంవత్సర పరీక్షలకు హాజరయ్యారు. మంత్రిగా శాఖా పరమైన సమీక్షలు, జిల్లాల పర్యటనలు, అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటూనే మరోవైపు పరీక్షలకు సన్నద్ధమయ్యారు. పరీక్షకు వెళ్లేముందు తన నివాసంలో పుస్తకాలను చదువుతున్న వీడియో ఒకటి సామాజిక మాధ్యమాల్లో వైరలైంది.

ఆ వ్యాఖ్యలపై విచారం వ్యక్తం చేస్తున్నా

» అక్కాచెల్లెళ్లను కించపర్చే ఉద్దేశం లేదు: కేటీఆర్

హైదరాబాద్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణానికి సంబంధించి తాను చేసిన వ్యాఖ్యలపై విచారం వ్యక్తం చేస్తున్నట్లు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. రాష్ట్రంలోని అక్కాచెల్లెళ్లను కించపర్చే ఉద్దేశం తనకు లేదన్నారు. "మనిషికో బస్సు పెడితే కుటుంబమంతా పోయి మంచిగా కుట్లు, అల్లికలు.. అవసరమైతే బ్రేక్ డ్యాన్స్‌లు, రికార్డింగ్ డ్యాన్స్‌లు చేసుకుంటారు" అంటూ కేటీఆర్ గురువారం వ్యాఖ్యానించగా.. తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. దీనిపై ఆయన స్పందిస్తూ.. పార్టీ సమావేశంలో యథాలాపంగా చేసిన వ్యాఖ్యల వల్ల సోదరీమణులకు మనస్తాపం కలిగి ఉంటే.. విచారం వ్యక్తం చేస్తున్నానని 'ఎక్స్'లో ప్రకటించారు.

కేటీఆర్‌కు మహిళా కమిషన్ నోటీసులు

హైదరాబాద్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు రాష్ట్ర మహిళా కమిషన్ నోటీసులు పంపింది. ఆగస్టు 24న విచారణకు హాజరు కావాలని పేర్కొంది. ఈ మేరకు కమిషన్ అధికారిక 'ఎక్స్' ఖాతాలో శుక్రవారం పోస్టు చేసింది. ఇదే విషయమై కమిషన్ చైర్‌పర్సన్ శారద కూడా 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. రాష్ట్రంలోని మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే అంశంపై వారిని కించపరిచేలా కేటీఆర్ మాట్లాడారన్న విషయం తమ దృష్టికి వచ్చిందని, దీనిని కమిషన్ సుమోటోగా స్వీకరించిందని అన్నారు.

రేవంత్‌పై చీటింగ్ కేసు పెట్టాలి

రుణమాఫీ పేరిట రైతులను మోసగించారు

» 100% చేసినట్లు నిరూపించండి

» రాజీనామా చేసి.. రాజకీయ సన్యాసం తీసుకుంటా: కేటీఆర్



హైదరాబాద్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): రుణమాఫీ పేరిట రైతులను మోసగించిన సీఎం రేవంత్‌రెడ్డిపై చీటింగ్ కేసు పెట్టాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. "అసెంబ్లీ ఎన్నికలకు ముందు రూ.40వేల కోట్ల మేర రుణాలను మాఫీ చేస్తామని రేవంత్ ప్రకటించారు. పార్లమెంట్ ఎన్నికలకు వచ్చేసరికే ఆ మొత్తాన్ని రూ.31వేల కోట్లకు తగ్గించారు. ఇప్పుడు మాఫీ పేరిట రైతుల ఖాతాల్లో వేసింది రూ.17,934కోట్లు మాత్రమే. ఈ మాత్రానికే హరీశ్‌రావు రాజీనామా చేయాలని రంకెలు వేస్తున్నారు. రేవంత్‌రెడ్డికి దమ్ముంటే రైతులకు వందశాతం రుణ మాఫీ జరిగినట్లు నిరూపించాలి. సీఎం సొంత నియోజకవర్గంలో ఏదైనా గ్రామానికి మీడియాతో కలిసి వెళ్దాం. అక్కడ వంద శాతం రుణమాఫీ జరిగిందని ఒక్క రైతు చెప్పినా.. నేను నా పదవికి రాజీనామా చేయడమే కాకుండా రాజకీయ సన్యాసం చేస్తా" అని ప్రకటించారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రుణమాఫీలో సవాలక్ష కొర్రీలు, ఆంక్షలు విధించి ఎక్కువ మందిని అనర్హులుగా నిర్ణయించారన్నారు. సెక్యూరిటీ లేకుండా ప్రజల్లోకి వెళితే.. రేవంత్‌రెడ్డిని ప్రజలు ఫుట్‌బాల్ ఆడతారని వ్యాఖ్యానించారు. తెలంగాణలో బాక్రానంగల్ అంటూ రేవంత్‌రెడ్డి మాట్లాడడం చూస్తే.. ఆయన మానసిక పరిస్థితి బాగోలేదేమోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. తమ పార్టీ నాయకులు నియోజకవర్గాల్లో పరిశీలించి రైతుల కష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తారని, అందరికీ రుణమాఫీ చేయకుంటే కోర్టుకైనా వెళ్తామని కేటీఆర్ పేర్కొన్నారు. కాగా, తమిళనాడులోని కీలక పార్టీలతోపాటు ఏపీలోని టీడీపీ, వైఎస్సార్‌సీపీ పని తీరుపై అధ్యయనం చేసి.. తమ పార్టీలో అవసరమైన మార్పులు చేస్తామని కేటీఆర్ చెప్పారు. కాగా, ప్రెసిడెంట్ మెడల్ ఫర్ గ్యాలంటరీ అవార్డు అందుకున్న మాదాపూర్ సీసీఎస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ యాదయ్యకు ఎక్స్ వేదికగా కేటీఆర్ అభినందనలు తెలిపారు.

కేటీఆర్ బహిరంగ క్షమాపణ చెప్పాలి: సురేఖ

హైదరాబాద్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): నోటికొచ్చినట్టు దుర్భాషలాడి యథాలాపంగా చేసిన వ్యాఖ్యలంటూ 'ఎక్స్' వేదికగా విచారం వ్యక్తం చేసినంత మాత్రాన సరిపోదని, కేటీఆర్ అహంకారపు మాటలను తెలంగాణ మహిళా సమాజం మర్చిపోదని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణానికి సంబంధించి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ నేతల ముందు బహిరంగంగా చేసిన వ్యాఖ్యలకు బహిరంగంగానే క్షమాపణ చెప్పి ముక్కు నేలకు రాయాలని డిమాండ్ చేశారు. ఉచిత ప్రయాణ పథకంపై బీఆర్ఎస్ నాయకులకు మొదటి నుంచీ చిన్నచూపే ఉందని ధ్వజమెత్తారు. కాగా, ఆంధ్రాలో చదువుకున్న కేటీఆర్‌కు అక్కడి రికార్డింగ్ డ్యాన్స్‌ల సంస్కృతి ఒంటపట్టినట్టుందని కాంగ్రెస్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఫ్రస్టేషన్‌లో ఉన్న కేటీఆర్, హరీశ్.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏ మంచి పని చేసినా విషం చిమ్ముతూనే ఉన్నారని దుయ్యబట్టారు. మహిళలకు కేటీఆర్.. బహిరంగ క్షమాపణ చెప్పకుంటే.. వారు చీపుర్లతో ఆయనకు సమాధానం చెబుతారని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య హెచ్చరించారు. మహిళలపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి తెలిపారు. బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కేటీఆర్ ఇకనైనా పద్ధతి మార్చుకోకపోతే మహిళా సమాజమే ఆయనతో బ్రేక్ డ్యాన్స్ చేయిస్తుందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణీ రుద్రమ పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఎన్నికల పోరు!

జమ్మూకశ్మీర్, హర్యానా అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం శుక్రవారం ప్రకటించింది. ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్మూకశ్మీర్‌లో తొలిసారిగా అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్నాయి. మొత్తం 90స్థానాలకు మూడుదశల్లో పోలింగ్ జరిగి అక్టోబర్ 4న ఫలితాలు వెలువడతాయి. హర్యానాలోనూ 90స్థానాలే కానీ, అక్కడ ఒకదశలోనే, అంటే జమ్మూకశ్మీర్ ఆఖరుదశ పోలింగ్ అక్టోబర్ ఒకటి నాడు ఈ రాష్ట్రంలో అన్నిస్థానాలకు పోలింగ్ జరుగుతుంది. ఈ ఏడాది నవంబరులో మహారాష్ట్ర, హర్యానా, వచ్చే ఏడాది జనవరిలో జార్ఖండ్ అసెంబ్లీల గడువు ముగుస్తుంది. మహారాష్ట్ర, హర్యాణా అసెంబ్లీ ఎన్నికలను ఒకేమారు కలిపి నిర్వహించే సంప్రదాయాన్ని ఈ మారు ఎందుకు కాదనుకున్నారన్న ప్రశ్నకు జమ్మూకశ్మీర్‌ను కారణంగా చూపించారు సీఈసీ రాజీవ్‌కుమార్. అక్కడ భారీస్థాయిలో బలగాలను మోహరించాల్సిన అవసరం ఉన్నందున మహారాష్ట్రను పక్కనబెట్టారట. దీనికితోడు మహారాష్ట్రలో వినాయకచవితి, నవరాత్రి, దీపావళి వంటి పండుగలున్నాయని, వర్షాలు అడ్డుపడి ఓటర్ జాబితాను అప్‌డేట్ చేయడం పూర్తికాలేదని చెప్పుకొచ్చారు. మరి, జార్ఖండ్‌ను కూడా ఎందుకు వదిలేశారో తెలియదు. ఈ రెండింటినీ ఢిల్లీతో కలిపి జరుపుతారట.


జమ్మూకశ్మీర్ ప్రత్యేకప్రతిపత్తిని ఎత్తివేసి, రాష్ట్రంగా ఉన్నదాన్ని కేంద్రపాలితంగా మార్చేసిన నిర్ణయాన్ని సుప్రీంకోర్టు తప్పుబట్టకుండా, ఎన్నికలు మాత్రం ఈ ఏడాది సెప్టెంబరు ముప్పైలోగా ఎన్నికలు జరగాలంటూ ఆదేశించిన విషయం తెలిసిందే. ఇటీవలే సీఈసీ సారథ్యంలో ఎన్నికల కమిషనర్లు అక్కడ పర్యటించి క్షేత్రస్థాయి పరిస్థితులను తెలుసుకున్నారు. అన్ని పార్టీలూ ఎన్నికలు కోరుతున్నాయని, ఓటర్లు కూడా అదేమాట అంటున్నారని వారు చెప్పుకొచ్చారు. అక్కడి పార్టీలు, ప్రజలు ఎంతోకాలంగా ఎన్నికలు డిమాండ్ చేస్తున్న విషయం వీరికి తెలియనిదేమీ కాదు. 2014లో రాష్ట్రంగా ఉన్నప్పుడు జరిగిన చివరి ఎన్నికల్లో ముఫ్తీమహ్మద్ సయీద్ నాయకత్వంలోని పీపుల్స్ డెమోక్రసీ పార్టీ (పీడీపీ) అతిపెద్దపార్టీగా అవతరించింది, బీజేపీ–పీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడింది. ఆయన మరణానంతరం 2016లో కుమార్తె మహబూబా ముఫ్తీ సీఎం అయ్యారు. 2018లో ప్రభుత్వం కూలిపోయి, గవర్నర్ పాలన మొదలైంది. మరుసటి ఏడాది ఆగస్టులో కేంద్రప్రభుత్వం 370 ప్రయోగించింది, ఆ ప్రాంతాన్ని రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా మార్చింది. ఎన్నికల సంఘం ప్రకటనకు ఒకరోజుముందే లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా 200మంది అధికారులను ఎడాపెడా మార్చేయడం విశేషం. దీనిపై ఒమర్ అబ్దుల్లా అభ్యంతరాన్ని ఎన్నికల సంఘం తేలికగా కొట్టివేసింది. జమ్మూకశ్మీర్ విషయంలో కేంద్రం తీసుకున్న ప్రతీచర్యకు ఈ ఎన్నికల్లో ప్రజలు సమాధానం చెబుతారు. ప్రత్యేకప్రతిపత్తి రద్దుకు పాలకులు చెప్పిన కారణాలను, పెట్టిన ఆశలను తూకం వేస్తారు. కశ్మీర్‌నుంచి జమ్మూకు ఉగ్రవాదం విస్తరించిన నేపథ్యంలో అక్కడ సైతం గతంలో ఉన్నంత ఉత్సాహం లేదన్న విశ్లేషణలు బీజేపీకి ఇబ్బందికరమైనవే.

90 స్థానాలున్న హర్యానాలో ఈ మారు కాంగ్రెస్‌ది పైచేయి అవుతుందని విశ్లేషణలు వెలువడుతున్నాయి. 2019లో మెజారిటీ లేకున్నా దుష్యంత్ చౌతాలాతో పొత్తుపెట్టుకొని ముఖ్యమంత్రిగా ఖట్టర్ కొనసాగగలిగారు. కానీ ఇటీవలి లోక్‌సభ ఎన్నికలకు నెలరోజుల ముందు ఆ కూటమి కూలింది, ఖట్టర్ స్థానంలోకి నయాబ్‌సింగ్ సైనీ వచ్చారు. లోక్‌సభ ఎన్నికల్లో సగం స్థానాలు గెలుచుకున్న కాంగ్రెస్ పట్ల ప్రజాదరణ పెరిగిందని సర్వేలు కూడా అంటున్నాయి. నిరుద్యోగం, అగ్నివీర్, రైతు ఉద్యమాలు, మహిళా మల్లయోధుల అంశం ఓటర్లను ప్రభావితం చేస్తాయి. యూపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్‌ను కాపాడుకురావడంకోసం బీజేపీ పెద్దలు మహిళారెజ్లర్లతో అన్యాయంగా వ్యవహరించారన్న ఆగ్రహం ఖాప్ పంచాయితీల్లో ఉంది. ఆ ఉద్యమానికి సారథ్యం వహించిన వినేశ్ ఫోగట్‌మీద ఒలింపిక్స్‌లో అనర్హత వేటుపడటమూ ఓటర్ల మీద పనిచేయవచ్చు. దళిత్, ఓబీసీ ఓట్లతో పాటు జాట్ల ఓట్లు కూడా చీలి కాంగ్రెస్ బాగా లాభపడవచ్చునంటున్నారు. జమ్మూకశ్మీర్, హర్యానా ఎన్నికల్లో స్థానికాంశాలే ప్రధానంగా పనిచేసినప్పటికీ, ఫలితాల ప్రభావం దేశస్థాయిలో ఉంటుంది. ఈ మారు లోక్‌సభలో బలం తగ్గిన బీజేపీ మీద, బలపడిన ఇండియా కూటమి మీదా ఈ ఫలితాలు ప్రభావం చూపుతాయి.

మహిళా రిజర్వేషన్ చట్టం హుళక్కేనా?

‘డీలిమిటేషన్ చట్టం 2002’ ప్రకారం 2026లో డీలిమిటేషన్ ప్రక్రియను మొదలు పెట్టాలంటే జనగణన చేయాలి. అయితే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 2024–2025 బడ్జెట్‌లో కేటాయించిన రూ.1,309.46 కోట్ల పద్దులను చూస్తే మోదీ ప్రభుత్వానికి ఈ సంవత్సరం కూడా జనాభా గణన ప్రక్రియను పూర్తిచేయాలనే ఉద్దేశం ఏ కోశానా లేదనే విషయం ప్రస్ఫుటంగా అర్థమవుతున్నది. దేశంలో జనాభా గణన చేయాలంటే పెద్ద మొత్తంలో నిధులు అవసరం అవుతాయి. కానీ కేంద్ర బడ్జెట్‌లో ఆ మేరకు నిధులు కేటాయించకపోవడమే అందుకు ఉదాహరణ. జనాభా గణన ప్రక్రియ పూర్తి కాకుండా డీలిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన) ప్రక్రియ జరగటమనేది అసాధ్యం. అయితే డీలిమిటేషన్‌తో ముడిపడి ఉన్న మరో చట్టం మహిళా రిజర్వేషన్లు. ఈ బిల్లు ఆమోదం సులభమైనా దాని అమలు డీలిమిటేషన్‌తో ముడిపడి ఉన్నది.

డీలిమిటేషన్ అనేది రాజ్యాంగబద్ధమైన కార్యక్రమం. రాజ్యాంగంలోని 82వ అధికరణం ప్రకారం దీన్ని చేపడతారు. ప్రతి పదేళ్లకోసారి జరిగే జనగణన ప్రక్రియ తర్వాత డీలిమిటేషన్ జరగాలి. డీలిమిటేషన్ చట్టం ప్రకారం కేంద్ర ప్రభుత్వం ఇందుకోసం ఓ కమిషన్‌ను ఏర్పాటు చేస్తుంది. ఇది తాత్కాలిక కమిషన్ కాబట్టి ఇందులో శాశ్వత ఉద్యోగులంటూ ఎవరూ ఉండరు. అందుకే పదవీ విరమణ పొందిన సుప్రీం కోర్టు న్యాయమూర్తి దీనంతటికి సారథ్యం వహిస్తారు. దేశంలోని అన్ని గ్రామాలు, జిల్లాల వారీగా ఆయా రాష్ట్రాల జనాభా గణాంకాలను సేకరించి, అధ్యయనం చేసి ఈ కమిషన్ కేంద్ర ప్రభుత్వానికి తన ప్రాథమిక నివేదికను సమర్పిస్తుంది.



ఈ ప్రక్రియ పూర్తి కావడానికి కనీసం ఐదేళ్ల సమయం పడుతుందని గత అనుభవాలు చెప్తున్నాయి. అయితే పెరిగిన సాంకేతికత వల్ల ఇప్పుడు అంత సమయం పట్టకపోవచ్చునని కేంద్ర ప్రభుత్వ వర్గాలు చెప్తున్నప్పటికీ అది కొంచెం అనుమానాస్పదమేనని విశ్లేషకులు భావిస్తున్నారు. డీలిమిటేషన్ కమిషన్ తుది నివేదికను ప్రభుత్వానికి సమర్పించిందంటే దాన్ని పార్లమెంటు కూడా మార్చలేదు. దానిని తప్పుబడుతూ ఎవరైనా కోర్టుకు వెళ్లినా చెల్లదు. డీ లిమిటేషన్ కమిషన్ ఏది చెప్తే అదే చట్టం, అదే శాసనం.

స్వాతంత్ర్యానంతరం దేశంలో ఇప్పటివరకు నాలుగుసార్లు (1952, 1963, 1973, 2002) మాత్రమే డీలిమిటేషన్ జరిగింది. 2002లో తెచ్చిన రాజ్యాంగ సవరణ ప్రకారం– నియోజకవర్గాల పునర్విభజన మళ్లీ 2026లో చేపట్టాల్సి ఉన్నది. అయితే కేంద్ర ప్రభుత్వం జనగణన ప్రక్రియ మొదలుపెడితే కులగణన ప్రక్రియను కూడా చేపట్టాలనే డిమాండ్ రాష్ట్రాల నుంచి వ్యక్తమయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయి. అయితే కులగణన చేయడానికి కేంద్ర ప్రభుత్వం సుముఖంగా లేదు. అందుకే జనగణన ఆలస్యమవుతున్నది. దానితో ముడిపడి ఉన్న డీలిమిటేషన్ ప్రక్రియ పూర్తవుతుందా లేదా అనేది కాలమే నిర్ణయించాలి. అది పూర్తయితేనే మహిళలకు రిజర్వేషన్ల చట్టం అమలు నోచుకుంటుంది. లేకుంటే ఆ చట్టం మహిళలకు అందని ద్రాక్షే అవుతుంది.

ఇదిలావుంటే ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం 26(1) ప్రకారం తెలంగాణలో 34, ఆంధ్రప్రదేశ్‌లో 50 అసెంబ్లీ సీట్ల సంఖ్య కూడా పెరగాలి. రాష్ట్ర విభజన అయిననాటి నుంచి అసెంబ్లీ సీట్ల పెంపునకు కేంద్రం సుముఖంగా ఉందంటూనే కాలయాపన చేస్తున్నది. డీలిమిటేషన్ కారణంగా అటు మహిళా రిజర్వేషన్ల చట్టం, ఇటు అసెంబ్లీ సీట్ల పెంపు ప్రక్రియలు పెండింగ్‌లో ఉండటం కేంద్ర ప్రభుత్వ ఉదాసీనతను తెలియజేస్తున్నది. ఈ విషయమై తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో నేను పలుసార్లు ప్రధాని మోదీని కలవడం కూడా జరిగింది.

కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్ వల్ల పారదర్శకత పెరిగి పార్లమెంటు సీట్ల సంఖ్య పెరుగుతుందని, తద్వారా మహిళా చట్టసభ్యుల సంఖ్య ఇటు పార్లమెంట్‌లో, అటు అసెంబ్లీలో గణనీయంగా పెరుగుతుందని చెప్తున్నది. కానీ, వెంటనే మహిళా రిజర్వేషన్ చట్టాన్ని అమల్లోకి తీసుకువస్తేనే ఆ ఫలాలను మహిళలకు త్వరగా అందించవచ్చు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ వైఖరిని చూస్తుంటే అది ఇప్పట్లో జరిగే అవకాశమైతే కనిపించట్లేదు. గతంలో ప్రవేశపెట్టిన డ్రాఫ్ట్ బిల్లులో ఇలా డీలిమిటేషన్‌తో ముడిపెట్టలేదు. ఇప్పుడే ఎందుకు ఇలా అన్నదాన్నిబట్టి ప్రస్తుత ప్రభుత్వ చిత్తశుద్ధిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భవిష్యత్తులో రిజర్వేషన్ చట్టం అమలు చేస్తామనటం పోస్ట్‌డేటెడ్ చెక్కువంటిదని చెప్పక తప్పదు. ఇక చట్టంలో ఓబీసీ రిజర్వేషన్లకు అవకాశం లేకపోవటం మరో వివాదానికి తెర లేపటమే. ఈ చట్టం వల్ల బీసీ వర్గాలకు నష్టం జరుగుతుందని కొందరు విమర్శిస్తున్నారు. ఏదేమైనప్పటికీ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ చట్టం, ఇరు రాష్ట్రాల అసెంబ్లీ సీట్ల సంఖ్య పెంపు విషయంలో తమ చిత్తశుద్ధిని చాటుకోవాలంటే వెంటనే జనగణన ప్రారంభించాలి.

• బోయినపల్లి వినోద్‌కుమార్
న్యాయవాది, పార్లమెంటు మాజీ సభ్యులు

పిల్లల ఆహారభద్రతపై అలక్ష్యమా?

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన పోషక ఆహారాన్ని అందించడమే లక్ష్యంగా సెంట్రలైజ్డ్ కిచెన్‌లు ఏర్పరచాలని ప్రభుత్వం భావిస్తోంది. అంతేగాక విద్యార్థులకు మధ్యాహ్నం భోజనంతో పాటు ఉదయాన్నే అల్పాహారం కూడా అందించడానికి ఏర్పాటు చేస్తున్నదని పత్రికలు వెల్లడించాయి. అల్పాహారం అందించడం హర్షించదగినదే, కానీ కేంద్రీకృత వంటగది మాత్రం నిరుపయోగం. దీనిని అమలు చేస్తే బడి పిల్లలకు సమతౌల్య ఆహారం అందుతుందనేది సందేహాస్పదమే. అంతేకాకుండా పిల్లల్లో ఇప్పటికే ఉన్న పౌష్టికాహార లోపం ఎక్కువయ్యే అవకాశం ఉంది. బళ్ళల్లో మధ్యాహ్న భోజనం, అంగన్‌వాడీల్లో సమగ్ర శిశు సంక్షేమ పథకం(ఐసిడిఎస్), పౌష్టికాహారంపై ఇప్పటికే వచ్చిన సర్వే రిపోర్టులు చాలావరకు ఈ విషయాలను ప్రస్తావించాయి.


ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టులో దాఖలైన ఆహారభద్రత కేసు గురించి, కోర్టు ఇచ్చిన ఆదేశాల గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. 2001లో పియుసిఎల్ ఆహార హక్కును ప్రతి వ్యక్తి చట్టపరమైన హక్కుగా గుర్తించాలని సుప్రీంకోర్టులో ఒక పిటిషన్ దాఖలు చేసింది. రాజ్యాంగంలో జీవించే హక్కు ఆర్టికల్ 21, ఆహార హక్కుతో ముడిపడి ఉందని చట్టబద్ధమైన హక్కుగా గుర్తించి, రాజ్యాంగపరంగా ఈ హక్కును గుర్తించాలని వాదించింది. ఈ పిటిషన్లపై అత్యున్నత న్యాయస్థానం 28 నవంబర్ 2001లో తాత్కాలిక ఆదేశాలు జారీ చేస్తూ ఆహార భద్రతకు సంబంధించిన తొమ్మిది పథకాలను లీగల్ హక్కులుగా గుర్తించి రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకాలను పూర్తి స్థాయిలో అమలుపరచాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఆ తొమ్మిది పథకాలలో మూడు ముఖ్యమైనవి ప్రజా పంపిణీ వ్యవస్థ, మధ్యాహ్న భోజన పథకం(ఎండీఎం), సమగ్ర శిశు సంక్షేమ పథకం (ఐసిడిఎస్), ఎండిఎం, ఐసిడిఎస్ పిల్లలు, బడి పిల్లల పౌష్టికాహారానికి సంబంధించినవి. 1975లో ప్రారంభించిన ఐసిడిఎస్ తల్లికీ గర్భవతులకు, శిశువులకు ఆరోగ్యం, పౌష్టికాహారం అందించడానికి చేసిన పథకం. నవంబర్ 28, 2001లో కోర్టు ఉత్తర్వుల ప్రకారం ఐసిడిఎస్ దేశవ్యాప్తంగా పూర్తి స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలి.

ప్రస్తుతం మధ్యాహ్న భోజనంపై ప్రభుత్వ నిర్ణయం.. మధ్యాహ్న భోజనం, ఆహార పంపిణీని ప్రైవేటైజ్ చేయడం కోర్టు ఆదేశాలకు పూర్తిగా విరుద్ధం. మధ్యాహ్న భోజన పథకం 1960లో ప్రారంభం అయింది. బడి పిల్లలకు ఉచిత ఆహారం ఇవ్వడమే ఈ పథకం. నవంబర్ 28, 2001లో సుప్రీంకోర్టు జారీ చేసిన ఉత్తర్వుల తర్వాత దేశంలో పలు రాష్ట్రాల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేశారు. బళ్ళల్లో పిల్లల సంఖ్య పెరగడాన్ని బట్టి ఈ పథకం ఎంత అవసరమో తెలుస్తోంది.

ఆకలితో తరగతిలో పాఠాలు వినడం వల్ల చదువులు మెరుగుపడవని, అంతేగాక పౌష్టికాహార లోపంతో పిల్లల ఆరోగ్యం మెరుగుపడదని, వీటిని సరిదిద్దడానికి మధ్యాహ్న భోజనం ఎంత అవసరమో ఈ ఉత్తర్వులు తెలిపాయి. అంతేగాక బళ్ళలో కలిసి తినడం వల్ల పిల్లల్లో కులవివక్ష అరికట్టడానికి, లింగ వివక్షను తొలగించడానికి, స్త్రీలకు పని కల్పించడానికి, పౌష్టికాహార అవసరాన్ని బోధించడానికి (న్యూట్రిషన్ ఎడ్యుకేషన్), అన్నిటికంటే ఎక్కువగా పేదపిల్లల ఆకలి తీర్చడానికి మధ్యాహ్న భోజనం తప్పనిసరి అని కోర్టు ఉత్తర్వులను అన్ని వర్గాలు హర్షించాయి. ఏప్రిల్ 20, 2004లో కోర్టు రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్ర పాలిత ప్రాంతాలలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో, ప్రభుత్వ సహకారాన్ని పొందుతున్న బళ్ళల్లో 300 కాలరీలు, 8–12 గ్రాముల ప్రోటీన్లు కలిగిన, తాజాగా వండి పెట్టిన భోజనం అందించాలని సూచించింది. అంతేగాక పిల్లల నుండి గాని, తల్లిదండ్రుల నుంచి గాని డబ్బులు తీసుకోవడానికి వీల్లేదు. వంటవాళ్ళ, మిగతా పని వాళ్ళను ఎస్సీ ఎస్టీ కులాలకు చెందిన వాళ్లను నియమించాలని సూచించింది. శుభ్రమైన వంటగదులు, మరుగుదొడ్లు, తాగు నీరు, నాణ్యమైన సరుకులు ఇస్తూ ఎప్పటికప్పుడు భోజన సదుపాయాలను మెరుగుపరచాలని పథకాన్ని పదవ తరగతి వరకు అందించాలని సూచించింది. ప్రభుత్వ పాఠశాలలకు, అంగన్‌వాడీలకు వెళ్లే పిల్లలు పేద వర్గాలకు, బడుగు కులాలకు చెందినవారు. పౌష్టికాహార లోపం వీరిలో ఎక్కువగా ఉండడం సహజం. చాలా వరకు పిల్లలు ఆకలితో పొద్దున్నే ఏమీ తినకుండా బడికి వెళతారు. అందుకే ఈ రెండు పథకాలు (ఐసిడిఎస్, మధ్యాహ్న భోజనం) సమగ్రంగా అమలు చేయాలి.

ఆహారాన్ని ప్రైవేటు కాంట్రాక్టర్లకు ఇవ్వకూడదని; స్థానికంగా వంటగదులను ఏర్పాటు చేసి, పరిసరాలను శుభ్రంగా ఉంచి, తాజాగా వండిన ఆహారాన్ని అందించాలని; స్థానికంగా దొరికే కూరగాయలు, గుడ్లు, చిరుధాన్యాల వంటివి తప్పనిసరిగా ఉపయోగించాలని; వంటగదులు, మంచినీరు, మరుగుదొడ్లు తప్పనిసరిగా ఉండాలని ముఖ్యంగా కోర్టు చెప్పింది. కోర్టు ఆదేశాలు, పౌష్టికాహార నిపుణులు సూచనలు అమల్లో పెట్టాలంటే ప్రభుత్వం తప్పనిసరిగా వనరులను, తగినంత బడ్జెట్‌ను కేటాయించాలి. ఆంధ్రప్రదేశ్ సలహాదారులుగా రిపోర్టులు పంపడంతో పాటు అమలు తీరుపై లోపాలను ప్రస్తావించింది. ఎనిమిది వెనుకబడిన జిల్లాలలో 32 ఊళ్లలో ఆహారభద్రత పథకాల అమలుపై ఒక సర్వే చేసి రిపోర్ట్ తయారు చేసింది. ఆదిలాబాద్, ఖమ్మం, అనంతపూర్, కడప, నల్గొండ, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, వరంగల్ జిల్లాల్లో 32 ఊళ్లల్లో మార్చ్ 2012 నుంచి డిసెంబర్ 2012 వరకు జరిగింది. రిపోర్టులో ఉన్న కొన్ని విషయాలు– వంటగదులు, మరుగుదొడ్లు లేకపోవడం, నాసిరకం సరుకులు, పనివాళ్లకు వేతనాలు సరిగా అందకపోవడం ఇప్పటికీ ఈ పరిస్థితులు మారలేదు. 2014లో తెలంగాణ ఏర్పడ్డ తరువాత కొన్ని మార్పులు వచ్చినా, పథకాల అమలుతీరులో పెద్దగా మార్పు రాలేదు.

వెనుకబడ్డ జిల్లాల్లో పథకాల అమలు తీరుపై స్థానిక పథకాల నిర్వాహకులు చెప్పిన విషయాలు ఇప్పటికీ వర్తిస్తాయి. 67 అంగన్‌వాడీలలో ఎక్కడా టాయిలెట్స్, తాగునీటి వసతులు లేవు. చాలా కేంద్రాలలో సరైన నీళ్లు, వంట గదులు లేవు. ఐసిడిఎస్‌ను సరైన పద్ధతిలో నిర్వహించకపోవడం వల్ల ఇప్పటికీ 46% పిల్లల్లో పౌష్టికాహార లోపం, తక్కువ బరువు ఉన్నాయి.



మధ్యాహ్న భోజనంపై విస్తృత సామాజిక తనిఖీ చేపట్టాలి. పిల్లల సంక్షేమానికి, విద్యకు అత్యవసరమైన రెండు పథకాలు– మధ్యాహ్న భోజనం, సమగ్ర శిశు సంక్షేమం– వీలైనంత వరకు లోపరహితంగా ప్రభుత్వం అమలుపరచాలి. న్యాయస్థానం ఇచ్చిన ఉత్తర్వులు, పౌష్టికాహార నిపుణులు ఇచ్చిన సలహాలను పాలకులు కచ్చితంగా పాటించాలి.

మధ్యాహ్న భోజన పథకంలో సమస్యలు చాలా వరకు ఒకే రకంగా ఉన్నాయి. సరైన వంటగదులు లేకపోవడం, శుభ్రమైన పరిసరాలు, తాగునీటి కొరత ఉన్నాయి.

అయితే దళిత మహిళలు వంట చేస్తే ఇతర కులాల పిల్లలు తినకపోవడం కూడా కొన్ని బళ్లల్లో కనిపించింది. పిల్లలకు ఇచ్చే గుడ్లు నాలుగు నుంచి ఒకటి, రెండిటికి పడిపోయాయి. భోజనానికై ఇచ్చే డబ్బులు సరిపోవటం లేదు, వసతులు సరిగ్గా లేకపోవడం, పనిచేస్తున్న వంట వాళ్లకు, సహాయకులకు జీతాలు సరిగా అందకపోవడం వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయినప్పటికీ అంగన్‌వాడీల్లో పని చేస్తున్న స్త్రీలు ఏదో విధంగా వంట చేసి పిల్లలకు ఆహారం అందజేస్తున్నారు. అంగన్‌వాడీల్లో, మధ్యాహ్న భోజనం పథకంలో అవినీతి ఉన్నదని, శుభ్రమైన భోజనం అందించడం లేదని, కేంద్రీకృత వంట గదులను ఏర్పాటు చేసి ప్రైవేటీకరణ చేయడం ఈ పథకాల ఉద్దేశాలకు, కోర్టు ఇచ్చిన ఆదేశాలకు వ్యతిరేకం.

ప్రస్తుతం అక్షయపాత్ర నాలుగు కేంద్రీకృత వంటగదుల ద్వారా 1,60,169 పిల్లలకు, 1,856 బళ్ళలో భోజనం పంపిణీ చేస్తున్నది. అక్టోబర్ 2008లో హైదరాబాద్‌లో కేంద్రీకృత వంటగదిని ప్రారంభించింది. 2017లో నార్సింగిలో, 2018 వరంగల్‌లో, 2019 నవాబ్‌పేట్‌లో స్థాపించింది. వీటిలో భోజనం మధ్య రాత్రి తయారు చేసి పంపిణీ చేయడంతో కొన్నిసార్లు అది పాడయిపోయి పిల్లలు తినడం లేదు. అంతేకాక ఈ మధ్య వచ్చిన రిపోర్టుల ద్వారా ఈ సంస్థలో అవినీతి కూడా జరుగుతోంది.

హరే రామ హరే కృష్ణ, ఇస్కాన్ సహకారంతో సెంట్రలైజ్డ్ కిచెన్ ద్వారా ఆహారం ఒకచోట వండి దాన్ని పంపిణీ చేయడానికి ప్రస్తుత ప్రభుత్వం తలపెట్టడం కూడా సమస్యాపూరితం. అక్షయపాత్ర, ఇస్కాన్, హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్ గుడ్లు ఇవ్వకపోవడం వల్ల పౌష్టికాహార లోపం పూరించడం సాధ్యం కాదు. నిపుణుల సూచన ప్రకారం ప్రోటీన్, మాంసాహారం పిల్లలకు అవసరం. ఆరు రోజులు గుడ్లు ఇచ్చినట్లయితే పౌష్టికాహారం లోపాన్ని పూరించవచ్చు. ఉదయాన్నే అల్పాహారంగా ఉడకబెట్టిన గుడ్లని ఇవ్వవచ్చు. ఆహారాన్ని సాత్విక భోజనంగా ఇవ్వడం సరైనది కాదు. పౌష్టికాహారాన్ని నిపుణుల సూచన ప్రకారం ఇవ్వాలి. సమతౌల్యమైన, తాజాగా వండిన ఆహారానికి ప్రత్యామ్నాయం లేదు. అయితే ప్రభుత్వం వనరులు ఇచ్చి, ఆహార పథకాలపై కేటాయించిన బడ్జెట్‌ను పెంచాలి. మధ్యాహ్న భోజనంపై విస్తృత సామాజిక తనిఖీ చేపట్టి పిల్లల సంక్షేమానికి, విద్యకు అత్యవసరమైన రెండు పథకాలు– మధ్యాహ్న భోజనం, సమగ్ర శిశు సంక్షేమం– వీలైనంత వరకు లోపరహితంగా అమలుపరచాలి. న్యాయస్థానం ఇచ్చిన ఉత్తర్వులు, పౌష్టికాహార నిపుణులు ఇచ్చిన సలహాలు కచ్చితంగా పాటించాలి.

▪ ప్రొ. రమా మేల్కొటె

కోటా తీర్పును తక్షణమే సమీక్షించాలి

భారత స్వాతంత్రోద్యమానికి సమాంతరంగా డాక్టర్ అంబేడ్కర్ నిర్వహించిన సామాజికోద్యమ ఫలితంగా వచ్చిన ఎస్సీ రిజర్వేషన్లు ఇప్పుడు అంతర్గత వివాదంలో చిక్కుకున్నాయి. రాజ్యాంగ మౌలికస్వరూపాన్ని మార్చకూడదన్న 1973 కేశవానంద భారతి కేసు తీర్పులో రాజ్యసంక్షేమం కూడా ఒక ప్రధాన అంశం. ఈ సందర్భంలో వర్గీకరణ పేరిట ఏబీసీడీ అనే అడ్డకోతకు, క్రీమీలేయర్ అనే నిలువుకోతకు గురి చేస్తూ సర్వోన్నత న్యాయస్థానం తీర్పు ఇవ్వడాన్ని వీరంతా నిరసిస్తున్నారు. చరిత్రాత్మక రిజర్వేషన్లను సంక్షేమ పథకాల్లా పరిగణించడం రాజ్యాంగ స్ఫూర్తిని అవమానించడమేనని అంబేద్కరీయవాదులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దేశ విదేశాల్లో ఏ భారతీయుడు సాధించనన్ని డిగ్రీలు సాధించిన అంబేద్కర్‌ని ఆయన మరణం వరకు అంటరానితనం వెంటాడిన సంగతిని గుర్తు చేస్తున్నారు. రాజ్యాంగ రచనాసంఘం అధ్యక్షుడైన అంబేద్కర్‌ని ఇప్పటికీ జాతినేతగా కాకుండా దళిత నేతగా వివక్ష చూపడాన్ని ఖండిస్తున్నారు. జాతీయ కాంగ్రెస్ రాజకీయాల నుంచి ఉపప్రధానిగా ఎదిగిన బాబూజగజ్జీవన్‌రామ్ కూడా కులవివక్ష ఎదుర్కొన్న విషయాన్ని ఆయన కుమార్తె, మాజీ లోక్‌సభ స్పీకర్ మీరాకుమార్ బహిరంగంగా అనేక సమావేశాల్లో ప్రకటించారు.



ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు ఎన్నికల ముందుగానే ఎన్డీఏ మద్దతు ప్రకటించింది. అధికారం చేజిక్కిన రెండు నెలల్లోనే ఈ తీర్పు వెలువడటం రిజర్వేషన్ల స్ఫూర్తిని రాజకీయంగా మంటగలపడమేననే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రిజర్వేషన్ల మీద నిర్ణయం తీసుకునే హక్కు ఒక్క భారత పార్లమెంటుకే వుందని గతంలో సర్వోన్నత న్యాయస్థానం వెలువరించిన తీర్పును గుర్తు చేసుకుంటున్నారు. అధికారంలో వున్న రాజకీయపార్టీల ఎజెండాలకు అనుగుణంగా తీర్పులు వెలువడటాన్ని నిరసిస్తున్నారు. సుప్రీంకోర్టు తీర్పు కేవలం వర్గీకరణ చేయడానికి రాష్ట్రాలకు అధికారాన్ని ఇచ్చిన సంగతిని మరచి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే ఆర్డినెన్స్ తీసుకొస్తామని, ఇప్పటివరకు వచ్చిన ఉద్యోగప్రకటనల్లో కూడా అమలు చేస్తామని అసెంబ్లీలోనే ఆడంబరంగా ప్రకటించారు. ఇంకా జరగాల్సిన రాజ్యాంగ ప్రక్రియ చాలానే వుంది. అయినా కాంగ్రెస్ ముఖ్యమంత్రి కంగారు పడటం తెలంగాణ మాదిగేతర అంబేడ్కరీయ సంఘాలు ఖండించాయి. వర్గీకరణ విషయంలో అందరూ ఆలోచనతో అడుగులు వేసి అంబేడ్కర్ సామాజిక ఉద్యమాన్ని కాపాడవలసి వుందని జాతీయస్థాయి నాయకుల్లో కదలిక వచ్చింది.

సర్వోన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తితో సహా ఈ కేసును పరిశీలించిన ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనంలో జస్టిస్ బేలా త్రివేది వర్గీకరణ తీర్పు మీద అసమ్మతి తెలియజేశారు. 341 అధికరణ మీద మిగతా ఆరుగురు న్యాయమూర్తుల వివరణ సరికాదన్నారు. 2004లో ఈవీ చిన్నయ్యకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి మధ్య నడిచిన కేసులో సర్వోన్నత న్యాయస్థానం ఎస్సీ రిజర్వేషన్ల స్వరూపాన్ని మార్చడానికి పార్లమెంటుకు మాత్రమే హక్కుందని తెలియజేసిన సంగతిని గుర్తు చేశారు. ఈ వర్గీకరణను అనుమతించే తీర్పు సమయంలోనే, మరో ప్రమాదాన్ని కూడా ఎస్సీ వర్గాలకు ఉద్దేశించిన రిజర్వేషన్ ప్రయోజనాల నుంచి ‘క్రీమీలేయర్’ని మినహాయించాల్సిన అవసరాన్ని సుప్రీంకోర్టు వ్యక్తం చేసింది. ఈ తీర్పులో జస్టిస్ బీఆర్ గవాయ్ ఈ అభిప్రాయాన్ని చాలా బలంగా చెప్పారు. మండల్ కమిషన్ సిఫార్సులతో వచ్చిన ఓబీసీ రిజర్వేషన్లలో క్రిమిలేయర్ ఇప్పటికే అమల్లో వుంది. ప్రభుత్వరంగ సంస్థలు ప్రైవేటుపరం అయిపోతున్న నేపథ్యంలో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ జరిగి ప్రయోజనం ఏమిటని దళిత సామాజికవేత్తలు సూటిగా ప్రశ్నిస్తున్నారు. పదోన్నతుల్లో రిజర్వేషన్లు మీద నిరంతరం ప్రభుత్వాల అభిప్రాయాలు మారిపోతున్నాయి. ఇంతవరకు ఎస్సీలకు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా సుస్థిర స్థానం దక్కనేలేదు. ఈ విషయాన్ని ప్రశ్నిస్తున్న వారి మీద నలువైపుల నుంచి దాడులు జరుగుతూనే వున్నాయి. అంతేగాక ఎస్సీ కులాల నుంచి రాజ్యాధికారానికి పోటీ పడుతున్న ఉపకులాలను అణచివేయడానికి వర్గీకరణను ఒక ఆయుధంగా పాలకపక్షాలు గట్టిగా పట్టుకున్నాయి. ఈ పరిశీలన నుంచే దళిత నాయకులు వర్గీకరణ మీద తీర్పును కుట్రగా భావించవలసి వచ్చింది.


ఎస్సీ వర్గీకరణ మీద సుప్రీంకోర్టు తీర్పును దళితుల రాజ్యాధికార పయనం మీద జరుగుతున్న కుట్రగా దళితనేతలు పేర్కొంటున్నారు. అందుకే ఈ తీర్పును సమీక్షించవలసి వుందంటున్నారు. వెంటనే ఆంధ్రప్రదేశ్ మాలమహాసభ నాయకుడు మల్లెల వెంకటరావు (35466/2024) సుప్రీంకోర్టులో సమీక్ష కోసం కేసు నమోదు చేశారు. మిగతా సంఘాలు ఇప్పటికే సమీక్ష కోసం పిటీషన్లు వేశారు. అంటరానితనం దాని స్వభావం ఇప్పటికీ భారతదేశంలో ప్రబలంగా ఉందని నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో గణాంకాలు చెప్తున్నాయి. ఆధిపత్య కులాలు అంటరానితనం, సామాజిక, సాంస్కృతిక, మత, రాజకీయ, ఆర్థిక రంగాలలో వివక్ష కొనసాగిస్తున్నాయి. ఈ రంగాలలో సమాన భాగస్వామ్యం సాధించడానికి ప్రయత్నించినప్పుడల్లా ఆ వర్గం భౌతికంగాను, ఇతర మార్గాల్లో హింసకు గురిచేస్తున్నారని మాజీ యూజీసీ ఛైర్మన్ ప్రొఫెసర్ సుఖ్‌దేవ్ థోరట్ ఆధారాలతో పాటు ఇప్పటికే ప్రభుత్వానికి ఒక సమగ్ర నివేదిక సమర్పించారు. అంటరానితనం, వివక్ష, దౌర్జన్యాలు విస్తృతంగా కొనసాగుతున్న నేపథ్యంలో రిజర్వేషన్ల వర్గీకరణతో మాత్రమే సామాజిక న్యాయం ముడిపడివుందనే న్యాయమూర్తుల అభిప్రాయాల్ని మెజారిటీ దళిత ప్రజానీకం విశ్వసించడం లేదు. ఒక్క ఉపకులమే మొత్తం అవకాశాల్ని లాగేసుకుందనే నిందలు సరికాదంటున్నారు. వీటిలో నిజమెంతుందో తేల్చేందుకు తగిన గణనతో పాటు సామాజిక స్థితిగతుల అధ్యయనాన్ని చేపట్టాల్సిన అవసరం వుంది. ఇలాంటి సందర్భాలకు తగినట్టు న్యాయమూర్తుల వ్యాఖ్యానాల్లో నిజమెంతుందో సమీక్ష జరగాలి. వర్గీకరణను రాజకీయంగా ఎన్నికల అస్త్రంగా వాడుకున్న ప్రభుత్వం పారదర్శక గణాంకాలతో సహా న్యాయస్థానాల ముందు ఉంచవలసి ఉంటుంది. ఇవన్నీ జరగకుండా గతంలో కేంద్రప్రభుత్వం వేసిన ఉషామెహ్రా కమిషన్ ఆధారంగానో లేక ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వేసిన జస్టిస్ రామచంద్రరాజు కమిషన్ ఆధారంగానో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చేయడాన్ని ఎట్టి పరిస్థితుల్లోను తెలుగు రాష్ట్రాల్లో మాల సామాజిక వర్గం అంగీకరించడం సాధ్యం కాదు. రాష్ట్రాల వర్గీకరణ ప్రక్రియలో ప్రతి చిన్న విషయం న్యాయస్థానాల మెట్లు ఎక్కితీరుతుంది. చివరికి ఎస్సీ రిజర్వేషన్లు అంతర్గత వివాదాల్లో కూరుకుపోయే అవకాశమే ఎక్కువగా కనిపిస్తుంది. అందుకే సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు మీద ఖచ్చితమైన సమీక్షను యావత్ దేశ ఎస్సీ ప్రజలంతా ఆకాంక్షిస్తున్నారు.

◆ డాక్టర్ జీకేడీ ప్రసాద్

పాఠ్యపుస్తకాల్లో పొలిటికల్ కూడికలు, తీసివేతలు

ఎన్‌సిఇఆర్‌టి పాఠ్యపుస్తకాల సవరణ కాండ ఈ సంవత్సరం కూడా కొనసాగింది. ఈసారి 12వ తరగతి రాజనీతి శాస్త్ర పాఠ్యపుస్తకం ‘స్వాతంత్ర్యానంతర భారత రాజకీయాలు’లో చోటు చేసుకున్న మార్పులు చేర్పులూ వాస్తవాలను సగం కప్పి సగం విప్పి, జరిగిన సంఘటనల మీద విద్యార్థులకు పాక్షిక దృష్టిని కలిగిస్తున్నాయి. ప్రజాస్వామిక, న్యాయ పద్ధతుల ద్వారా అయోధ్య సమస్య పరిష్కారమైనట్టు పేర్కొంటున్న ఈ పుస్తకం నుంచి గుజరాత్ మారణహోమం పూర్తిగా మాయమైంది.

మొదటిసారి 2007లో ప్రచురితమై 2023 దాకా కొనసాగిన పాతప్రతిలో అయోధ్య సమస్య అనే అంశం క్రింద ఉన్న వివరణ సంక్షిప్త రూపం ఇది: బాబ్రీమసీదు 16వ శతాబ్ది కట్టడం. దాన్ని బాబర్ సేనాని నిర్మించాడు. ఇది శ్రీరాముడు జన్మించిన స్థలంగా భావిస్తున్న చోట నిర్మితమైన ఆలయాన్ని పడగొట్టి నిర్మితమైనదిగా భావింపబడింది. ఈ అంశం చుట్టూ హిందూ ముస్లింలు తమ వర్గాలను సమీకరించుకున్నాయి. ఇది మతహింసకు దారితీసింది. ప్రజల మద్దతు కూడగట్టడానికి బీజేపీ రథయాత్రను నిర్వహించింది. కరసేవకులు డిసెంబరు 6, 1992న బాబ్రీమసీదును ధ్వంసం చేశారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రప్రభుత్వాన్ని కేంద్రం రద్దు చేసింది. దేశవ్యాపితంగా ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. 1994లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో కూల్చివేతను విపత్కర సంఘటనగా అభివర్ణించింది.



పాఠ్యపుస్తకాల్లో సవరణలు, తొలగింపుల విషయమై ఎన్‌సిఈఆర్‌టి డైరెక్టర్ దినేశ్ ప్రసాద్ సక్లానీ, “పిల్లలు పెద్దయ్యాక ఎలాగూ తెలుసుకుంటారు. ఇప్పటి నుంచే వాటి గురించి తరగతి గదిలో ఎందుకు?” అని తమ చర్యను సమర్థించుకున్నారు. నిజానికి ఈ పుస్తకం చదువుకునే విద్యార్థి వయసు 17 సంవత్సరాలు ఉంటుంది. మరో ఏడాదిలో ఓటుహక్కు లభించే అతనికి/ఆమెకు దేశ రాజకీయాలను దాచిపెట్టి చెప్పవలసిన అవసరం ఏముందీ?

కాగా, నవీకరింపబడిన కొత్తప్రతి 2024లో ప్రచురితమై అమలులోకి వచ్చింది. దీనిలో పైన పేర్కొన్న విషయం మొత్తం తొలగింపబడి క్రింది విషయం వచ్చి చేరింది. దాని సంక్షిప్త రూపం ఇలా ఉంది: ఇది శ్రీరాముని జన్మభూమికి చెందిన వివిధ వాదనలున్న అంశం. 1528లో శ్రీరాముని జన్మస్థలంలో మూడు గుమ్మటాల నిర్మాణం జరిగింది. దీని మీద హిందూ ప్రతీకలూ, ఆనవాళ్లూ ఉన్నాయి. ఈ పవిత్రస్థలం కోసం సంవత్సరాల తరబడి న్యాయపోరాటం జరిగింది. 1992 లో కట్టడం కూలగొట్టబడినపుడు ప్రజాస్వామ్యం ఒక సవాలును ఎదుర్కొన్నది. చట్టబద్ధ మార్గాల ద్వారా పరిష్కారం కుదిరి సుప్రీంకోర్టు ఆ స్థలాన్ని శ్రీరామ జన్మభూమి తీర్థట్రస్టుకు రామాలయ నిర్మాణానికి ఇస్తూ, వక్ఫ్ బోర్డుకు వేరొక స్థలం కేటాయించవలసిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. మనలాంటి బహుళత్వం కలిగిన సమాజాలు ఈ విధంగా ప్రజాస్వామ్యపద్ధతిలో సమస్యలు పరిష్కరించుకోవాలి. భారతీయ నాగరికతలోనే కలిసిపోయిన ఆ తత్వానికి ఇది సమున్నత ఉదాహరణ.. అంటూ 2019 నాటి సుప్రీంకోర్టు తీర్పులోని కొన్ని ఉటంకింపులతో ముగిసింది.

రెండు ప్రతులలోని అంశాల వివరణలో ఎంతో వైరుధ్యం కనిపిస్తుంది. పాత ప్రతిలో “Ayodhya dispute” అని సమతూకంతో ఉన్న ఉపశీర్షిక కొత్తప్రతిలో తక్కువ తీవ్రత కలిగిన “Ayodhya issue”గా మారింది. జరిగిన పరిణామాలను పాత ప్రతి వాస్తవికంగా, తార్కికంగా, బాహాటంగా వివరించగా కొత్త ప్రతి వివరణ నర్మగర్భంగా, ఖాళీలతో, వాక్యాల మధ్య అన్వయ లేమితో సాగింది. అక్కడ నిర్మితమైన కట్టడాన్ని బాబ్రీ మసీదుగా పాతప్రతి స్పష్టం చేయగా, కొత్తప్రతి దానిని మూడు గుమ్మటాల కట్టడం అనింది. అది ఏమిటో దానిని ఎవరు నిర్మించారో ఇక్కడ జవాబులు లేవు. మసీదు నిర్మాణానికి ముందు ఉన్న ఆలయ ప్రదేశం శ్రీరాముని జన్మస్థలం అనేది ఒక విశ్వాసం అని పాత ప్రతి విస్పష్టంగా చెప్పగా, కొత్త ప్రతి దానిని శ్రీరాముని జన్మస్థలంగా నిర్ధారించి మాట్లాడింది. చారిత్రక వ్యక్తి జన్మస్థలానికీ, పురాణ వ్యక్తి జన్మస్థలానికి మధ్య ఉండవలసిన శాస్త్రీయత, ఊహాత్మకతల మధ్య విభజనను కొత్తప్రతి పాటించలేదు.

ఇక, పూర్తిగా తొలగింపుకు గురైన పాఠ్యభాగం “Gujarat riots”. కరసేవకులతో నిండి అయోధ్య నుంచి తిరిగి వస్తున్న రైలు బోగీకి గోధ్రా స్టేషన్‌లో ఎవరో నిప్పంటించడం, 57 మంది మరణించడం, అది ముస్లింల దుశ్చర్యగా భావించి వారి మీద మరుసటి రోజు మొదలు నెలరోజులపాటు మారణహోమం సాగటం, 1100 మంది మరణించటం, అందులో అత్యధికులు ముస్లింలు కావడంతోపాటు జాతీయ మానవహక్కుల కమిషన్ దమనకాండను అదుపుచెయ్యడంలో గుజరాత్ ప్రభుత్వ దారుణ వైఫల్యాన్ని తప్పు పట్టడం వంటి అంశాలున్న ఈ ఉపశీర్షిక మొత్తం ఎత్తివేయబడింది. ఈ అల్లర్లు ప్రభుత్వ యంత్రాంగానికి కూడా మత పక్షపాతం ఉంటుందని రుజువుచేశాయనీ, మతాన్ని రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకోవడం వల్ల జరిగే ఇటువంటి ప్రమాదాల పట్ల జాగరూకత వహించాలనీ, ఇవి ప్రజాస్వామ్యానికి సవాళ్లు అనీ చేసిన వ్యాఖ్యలు కూడా తొలగించబడ్డాయి.

అలాగే పై రెండు సందర్భాలలో పాతప్రతిలో ముద్రింపబడిన సంఘటనల నాటి వార్తాపత్రికలలో ముద్రింపబడిన వార్తల నకళ్లు కొత్తప్రతిలో మొత్తంగా మాయమయ్యాయి. వీటిల్లో హిందూస్తాన్ టైమ్స్ ప్రచురించిన ‘బాబ్రీ మసీదు విధ్వంసం– కళ్యాణ్ ప్రభుత్వాన్ని రద్దుచేసిన కేంద్రం’ అనే శీర్షిక, ‘అయోధ్య, బీజేపీ దారుణ వైఫల్యం – అద్వానీని ముందే హెచ్చరించాను కానీ మితవాదులకు ఇక్కడ స్థానం లేదు’ అని పయనీర్ ప్రచురించిన వాజ్‌పేయి ఆక్రోశం, పయనీరే ప్రచురించిన ‘కూల్చివేతపై పశ్చాత్తాపం లేదు’ అన్న అద్వానీ బాధ్యతారాహిత్యం, స్టేట్స్ మన్ ప్రచురించిన ‘ప్రపంచవ్యాపిత ఆగ్రహ ప్రతిస్పందన’ అనే వార్త ఉన్నాయి.


గుజరాత్ విషయానికి వస్తే తొలగింపుల్లో హిందుస్తాన్ టైమ్స్ ప్రచురించిన ‘మండుతున్న గుజరాత్’ అనే వార్త, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ప్రచురించిన ‘కంటికి కన్ను సూత్రంతో గుడ్డిదైన గాంధీ నగర్’ అనే పతాక శీర్షిక, ఒక పత్రిక (పేరు లేదు) ప్రచురించిన ‘గుజరాత్ సంఘటనలు మాయని మచ్చలు – ప్రపంచానికి నా ముఖం ఎలా చూపించను’ అన్న వాజ్‌పేయి ఆవేదన, మరో పత్రిక ప్రచురించిన ‘ఆగని గుజరాత్ మారణహోమం’ అనే శీర్షిక ఉన్నాయి. వీటితోపాటు తొలగింపుల్లో 1947 ఫిబ్రవరి 27న రాజ్యాంగ పరిషత్తు సలహా సంఘం ముందు ‘మైనారిటీలను కాపాడలేమని మనమీద ఉన్న అపప్రథను తొలగించుకుని వాటిని పరిరక్షించుకోవడంలో మనలను మించినవారు లేరని రుజువుపరచుకోవలసి ఉంది’ అన్న సర్దార్ వల్లభాయ్ పటేల్ మాటల్ని తొలగించారు. అలానే, గుజరాత్ సంఘటనను, వాటి నివారణలో ప్రభుత్వ వైఫల్యాన్ని తీవ్రంగా తప్పుపట్టి, ఈ గాయాన్ని త్వరగా మాన్చుకుని శాంతియుతమైన, తాదాత్మ్యత (harmony) కలిగిన సమాజం కోసం ఎదురు చూడాలని, ఈ మహత్తర ఆశయ సాధన రాజ్యాంగ విలువల పరిరక్షణ ద్వారా సాధ్యపడాలని కాంక్షించిన జాతీయ మానవ హక్కుల కమిషన్ 2001–02 వార్షిక నివేదిక ఉటంకింపు కూడా కత్తిరింపబడింది. చివరిగా, అప్పటి ప్రధాని వాజ్ పేయి ‘గుజరాత్ రాష్ట్ర ముఖ్యమంత్రికి నా సందేశం ఒకటే – అతను రాజధర్మాన్ని పాటించాలి. పరిపాలకుడు కులం, మతం, జాతి ఆధారంగా ప్రజల పట్ల వివక్ష చూపరాదు’ అన్న మాటలు కూడా తొలగింపబడ్డాయి.

ఈ సందర్భంగా ఎన్‌సిఈఆర్‌టి డైరెక్టర్ దినేశ్ ప్రసాద్ సక్లానీ, “హింసను ప్రేరేపించి, పౌరులను కుంగుబాటుకు గురిచేసే ప్రమాదముంటుందని భావించి” వాటిని తొలగించినట్టు చెబుతూ, “పిల్లలు పెద్దయ్యాక ఎలాగూ తెలుసుకుంటారు. ఇప్పటి నుంచే వాటి గురించి తరగతి గదిలో ఎందుకు?” అని తమ చర్యను సమర్థించుకున్నారు (ఆంధ్రజ్యోతి 17.6.2024 వార్త). నిజానికి ఈ పుస్తకం చదువుకునే విద్యార్థి వయసు 17 సంవత్సరాలు ఉంటుంది. మరో ఏడాదిలో ఓటుహక్కు లభించే అతనికి/ఆమెకు దేశ రాజకీయాలను దాచిపెట్టి చెప్పవలసిన అవసరం ఏముందీ? వాటి మీద సరైన అవగాహన రాజనీతి శాస్త్ర గ్రంథం కాక, మరేది ఇవ్వగలదు?

ఒకవేళ, తొలగింపు సమర్థనే నిజమైతే, అది 1984లో ఇందిరా గాంధీ మరణానంతరం ఢిల్లీలో, ఇతర ఉత్తరభారత ప్రాంతాలలో జరిగిన సిక్కుల ఊచకోతకు కూడా వర్తించాలి. కానీ ఈ రెండు వేల మంది సిక్కుల మరణానికి దారితీసిన కారణాలూ, అనంతర పరిణామాలూ, ఈ దారుణ ఘటనల పట్ల 2005లో అప్పటి ప్రధాని మన్‌మోహన్ సింగ్ పార్లమెంటులో సిక్కు సమాజంతో పాటు యావత్ భారతజాతిని క్షమాపణలు కోరుతూ చేసిన పశ్చాత్తాప ప్రకటనను కూడా తొలగించాలి. కానీ, కొత్తప్రతిలో దానిని యథాతథంగా ఉంచేశారు.

○ కొప్పర్తి వెంకటరమణమూర్తి

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY హనుమకొండ HANUMAKONDA
శనివారం 17 ఆగస్టు 2024



వరలక్ష్మీ.. నమోస్తుతే..

- నగరంలో వైభవంగా వరలక్ష్మీ వ్రతాలు
- శ్రావణ శుక్రవారం సందర్భంగా భద్రకాళి ఆలయం కిటకిట


వరంగల్ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతంలో పాల్గొన్న మహిళలు

వరంగల్ కల్చరల్, ఆగస్టు 16: వరంగల్ నగరంలో శ్రావణ శుక్రవారం వరలక్ష్మి వ్రతాలు వెల్లువెత్తాయి. మహిళలు ఆలయాల్లో, కొందరు ఇంట్లో వ్రతాన్ని ఆచరిం చారు. ఎంజీఎం సెంటర్‌లోని శ్రీరాజరాజేశ్వరి అమ్మవారు, హంటర్‌రోడ్డులోని శ్రీ సంతోషిమాత దేవాలయం, శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం భక్తులతో కిటకిట లాడాయి. రాజరాజేశ్వరి దేవి ఆలయంలో సామూహికంగా మహిళలు సామూహి కంగా వరలక్ష్మి వ్రతాలను నిర్వహించుకున్నారు. హంటర్‌రోడ్డులోని శ్రీసంతోషిమాత అమ్మవారికి వరలక్ష్మి వ్రతాన్ని నిర్వహించి అలంకరించారు. భక్తులు ఉపవాస దీక్షతో వందలాది మంది ప్రత్యేక క్యూలైన్ల ద్వారా సంతోషిమాతను దర్శించుకున్నా రు. ఉద్యాప పూజలు, కుంకుమార్చనలు, ప్రత్యేక హారతులను నిర్వహించారు. ఆల యాల్లో భక్తులకు మహా అన్నప్రసాద వితరణ జరిగింది.

భద్రకాళి ఆలయానికి భక్తుల తాకిడి

శ్రావణ శుక్రవారం వరలక్ష్మి వ్రతం పురస్కరించుకొని భద్రకాళి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా రాష్ట్రం నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు తరలిరావడంతో క్యూలైన్ల కిక్కిరిశాయి. దేవాలయ ప్రాంగణం, గర్భాలయం క్యూలైన్లతో కిటకిటలాడాయి. వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్ ఆలయాన్ని సందర్శించి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్, మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్‌తో పాటు పలువురు ఉన్నతాధి కారులు, ప్రజాప్రతినిధులు వ్యాపారులు అమ్మవారిని దర్శిం చుకున్నారు. పలువురు భక్తులు అమ్మవారికి ఒడి బియ్యాన్ని, నూతన వస్త్రాలను సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శేషు భారతి, ప్రధానార్చకులు భద్రకా ళి శేషు, ఆలయ సూపరింటెండెంట్ అద్దంకి వి జయ్‌కుమార్ పాల్గొన్నారు.

24 గంటల పాటు వైద్య సేవలు బంద్

వైద్య విద్యార్థిపై అఘాయిత్యానికి నిరసనగా ఐఎంఏ నిర్ణయం


ర్యాలీ నిర్వహిస్తున్న జూనియర్ డాక్టర్లు

వరంగల్ మెడికల్, ఆగస్టు 16: కోల్‌కత్తాలో వైద్య విద్యార్థి హత్యాచారా నికి నిరసనగా వరంగల్ నగరంలో శనివారం ఉద యం 6గంటల నుంచి 24 గంటలపాటు వైద్య సేవ లు నిలిపివేస్తున్నట్లు వరం గల్ ఐఎంఏ శాఖ ప్రకటిం చింది. ప్రభుత్వ వైద్య సేవలతోపాటు ప్రయివేటు ఆస్పత్రుల్లో కూడా సేవలు నిలిపి వేస్తున్నట్లు నేతలు ప్రకటించారు. వైద్య విద్యా ర్థిపై అత్యాచారం, హత్య ఘటనలు సమాజంలో ప్రతి ఒక్కరూ ఖండించాల ని కోరారు. వైద్యులకు రక్షణ కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా వైద్యులకు ప్రత్యేక రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతీ ప్రభుత్వ ఆస్పత్రిలో పోలీసు ఔట్‌పోస్టులను ఏర్పాటు చేయాలని సూచించారు.

మూడో రోజు 'జూడా'ల నిరసన

వైద్య విద్యార్థినిపై జరిగిన అత్యాచార ఘటనను నిరసిస్తూ చేపట్టిన జూడాల నిరసన మూడో రోజుకు చేరుకుంది. శుక్రవారం జూడాలు ర్యాలీ నిర్వహించి పబ్లిక్ గార్డెన్‌లో ధర్నా చేపట్టారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో మానవహారం చేపట్టి నినాదాలు ఇచ్చారు. నిరసన ర్యాలీకి మద్దతుగా హనుమకొండలోని ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులు మద్దతుగా నిలిచారు. అనంతరం వరంగల్ కలెక్టరేట్ ముందు ధర్నా చేపట్టి కలెక్టర్ సత్యశారదకు వినతిపత్రం అందజేశారు.

రుణమాఫీ సంబురం!

త్వరలో వరంగల్‌లో భారీ రైతు సభ నిర్వహణకు యోచన

- కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, సోనియాగాంధీ, ఖర్గేకు సీఎం ఆహ్వానం
- రైతు డిక్లరేషన్‌ను ప్రకటించిన ఆర్ట్స్ కాలేజీ మైదానంలో ఏర్పాట్లకు కసరత్తు
- మూడువిడతల్లో 2.65లక్షల రైతుల ఖాతాల్లో రూ.2,242కోట్లు జమ



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

ఎన్నికల హామీగా రైతు రుణమాఫీపై ప్రకటన చేసిన కాంగ్రెస్.. ఇచ్చిన మాట ప్రకారం మూడు విడతల్లో రూ.2లక్షల రుణమాఫీని పూర్తి చేసిన విషయం తెలిసిందే. దీంతో రైతులు రుణమాఫీ సంబురంలో మునిగిన క్రమంలో త్వరలోనే రైతు కృతజ్ఞత సభను నిర్వహించాలని కాంగ్రెస్ యోచిస్తోంది. అయితే 2022 మే 6వ తేదీన వరంగల్‌లో రైతు డిక్లరేషన్ సభ నిర్వహించిన వరంగల్ ఆర్ట్స్ కాలేజీ మైదానంలోనే ఈ రైతు కృతజ్ఞత సభను కూడా నిర్వహించాలని భావిస్తోంది. నిర్వహించేందుకు కాంగ్రెస్ పార్టీ ఏర్పాట్లు చేస్తోంది. వాస్తవానికి గత జూలై నెలాఖరునే వరంగల్‌లో సభ నిర్వహించాలని భావించినా.. పార్లమెంట్ సమావేశాలుండటంతో ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, సోనియాగాంధీ, మల్లికార్జున్ ఖర్గే సభకు రావడానికి వీలు పడలేదు. ఈ క్రమంలోనే శుక్రవారం ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి రుణమాఫీని పూర్తిస్థాయిలో అమలు చేసిన నేపథ్యంలో వరంగల్‌లో నిర్వహించబోయే భారీ రైతు సభకు రావాల్సిందిగా రాహుల్‌గాంధీ, సోనియాగాంధీ, ఖర్గేలను ఆహ్వానించినట్టు సమాచారం. వారి నుంచి సానుకూల స్పందన రావడంతో 24న లేదంటే 25వతేదీన వరంగల్‌లో రైతు కృతజ్ఞత సభ నిర్వహణ ఉంటుందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. సుమారు ఐదు లక్షల మంది రైతులతో కృతజ్ఞత సభ నిర్వహించే లక్ష్యంతో కసరత్తు చేస్తోంది. అయితే సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ నుంచి తిరిగి రాగానే వరంగల్‌లో సభ నిర్వహణపై దృష్టి పెట్టనున్నారని, ఒక వేళ ఆ రోజు కుదరకపోతే నెలఖారులోపు కచ్చితంగా సభ ఉండి తీరుతుందని కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి.

రుణమాఫీ.. రైతు హ్యాపీ..

ఇచ్చిన హామీ మేరకు 27 రోజుల్లో మూడు విడతల్లో రూ.2లక్షల రుణమాఫీని అమలు చేయడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. జూలై 18న తొలి విడత మాఫీని అమలు చేయగా.. మొదటి రెండు విడతల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 2,08,077 మంది రైతుల ఖాతాలో రూ.1,506.50కోట్ల మాఫీ డబ్బులను ప్రభుత్వం జమ చేసింది. ఇక మూడో విడతలో రూ.1.50లక్షల నుంచి రూ.2లక్షల లోపు రుణమాఫీ ఉన్న 56,704 మంది రైతుల ఖాతాలో రూ.735.29కోట్లను జమ చేసింది. మొత్తం మాడు దశల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 2,64,781మంది రైతులకు రూ.2,241.79కోట్ల రుణమాఫీని చేసింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది కూడా పూర్తికాకముందే రైతులకు రూ.2లక్షల రుణమాఫీపై ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడంపట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే సాంకేతిక కారణాలతో కొందరు రైతులకు రుణమాఫీ కాకపోవటతో ఆందోళనలో ఉండగా.. అలాంటి వారి నుంచి కలెక్టరేట్లలోనే హెల్ప్ సెంటర్లు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరిస్తుండటం కొంత ఊరటనిస్తోంది. త్వరలోనే ఆ సాంకేతిక సమస్యలను అధిగమించి ఈ నెలాఖరు కల్లా పూర్తి ప్రక్రియను పూర్తిచేస్తామని ఇటీవల భూపాలపల్లి జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించడం, ఆమేరకు అధికారులు కూడా కరసత్తు ప్రారంభించడంతో మాఫీ వర్తించని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

స్వచ్ఛ సంకల్పం

పట్టణాల్లో ప్రజా మరుగుదొడ్ల నిర్మాణానికి నిర్ణయం



- 2026 నాటికి పెరిగే జనాభాను దృష్టిలో ఉంచుకుని చర్యలు
- ప్రతీ వెయ్యి జనాభాకు ఒక టాయిలెట్ సీటు
- స్థలాల ఎంపికకు అధికారుల కసరత్తు
- స్వచ్ఛభారత్-2 కింద కేంద్ర ప్రభుత్వ నిధులు
- ఉమ్మడి వరంగల్ జిల్లాకు రూ.3.75కోట్లు మంజూరు

పట్టణ ప్రాంతాల్లో అధునాతన ప్రజామరుగుదొడ్లను నిర్మించాలని కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. స్వచ్ఛభారత్ విఎషన్-1 కింద దేశవ్యాప్తంగా ఇప్పటికే ప్రజా మరుగుదొడ్లను నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వాలకు నిధులు ఇచ్చిన కేంద్రం.. స్వచ్ఛభారత్ -2 కింద కూడా మరిన్ని నిధులు ఇవ్వడం ద్వారా ప్రజామరుగుదొడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా రెండోదశలో రాష్ట్ర ప్రభుత్వానికి మొదటి విడతగా రూ. 34కోట్లను మంజూరు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం తన వంతు వాటాగా 50శాతం నిధుల కింద మరో రూ.17 కోట్లను సమకూరుస్తుంది. ఈ మొత్తంతో 1,357 టాయిలెట్ల సీట్లతో కూడిన మరుగుదొడ్లను నిర్మించనున్నారు. ఇందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఒక నగర పాలక సంస్థ, తొమ్మిది మున్సిపాలిటీలకు రూ.3.75కోట్లు మంజూరయ్యాయి.

హనుమకొండ, ఆగస్టు 16, (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రాంతాల్లో ప్రజా మరుగుదొడ్లు (పబ్లిక్ టాయిలెట్లు) చాలినన్ని లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ మేరకు అవరసమైన మరుగుదొడ్లను నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. పట్టణాల్లో ఏ ఏ స్థలాల్లో ప్రజా మరుగుదొడ్లు అవసరమో స్థలాను గుర్తించి ని ర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. దశా బ్దాల కిందట నిర్మించిన ప్రజా మరుగుదొడ్లలో చాలా వరకు శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటిని కూల్చేసి ఆ స్థానంలో లేదా మరే ఇతర అనువైన స్థలంలో వీటి ని నిర్మించుకోవచ్చునని ఉత్తర్వుల్లో పేర్కొన్నది. నిర్మాణ వ్యయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా భరిస్తాయి.

గ్రామీణుల ఇబ్బందులు

గ్రామాల నుంచి పట్టణాలకు వివిధ పనులపై రో జుకు వేలాది మంది వస్తుంటారు. పాలు, కూరగా యలు అమ్ముకునేవారు, ఇతర చిరువ్యాపారులు, రైతులు తెల్లవారుజామునే గ్రామాల నుంచి బస్సుల్లో, రైళ్లలో బయటు దేరి పట్టణాలకు చేరుకుంటారు. కాలకృత్యాలు తీర్చుకోవడానికి పట్టణాల్లో ప్రస్తుతం పబ్లిక్ టాయిలెట్లు ఉన్నా.. అవి సరిపోవడం లేదు. రద్దీ ప్రాంతాల్లో ముఖ్యంగా రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్ల సమీ పంలో, కూరగాయల మార్కెట్లు, చౌరస్తా ప్రాంతాల్లో రద్దీ అధికంగా ఉండడంతో అత్యవసరమైనవారు పబ్లిక్ టాయిలెట్ల వద్ద వేచిచూడాల్సి వస్తోంది. పైగా ప్రస్తు తం ఉన్న పబ్లిక్ టాయిలెట్లలో ఎక్కువ భాగం ఎని వి ఎది కన్నా తక్కువ సీట్లు ఉన్నవే. కొన్నిట్లో ఐదు మాత్రమే ఉన్నాయి.

పెరిగే జనాభా మేరకు..


స్వచ్ఛ భారత్ మార్గదర్శకాల ప్రకారం మున్సిపాలిటీ లో ప్రతీ వెయ్యి జనాభాకు ఒక సీటు చొప్పున ప్రజామరుగుదొడ్లను నిర్మించాలి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న పట్టణాల్లో ప్రజామరుగు దొడ్లు ఉన్నా.. ప్రజలకు సరిపడా అందుబాటులో లేవు. పట్టణాలకు సమీప గ్రామీణ ప్రాంతాల నుంచి వేలాది మంది వివిధపనుల నిమిత్తం వస్తుంటారు. వారంతా అత్యవసర సమయంలో ప్రజా మరుగుదొడ్లనే వి నియోగించాల్సిన పరిస్థితి. ప్రస్తుతం జారీ చేసిన ఉత్తర్వుల్లో 2026 సంవత్సరం నాటికి పెరిగే పట్టణ జనాభాను అంచనా వేసింది. దాంతోపాటు గ్రామాల నుంచి రోజు పట్టణాలకు వచ్చి పోయే వారిని పట్టణ జనాభాలో 5శాతంతో లెక్కించి కొత్తగా మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. అయితే నిర్వహణలో ఉన్న మరుగుదొడ్లలో పరిశుభ్రత లోపిస్తోందనే ఆరోపణలున్నాయి. డబ్బులు చెల్లించి వి నియోగించే (పే అండ్ యూజ్) మరుగుదొడ్ల నిర్వాహకులు రెట్టింపు వసూలు చేస్తున్నా బల్దియా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి.

స్థలాల ఎంపికకు కసరత్తు

పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణానికి స్థలాల ఎంపికే పెద్ద సవాల్‌గా నిలుస్తోంది. రద్దీ కూడళ్లలో అనువైన స్థలా లు దొరకడం లేదు. ఒక వేళ దొరికినా చుట్టు పక్కల వారు అభ్యంతరం పెడుతున్నారు. స్వచ్ఛ భారత్ వి ఎషన్-2 మార్గదర్శకాల ప్రకారం అత్యవసరంగా మరు గుదొడ్డికి వెళ్లాలనుకునేవారికి 2 నిమిషాల్లో మరుగు దొడ్డి వద్దకు చేరుకునేలా నిర్మించాల్సి ఉంటుంది. అది స్థలాల కొరత వల్ల సాధ్యం కావడం లేదు. ప్రధాన రహదారికి ఆనుకొని వీటిని నిర్మించే క్రమంలో ఆటంకాలు ఎదురవుతున్నాయి. దీంతో దూరంగా స్థలం దొరికిన చోట నిర్మిస్తున్నారు. దీంతో వాటిని ప్రజలు ఉపయోగించుకోలేకపోవడంతో నిరుపయోగంగా మా రుతున్నాయి. పబ్లిక్‌గార్డెన్, కూరగాయల మార్కెట్ తదితర నిత్యం రద్దీ ఉండే ప్రాంతాల్లో ఉన్న ప్రజా మరుగుదొడ్లకు తాకిడీ ఎక్కువగా ఉంటోంది. అయితే ఇక్కడ మరుగుదొడ్ల నిర్వాహకులు వాటిని పరిశు భ్రంగా ఉంచకపోవడంతో అక్కడికి వెళ్లడానికి ప్రజలు పెద్దగా ఇష్టపడడం లేదు. ఈ పరిస్థితుల్లో స్వచ్ఛ భార త్ మిషన్-2 కింద మరుగుదొడ్ల నిర్మాణంపై కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేసింది. ఆ మేరకు వాటిని నిర్మించేలా చూడాలని రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది.


జనాభా - మరుగుదొడ్లు

వరంగల్ మహానగర పాలక సంస్థ మొత్తం జనాభా 11 లక్షలు. వివిధ పనులపై బయట నుంచి వచ్చేవారు 5 శాతం. అంటే 55వేల మందిని కూడా కలుపుకుంటే 11.55 లక్షలకు చేరుకుంటుంది. ఈ లెక్కన గ్రేటర్ మున్సిపాలిటీ పరిధిలో ఒక్కో పబ్లిక్ టాయిలెట్‌ను 12 సీట్లతో నిర్మిస్తారు. మిగతా మున్సిపాలిటీలైన జనగామ జనాభా బయటి నుంచి వచ్చే పోయే 5 శాతం మందిని కలుపుకుంటే మొత్తం జనాభా 77వేలు, మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలో బయటి నుంచి వచ్చే 5 శాతం కలుపుకొని మొత్తం జనాభా 60,900,



నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలో మొత్తం జనాభా బయటి నుంచి వచ్చే 5శాతం కలుపుకుంటే 42వేలు, తొర్రూరు మున్సిపాలిటీ పరిధిలో మొత్తం జనాభా బయటి నుంచి వచ్చే 5 శాతం కలుపుకుంటే 27,500. నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలో మొత్తం జనాభా బయటి నుంచి వచ్చే 5 శాతం మందిని కూడా కలుపుకుంటే 36,750, మరిపెడ మున్సిపాలిటీ మొత్తం జనాభా 5శాతం కలుపుకుంటే 24,150. డోర్నకల్ బల్దియా మొత్తం జనాభా 5 శాతం కలుపుకుంటే 21వేలు, వర్ధన్నపేట మున్సిపాలిటీ మొత్తం జనాభా 5శాతంతో కలుపుకొని 15,750. వీటిల్లో 8 సీట్లతో కూడిన ప్రజా మరుగుదొడ్లను నిర్మిస్తారు. ఒక్కోదానిపై రూ.20లక్షలను వెచ్చిస్తారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం రూ.10లక్షలు మంజూరు చేయగా, రాష్ట్ర ప్రభుత్వం తన వంతు వాటాగా రూ.10లక్షలను సమకూరుస్తుంది.


హనుమకొండ డీఈవోగా వాసంతి



వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 16: హనుమకొండ డీఈవోగా డి.వాసంతికి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ విద్యాశాఖ డైరెక్టర్ కె.లింగయ్య శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. హనుమకొండ డీఈవో డాక్టర్ ఎం.డి. అబ్దుల్‌హై అనారోగ్యకారణాలతో రెండు నెలలపాటు సెలవులో వెళ్లడంతో వాసంతికి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వరంగల్ డీఈవోగా పనిచేస్తున్న వాసంతి శనివారం హనుమకొండ డీఈవోగా అదనపు బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిసింది.

వ్యాధుల నియంత్రణకు సమన్వయంతో పనిచేయాలి

- ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలతో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు 16: సీజనల్ వ్యాధుల నియంత్రణలో ప్రైవేట్ ఆస్పత్రులు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖతో సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో సీజనల్ వ్యాధులపై శుక్రవారం కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధుల చికిత్సలో ప్రైవేట్ ఆస్పత్రులు బాధ్యతగా వ్యవహరించి జ్వరాలతో వచ్చిన రోగులకు నాణ్యమైన చికిత్స అందించాలన్నారు. రోగులకు రాపిడ్ కిట్ ద్వారా పరీక్ష చేసి డెంగీ వస్తే నిర్ధారణ కోసం ఎంజీఎం లేదా టీడయాగ్నస్టిక్ హబ్‌లకు పంపించాలన్నారు. అన్ని ప్రైవేట్ ఆస్పత్రుల్లో పరీక్షల చార్జీలు, బెడ్ చార్జీలు, మందుల ఖరీదు ఎంత అనేది ముందుగానే రోగులకు తెలియజేయాలన్నారు. అలాగే చార్జీల వివరాలను అందరికీ కనిపించే విధంగా ప్రదర్శించాలన్నారు. డెంగీ, మలేరియా, ఇతర వ్యాధుల వివరాలను ప్రతీరోజు నిర్ణీత ప్రొఫార్మాలో తప్పనిసరిగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి తెలియజేయాలని కోరారు. రోగుల వివరాలను పూర్తి చిరునామాతో తెలియజేస్తే పంచాయతీ, మునిసిపల్, ఆరోగ్య శాఖ అధికారులు ఆ ప్రాంతాల్లో తగిన చర్యలు తీసుకుంటారన్నారు. ఆస్పత్రుల్లో అందిస్తున్న సేవలపై ఫిర్యాదులు అందితే జిల్లా రాపిడ్ రెస్పాన్స్ టీమ్ విచారించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో గుర్తింపు పొందిన చికిత్సలను ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందించాలన్నారు. ఆరోగ్య శ్రీ రోగుల నుంచి ఎలాంటి అదనపు చెల్లింపులు వసూలు చేయవద్దని ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలకు కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ లలితాదేవి, వివిధ ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు, డాక్టర్లు పాల్గొన్నారు.

కేటీఆర్ వ్యాఖ్యలపై భగ్గుమన్న కాంగ్రెస్

- హనుమకొండ జిల్లాలో నిరసనలు, దిష్టిబొమ్మ దహనాలు


కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసిన కాంగ్రెస్ నాయకులు

హనుమకొండ సిటీ, ఆగస్టు 16: ఉచిత బస్సు ప్రయాణం పథకానికి సంబంధించి మహిళలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై జిల్లా కాంగ్రెస్ నేతలు భగ్గుమన్నారు. మహిళా కాంగ్రెస్‌తో పాటు ఇతర కాంగ్రెస్ నా యకులు, కార్యకర్తలు శుక్రవారం పలు చోట్ల రోడ్ల పై నిరసన తెలిపారు. కేటీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. హనుమకొండలో మహిళా కాం గ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళా ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ కార్యాలయం నుంచి కాంగ్రెస్ శ్రేణులు అశోక జంక్షన్ వరకు ర్యాలీగా వెళ్లారు. జంక్షన్‌లో నిరసన తెలిపారు. కేటీఆర్ దిష్టిబొమ్మ ను దహనం చేశారు.

ఈ సందర్భంగా వరంగల్ జిల్లా కాంగ్రెస్ అ ధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడుతూ.. కేటీఆర్ వ్యాఖ్యలు మహిళల ఆత్మగౌరవాన్ని కించపరిచా యన్నారు. ఆయన వెంటనే బేషరతుగా క్షమాప ణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్ర భుత్వం మహిళా సంక్షేమానికి చేపట్టిన చర్యల్లో ఉచిత బస్సు ప్రయాణం ఒకటన్నారు. ఈ పథకం పై కేటీఆర్‌కు అక్కసు ఎందుకని ప్రశ్నించారు. అభ్యంతకర వ్యాఖ్యలు చేసిన కేటీఆర్‌ను రాష్ట్రంలో ఎక్కడా తిరగనివ్వకుండా అడ్డుకోవాలని మహిళ లకు పిలుపునిచ్చారు. మహిళలు బీఆర్ఎస్‌ను భూస్థాపితం చేస్తారన్నారు. బంక సరళా మా ట్లాడుతూ.. కాంగ్రెస్ పట్ల మహిళల ఆదరణ చూసి కేటీఆర్ తట్టుకోలేకపోతున్నారన్నారు. మం త్రిగా బాధ్యతలు నిర్వహించిన కేటీఆర్ మహిళల పట్ల నీచంగా మాట్లాడడం దురదృష్టకరమన్నరు. కేటీఆర్ వ్యాఖ్యలతో రాష్ట్రంలోని మహిళలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని బీఆర్ఎస్ నేతలకు తగిన గుణపాఠం చెబుతారన్నారు.

కాగా, హనుమకొండతో పాటు జిల్లాలోని ఎ ల్కతుర్తిలో కాంగ్రెస్ నాయకులు నిరసన తెలిపా రు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ విజయశ్రీ రజాలీ, మహిళా కాంగ్రెస్ నాయకులు యామిని, స్రవంతి, సుకన్య, టీపీసీసీ నాయకులు బత్తిని శ్రీనివాస్, డాక్టరు పులి అనిల్‌కుమార్, జిల్లా కాంగ్రెస్ నాయకులు బంక సంపత్‌యాదవ్, రజాలీ తదితర నాయకులు పాల్గొన్నారు.

అసిస్టెంట్, సబ్ ఇంజనీర్లపై సస్పెన్షన్ వేటు

హనుమకొండ టౌన్, ఆగస్టు 16: వరంగల్ సర్కిల్ పరిధిలోని ఏజే మిల్స్ ఏఈ ఎం.జ్యోతిర్మయినాథ్, గొర్రెకుంట సబ్‌ఇంజనీర్ డి.నరేశ్‌ను సస్పెండ్ చేస్తూ ఎస్ఈ పి.మధుసూదన్‌రావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. విద్యుత్ అంతరాయంపై ఓ వినియోగదారుడు ఏఈ జ్యోతిర్మయినాథ్‌కు ఫోన్ చేసి విద్యుత్ సరఫరాను ఎప్పుడు పునరుద్ధరిస్తారని అడగగా, ఏఈ దూషించాడు. అలాగే సబ్ ఇంజనీర్ నరేశ్ కూడా దూషించడంతో ఈ విషయం సోషల్‌మీడియాలో వైరల్ అయింది. దీంతో ఎన్పీడీసీఎల్ యాజమాన్యం ఇద్దరిపై వేటు వేసింది.

ప్రైవేటు ఆస్పత్రుల్లో విజిలెన్స్ దాడులు

వరంగల్ మెడికల్, ఆగస్టు 16: నగరంలోని రెండు ప్రయివేటు ఆస్పత్రుల్లో విజిలెన్స్ విభాగం దాడులు నిర్వహించింది. శుక్రవారం వరంగల్‌లోని సురక్ష ఆస్పత్రి, హనుమకొండలోని ముత్య కిడ్నీ సెంటర్లపై దాడులు చేశారు. ఆరోగ్యశ్రీ అర్హత ఉన్నప్పటికీ రోగుల నుంచి అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు అందడంతో దాడులు చేశారు. మరో రెండు ఆస్పత్రులపై ఫిర్యాదులు వచ్చినప్పటికీ రాజకీయ ఒత్తిడులతో దాడులు తాత్కాలికంగా నిలిపివేసినట్లు సమాచారం. ఆరోగ్యశ్రీలో అన్ని అర్హతలున్నప్పటికీ రోగుల వద్ద అదనంగా డబ్బులు వసూలు చేస్తూ రశీదులు కూడా ఇవ్వడం లేదని ఆరోగ్యశ్రీ విజిలెన్స్ విభాగానికి పిర్యాదు అందాయి. దీంతో ఈ ఆస్పత్రులపై అధికారులు దాడి చేసినట్లు తెలిసింది.

ద్విచక్రవాహనాల దొంగ అరెస్టు

హనుమకొండ టౌన్, ఆగస్టు 16: ద్విచక్రవాహనాల దొంగను శుక్రవారం అరెస్టు చేసినట్లు హనుమకొండ సీఐ వై.సతీష్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. శుక్రవారం హనుమకొండ చౌరస్తాలోని కాకాజీకాలనీలో వాహనాలు తనిఖీ చేస్తుండగా రెండు నెలల కిందట హనుమకొండ బస్టాండ్‌లో చోరీకి గురైన హోండా షైన్ వాహనంతో జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం మల్లక్కపల్లికి చెందిన రంగు గంగాధర్ పట్టుబడ్డాడు. అదుపులోకి తీసుకొని విచారించగా హైద్రాబాద్‌లోని అమీర్‌పేట, యాదగిరిగుట్ట, స్టేషన్‌ఘన్‌పూర్, చేర్యాలలో కలిపి 5 బైకులు దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు. దొంగలించిన బైకులు గుంటూరువాసి అయిన సుభాన్‌కు అమ్మినట్లు అంగీకరించాడు. నిందితుడి నుంచి బైకును స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరుపరచామన్నారు.

వివాహిత అదృశ్యం



జోగు జ్యోతి (ఫైల్)

వేలేరు, ఆగస్టు 16: వేలేరు మండల కేంద్రానికి చెందిన జోగు జ్యోతి అనే వివాహిత అదృశ్యమైనట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. వేలేరుకు చెందిన జ్యోతి భర్త 9 నెలల కిందట మృతి చెందాడు. అప్పటి నుంచి ఆమె దిగాలుగా ఉంటూ మనో వేదనకు గురైంది. ఈ క్రమంలో ఈ నెల 11న ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకుని ఇంట్లో నుంచి వెళ్లి పోయింది. విషయం తెలుసుకున్న బంధువులు, కుటుంబసభ్యులు తెలిసిన వారి ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో జ్యోతి రెండో కుమార్తె అర్చన ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. జ్యోతి 5.2 అంగుళాల ఎత్తు, చామన ఛాయ రంగు కలిగి ఉంటుంది. ఎర్ర చీర, నలుపు బ్లౌజు ధరించి ఉంది. ఆచూకీ తెలిసిన వారు వేలేరు పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై సూచించారు.

డాక్టర్ పల్లెపాడు దామోదర్‌కు సన్మానం


అవార్డు అందుకుంటున్న పల్లెపాడు దామోదర్

కాశోజీ జంక్షన్, ఆగస్టు 16: వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నందుకు దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి అధ్యక్షుడు డాక్టర్ పల్లెపాడు దామోదర్‌ను కన్స్యూమర్ కో ఆర్డినేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) జాతీయ ఛైర్మన్ అనంతశర్మ, జాతీయ కన్వెన్షన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈనెల 16, 17 తేదీల్లో గుజరాత్ రాష్ట్రంలోని అంబాజీలో జరుగుతున్న సీసీఐ జాతీయ కన్వెన్షన్‌లో పల్లెపాడు దామోదర్ దక్షిణాది రాష్ట్రాల తరఫున ప్రాతినిధ్యం వహించి పాల్గొన్నారు. దామోదర్ మూడు దశాబ్దాలుగా వినియోగదారులను చైతన్యపరిచే కార్యక్రమంలో భాగంగా గ్రామ స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యంగా తూనికలు, కొలతల్లో జరిగే మోసాలపై, బంగారం కొనుగోలులో హాల్ మార్క్, బీఐఎస్ ప్రాముఖ్యతపై రియల్ ఎస్టేట్, రెగ్యులేటరీ యాక్ట్‌పై ప్రభుత్వ శాఖల సమన్వయంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రీతిపాండే, ప్రెసిడెంట్ అరుణ్‌కుమార్, వినియోగదారుల జాతీయ కన్వెన్షన్ సభ్యులు పాల్గొన్నారు.

వినియోగదారుల కేంద్ర కమిటీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా చక్రపాణి



హనుమకొండ(ఆంధ్రజ్యోతి): వినియోగదారుల కేంద్రకమిటీకి సాంబరాజు చక్రపాణి రెండోసారి వరుసగా జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఆయన ఈ పదవిలో రెండేళ్లు కొనసాగుతారు. గుజరాజ్ రాష్ట్రంలోని అంబాజీలో రెండు రోజులుగా వినియోగదారుల జాతీయ సమావేశాలు జరుగుతున్నాయి. శుక్రవారం జరిగిన ముగింపు సమావేశంలో వినియోగదారుల కేంద్ర కమిటీకి ఎన్నికలు జరగగా, తెలంగాణ నుంచి చక్రపాణి ఎన్నికయ్యారు. కాగా, పల్లె దామోదర్ సీనియర్ సెక్రెటరీగా, అన్నప్రగడ శివపార్వతి కార్యదర్శిగా ఎన్నికయ్యారు. వినియోగదారుల కేంద్ర కమిటీకి నూతన అధ్యక్షురాడిగా గుజరాత్‌కు చెందిన పాండ్య ఎన్నికయ్యారు. అన్ని రాష్ట్రాలకు ప్రాతినిథ్యం కల్పిస్తూ డాక్టర్ అనంత శర్మ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. చక్రపాణి మూడు దశాబ్దాలుగా వినియోగదారుల ఉద్యమంలో కొనసాగుతున్నారు. రాష్ట్ర వినియోగదారుల మండలి అధ్యక్షుడిగా కూడా ఉన్నారు.

సివిల్ సర్వీసెస్ ర్యాంకర్లకు సత్కారం


సివిల్స్ ర్యాంకర్లను సన్మానిస్తున్న వాగ్దేవి సంస్థల అధినేత దేవేందర్‌రెడ్డి

హనుమకొండ టౌన్, ఆగస్టు 16: యూపీఎస్సీ-2023లో ర్యాంకులు సాధించిన ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన నలుగురికి శుక్రవారం కిషన్‌పురలోని వాగ్దేవి కళాశాల ఆడిటోరియంలో సత్కరించారు. దీక్ష ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో 'గురువందనం' పేరుతో నిర్వహించిన కార్యక్రమానికి ఏపీ మాజీ సీఎస్ ఉమామహేశ్వర్‌రావు, మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ వీఎస్ సంపత్ హాజరై పరిపాలనలో సివిల్ సర్వెంట్స్‌కు ఎదురయ్యే సమస్యలను తమ అనుభవాల ద్వారా తెలిపారు. ఈ కార్యక్రమంలో ర్యాంకర్లు అనూష కొల్లి, భార్గవ్ కుమార్, కిరణ్ సాయింపు, లవకుమార్, వాగ్దేవి విద్యాసంస్థల అధినేత డాక్టర్ సీహెచ్. దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆగమ్యగోచరంగా వర్సిటీ పీజీ కళాశాలలు

- ఏటేటా తగ్గుతున్న అడ్మిషన్లు
- అభివృద్ధిని పట్టించుకోని వర్సిటీ అధికారులు
- మూసివేతలో జనగామ, మహబూబాబాద్, భూపాలపల్లి కళాశాలలు



కేయూక్యాంపస్, ఆగస్టు 16: కాకతీయ యూనివర్సిటీపరిధిలోని వర్సిటీ పీజీ కళాశాలల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. ఎంతో ఉదాత్తమైన ఆలోచనలతో పేద, మధ్య తరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే గొప్ప లక్ష్యంతో స్థాపించిన కళాశాలలు నీరుగారిపోతున్నాయి. వర్సిటీ ఉన్నతాధికారులు నిర్లక్ష్య ధోరణి, స్థానిక ప్రజాప్రతినిధుల పట్టింపులేని తనంలో వర్సిటీ పీజీ కళాశాలల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. సరైన అధ్యాపకుల్లేక పాఠాలు సరిగ్గా జరుగక విద్యార్థులు పీజీ కళాశాల్లో అడ్మిషన్లు పొందేందుకు వెనకడుగు వేస్తున్నారు. విద్యార్థుల అడ్మిషన్లు లేవని వర్సిటీ అధికారులు పీజీ కళాశాలల్లో అధ్యాపకులను నియమించడం లేదు. దీంతో ఏటేటా పీజీ కళాశాలల్లో విద్యార్థుల అడ్మిషన్ల సంఖ్య దారుణంగా పడిపోతోంది.

ఏటేటా తగ్గుతున్న అడ్మిషన్లు

గతంలో వర్సిటీ పరిధిలో జనగామ, మహబూబాబాద్, భూపాలపల్లిలో వర్సిటీ పీజీ కళాశాలలు ఏర్పాటు చేశారు. జనగామలో ఎంఏ ఇంగ్లీష్, ఎంకామ్, ఎంఎస్‌డబ్ల్యూ, మహబూబాబాద్‌లో ఎంఏ తెలుగు, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంఏ ఎకానమిక్స్ కోర్సులను ప్రారంభించారు. అలాగే భూపాలపల్లిలో ఎంఏ ఇంగ్లీష్ కోర్సును అందుబాటులోకి తెచ్చారు. కోర్సులను ప్రారంభించిన వర్సిటీ అధికారులు.. శాశ్వత భవనాలపై దృష్టి సారించకుండా అక్కడి డిగ్రీ కళాశాలల్లోనే కోర్సులను నడిపిస్తున్నారు. సొంత భవనాలు లేకపోవడంతో విద్యార్థులకు కూర్చునేందుకు అవకాశం లేక తరగతులు సక్రమంగా నడవడం లేదు. తరగతులు సక్రమంగా నడవకపోవడంతో విద్యార్థులు క్లాస్‌లకు హాజరుకావడం లేదు. సరైన అధ్యాపకులను నియమించకపోవడంతో పాఠాలు సక్రమంగా జరగక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో అడ్మిషన్లపై తీవ్ర ప్రభావం పడుతోంది. క్లాస్‌లు సక్రమంగా జరుగక, సరైన వసతుల్లేక జనగామ పీజీ సెంటర్‌లోని ఎంఎస్సీ కెమిస్ట్రీ కోర్సును రద్దు చేశారు. దీంతో కెమిస్ట్రీ కోర్సును అభ్యసించే జనగామ విద్యార్థులు హనుమకొండకు రావాల్సి వస్తోంది.

స్థానిక ప్రజాప్రతినిధులు నిర్లక్ష్య వైఖరి

జనగామ, భూపాలపల్లి, మహబూబాబాద్ పీజీ కళాశాలల అభివృద్ధికి విద్యార్థులు ఎంతగానో పోరాటాలు చేశారు. విద్యార్థి సంఘాల నేతృత్వంలో స్థానిక ఎమ్మెల్యేలతోపాటు ఇతర ప్రజాప్రతినిధులను కలిసి పీజీ కళాశాలలకు భూమి కేటాయించి శాశ్వత భవనాలు నిర్మించాలని వినతిపత్రాలు అందచేశారు. జనగామ, మహబూబాబాద్‌లో భూ కేటాయింపునకు సంబంధించిన పనులు జరిగిన శాశ్వత భవనాల మాట ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. భూపాలపల్లిలో పీజీ కళాశాలకు భూకేటాయింపు జరగలేదు. కళాశాలకు భూమిని కేటాయించి, శాశ్వత భవనాలు నిర్మిస్తే అక్కడి విద్యార్థులకు పీజీ కోర్సులు చదువుకునే అవకాశం కలుగుతోంది. లేకపోతే రానున్న రోజుల్లో వర్సిటీ పీజీ కళాశాలలు కనుమరుగయ్యే దుస్థితి నెలకొంది.

వర్సిటీ అధికారుల విచిత్ర ధోరణి

పీజీ కళాశాలల మనుగడను దెబ్బతీసేందుకు వర్సిటీ అధికారులు విచిత్ర వైఖరిని అవలంబిస్తున్నారని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మహబూబాబాద్, జనగామ, భూపాలపల్లి పీజీ కళాశాలల్లో అడ్మిషన్లు పొందిన కొద్దిమంది విద్యార్థులను వర్సిటీ క్యాంపస్‌తో పాటు సుబేదారిలోని పీజీ కళాశాలకు మారుస్తున్నారు. పీజీ సెంటర్లలో ఒక్కో కోర్సులో తగినన్ని అడ్మిషన్లు లేవనే సాకుతో అడ్మిషన్లు పొందిన ఆ కొద్దిమంది విద్యార్థులను అక్రమంగా తమ అడ్మిషన్ పొందిన కళాశాల కాకుండా మరో కళాశాలకు మారుస్తుండంతో పీజీ కళాశాలల లక్ష్యం నీరుగారిపోతోంది. ఆయా పీజీ సెంటర్లలో జాయిన్ అయిన విద్యార్థులు మరో కళాశాలకు మార్చినా అక్కడే అడ్మిషన్‌తోనే పరీక్షలకు అనుమతిస్తున్నారు. అడ్మిషన్ ఒక పీజీ కళాశాలలో చదువు మరో కళాశాలలో నడుస్తుడంతో విద్యార్థులు ఏమీ పాలుపోవడం లేదు.

పీజీ కళాశాల మనుగడపై నీలినీడలు

కర్నుడి చావుకు సవాలక్ష కారణలనే విధంగా.. పీజీ కళాశాలల్లో అడ్మిషన్లు లేవని, తరగతులు జరగడం లేదనే సాకుతో కళాశాల మూసివేతకు వర్సిటీ అధికారులు. రంగం సిద్ధం చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఎస్ఎఫ్‌సీ కోర్సులైన పీజీ సెంటర్లలో జీతాలకు సరిపోయే నిధుల్లేక అధ్యాపకులను నియమించకపోవడంతో తరగతులు జరుగడం లేదు. దీంతో విద్యార్థులు కళాశాలకు రావడం లేదు. ఫలితంగా అసలు పీజీ కళాశాల మనుగడపై నీలినీడలు కమ్ముకున్నాయి. పీజీ కళాశాలలు మూసివేస్తే పేద, దళిత, మధ్య తరగతి వర్గాలకు ఉన్నత విద్య అందని దాక్షలాగే మారుతోంది. పీజీ కళాశాలలకు పర్యవేక్షణ బాధ్యతలను ఇన్‌చార్జులకు అప్పగించారు. దీంతో పీజీ కళాశాలలపై పర్యవేక్షణ కొరవడింది. దొందూ దొందే.. అనే ధోరణిలో పీజీ కళాశాల సిబ్బంది, ఇన్‌చార్జి ప్రిన్సిపాళ్లు, తాత్కాలిక అధ్యాపకులు వ్యవరిస్తున్నారు.

పాడైపోతున్న నిర్మల్ పీజీ కళాశాల భవనం

ఉమ్మడి ఆదిలాబాద్‌లోని నిర్మల్ పీజీ కళాశాల ఎందుకు పనికి రాకుండా పోతోంది. నిర్మల్ పీజీ కళాశాలకు శాశ్వత భవనంతో పాటు ఫర్నిచర్ ఇతర సదుపాయాలుప్పటికీ వర్సిటీ అధికారులు నిర్లక్ష్య వైఖరిలో అక్కడ అడ్మిషన్లు లేవు, క్లాస్‌లు జరగడం లేదు. కళాశాలలోని ఫర్నిచర్‌తో పాటు వర్సిటీకి చెందిన భవనం దెబ్బతింటోంది. వర్సిటీ నిధులు రూ.కోట్లు ఖర్చు చేసి నిర్మించిన భవనం ఎందుకు పనికి రాకుండా పాడైపోతోంది. నిర్మల్ కళాశాలలో ఈ ఏడాదైనా విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించి విద్యను అందిస్తే బాగుంటుందని విద్యావేత్తలు అభిప్రాయ పడుతున్నారు.

ఎమ్మెల్సీ కోదండరామ్‌ను కలిసిన విద్యాశాఖ సిబ్బంది


ఎమ్మెల్సీ కోదండరామ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న విద్యాశాఖ సిబ్బంది

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 16: ఎమ్మెల్సీ ఎన్నికైన కోదండరామ్‌ను ఉమ్మడి జిల్లాలోని విద్యాశాఖలో పనిచేస్తున్న సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో కోదండరామ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ విద్యాశాఖలో పనిచేసున్న సీనియర్ అసిస్టెంటు ఎం.డి. ఫకృద్దీన్, ఆర్జేడీ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఎం.డి. ఉస్మాన్ పాషా, జూనియర్ అసిస్టెంట్ ఆర్.అశోక్, జనగామ డీఈవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ కె.పవన్‌కుమార్, ములుగు డీఈవో కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ టి.దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కార్యాలయంలో 20న జాబ్ మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 16: ములుగురోడ్‌లోని ప్రభుత్వ బాలుర ఐటీఐలోని వరంగల్ జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఈ నెల 20న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఉపాధి కల్పనాధికారి సీహెచ్. ఉమారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్‌లోని రిలయన్స్ నిప్పోన్ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ కంపెనీ లిమిటెడ్‌లో లైఫ్ ప్లానింగ్ ఆఫీసర్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు జరుగుతాయని ఆమె తెలిపారు. 35 నుంచి 40 ఏళ్ల పట్టభద్రులైన వివాహితులు మాత్రమే జాబ్‌మేళాలో పాల్గొనాలని ఆమె సూచించారు. ఎంపికైన అభ్యర్థులు రూ.15వేల నుంచి రూ25వేల వరకు వేతనంతో పాటు అదనంగా పీఎఫ్, హెల్త్ ఇన్సూరెన్స్‌ను అందజేస్తారని తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు మంగళవారం ఉదయం 11 గంటలకు ములుగురోడ్‌లోని ఉపాధి కార్యాలయంలో హాజరుకావాలని కోరారు. పూర్తి వివరాలకు 9573885532 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని ఆమె కోరారు.

డైట్‌లో గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 16: హనుమకొండలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీ కోసం దరఖాస్తు చేసుకోవాల్సిందిగా డైట్ ప్రిన్సిపాల్ డి. వాసంతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉర్దూ మీడియంలో ఫిలాసఫీ, ఉర్దూ లాంగ్వేజ్, సైన్స్ పెడగాగికి ఒక్కో పోస్టు మొత్తం 3, తెలుగు/ఇంగ్లీష్ మీడియంలో సైన్స్ పెడగాగి ఒక్క పోస్టు ఉన్నట్లు ఆమె తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ నెల 21లోగా డైట్ కళాశాలలో దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ఆమె కోరారు.

పోలీసుల అదుపులో ఇద్దరు దళారులు

నర్సంపేట టౌన్, ఆగస్టు 16: నర్సంపేట పట్టణంలో నూతనంగా ఏర్పాటైన ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఉద్యోగాలిప్పిస్తామని అభ్యర్థుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న ఓ దళారి ముఠాలోని ఇద్దరిని స్థానిక పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నా రు. ఇటీవల ప్రభుత్వం కళాశాలలో ఔట్ సోర్సింగ్ విధానంలో 180 పోస్టుల భర్తీ కోసం నవోదయ ఏజెన్సీకి అప్పగించారు. పోస్టుల భర్తీలో అవకతవకలకు పాల్పడుతున్నారని అభ్యర్థులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో కలెక్టర్ పోస్టుల భర్తీని పారదర్శకంగా నిర్వహించడానికి చర్యలు తీసుకున్నారు. హన్మకొండ జిల్లా పరకాల, నర్సంపేట మండలంలోని ఆకులతండాకు చెందిన కొందరు దళారులు ముఠాగా ఏర్పడి ఉద్యోగాలిప్పిస్తామంటూ అభ్యర్థుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు. దాంతో అభ్యర్థులు విషయాన్ని పోలీసులకు చేరవేశారు. పోలీసులు వలపన్ని ఇద్దరు వ్యక్తులను పట్టుకోగా మరో మహిళ పరారీలో ఉన్నట్లు తెలిసింది. ఈ విషయంపై పోలీసులను అడుగగా అదుపులోకి తీసుకున్న విషయం వాస్తవమేనని, విచారణ చేస్తున్నామని తెలిపారు.

ఆహా.. ఏమి రుచి!

కూల్‌డ్రింక్స్ తాగుతున్న కోతులు


గుంజేడులో కూల్‌డ్రింక్స్ తాగుతున్న కోతులు

కొత్తగూడ (మహబూబాబాద్ జిల్లా), ఆగస్టు 16 : మనుషులేనా కూల్‌డ్రింక్స్ తాగేది.. మేము సేవిస్తాం!! అంటూ కోతులు సవాల్ విసురుతున్నాయి. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలోని గుంజేడు శ్రీముసలమ్మ జాతరకు శుక్రవారం భక్తులు వస్తూ అమ్మవారిని దర్శించుకున్న తర్వాత విందు చేసుకుంటున్నారు. అలా భక్తులు ఆదమరవగానే కోతులు వస్తువులు ఎత్తకెళ్తున్నాయి. జాతరలో కూల్‌డ్రిక్స్‌ను తీసుకెళ్లి తాగుతున్నాయి. కూల్‌డింక్స్ తాగుతున్న కోతులను భక్తులు ఆసక్తిగా చూస్తూ ఆశ్చర్యానికి గురవుతున్నారు.

పాపన్న జయంతిని నిర్వహించాలి

వడ్డెపల్లి, ఆగస్టు 16: సర్వాయిపాపన్న గౌడ్ జయంతిని ఈనెల 18న నిర్వహించాలని సర్దార్ సర్వాయిపాపన్న గౌడ్ రాష్ట్ర ఉత్సవ కమిటీ కన్వీనర్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే సర్దార్‌సర్వాయి పాపన్న గౌడ్ జయంతికి ఉమ్మడి జిల్లాలోని గౌడ, బీసీ, ఎస్సీ, ఎస్టీ నేతలు పెద్ద ఎత్తున తరలి వచ్చి జయప్రదం చేయాలని కోరారు.

ఫిర్యాదుదారులకు ప్రశాంతమైన వాతావరణం కల్పించాలి

ప్రజల భద్రతతో పాటు మన భద్రత ముఖ్యం : మల్టీజోన్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి


మాట్లాడుతున్న ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి

మహబూబాబాద్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : ఫిర్యాదుదారులు పోలీస్‌స్టేషన్‌కు వచ్చినప్పుడు వారికి ప్రశాంతతమైన వాతావరణం కల్పించాలని, ప్రజల భద్రతతో పాటు పోలీసుల భద్రత ముఖ్యమని మల్టిజోన్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఐజీకి ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్‌కేకన్ మొక్కను అందించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. జిల్లాలోని శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసుల పనితీరును, నిషేధిత మావోయిస్టు కదలికల పట్ల ప్రస్తుత స్థితిగతులను, జిల్లా శాంతిభద్రతల యొక్క స్థితిగతులను ఎస్పీను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లాలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పనిచేసే పోలీసులు, అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ వారి కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. మావోయిస్టు సరిహద్దు ప్రాంతాల్లో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా వారిని నివారించాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. నూతన చట్టాలపై అందరు అవగాహన కలిగి ఉండాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. కన్విక్షన్ రేట్‌ను పెంచాలన్నారు. గంజాయి, మత్తుపదార్థాల అక్రమ రవాణాను అరికట్టడంలో జిల్లా పోలీసులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని ప్రతీ పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. 5ఎస్ అమల్లో భాగంగా పోలీస్‌స్టేషన్‌లలోని రికార్డులను, ఫైల్‌ను క్రమపద్ధతిలో అమర్చు కోవాలని సూచించారు. పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని ప్రతీ ప్రాంతంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునే విధం గా చర్యలు చేపట్టాలన్నారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలకు నిత్యం అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తూ అప్రమత్తం చేయాలన్నారు. సమావేశంలో ఏఎస్పీ జోగుల చెన్నయ్య, డీఎస్పీ తిరుపతిరావు, ఏఆర్ డీఎస్పీలు శ్రీనివాస్, విజయ్‌ప్రతాప్, టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్, రూరల్ సీఐ సర్వయ్య ఆర్ఎస్సైలు, ఎస్సైలు పాల్గొన్నారు.

తాత కర్మకాండకు వెళ్లివస్తూ..

- బైక్ అదుపుతప్పి మనవడి మృతి
- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు
- నర్సింహులపేట మండలంలో ఘటన


మృతుడు కుర్ర శ్రీకాంత్


ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కుర్ర రాజశేఖర్, పద్మ

నర్సింహులపేట(మహబూబాబాద్ జిల్లా), ఆగస్టు 16 : తాత కర్మకాండకు వెళ్లి వస్తుండగా జరిగిన ప్రమాదంలో మనువడు మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్ర గాయాలైన ఘటన శుక్రవారం నర్సింహులపేట మండలం వంతడుపుల స్టేజీ వద్ద చోటు చేసుకుంది. ఎస్సై ఎం.సురేష్ తెలిపిన కథనం ప్రకారం. కురవి మండలం సూదనపల్లికి చెందిన కుర్ర వెంకటేశ్వర్లు, సైదమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు. ఆర్థికంగా బాగాలేకపోవడంతో వారు 12 ఏళ్లుగా తొర్రూరులో నివాసం ఉంటూ పండ్ల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వెంకటేశ్వర్లు తండ్రి కుర్ర వీరయ్య ఈనెల 12న సూదనపల్లిలో మృతి చెందాడు. శుక్రవారం తాత ఐదోరోజు కర్మకాండకు మనుమడు కుర్ర రాజశేఖర్, కుర్ర శ్రీకాంత్ (23), అత్త ఎనగందుల పద్మ హాజరై.. తొర్రూరుకు ద్విచక్రవాహనంపై తిరిగి వస్తున్నారు. వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై వంతడుపుల స్టేజీ వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించపోగా, అదుపుతప్పి ముళ్లపొద్దలోకి దూసుకెళ్లి పల్టీకొట్టింది. దీంతో బైక్‌పై ప్రయాణిస్తున్న ముగ్గురికి తీవ్రగాయాలు కాగా, 108 వాహనంలో స్థానికులు జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా శ్రీకాంత్ మృతి చెందాడు. అన్న రాజశేఖర్, అత్త పద్మకు తీవ్రగాయాలైన్ల తెలిపారు. మృతుడి పెద్దనాన్న సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ తెలిపారు. ఇప్పటికే తాత మృతితో బాధలో ఉన్న కుటుంబంలో మనుమడు శ్రీకాంత్ మృతి చెందడంతో సూదనపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి.


కలెక్టర్ ప్రావీణ్య నుంచి అవార్డును అందుకుంటున్న డాక్టర్ అడ్లూరు నర్సింహమూర్తి

భారత్ సేవా పురస్కార్ అందుకున్న అడ్లూరు

హనుమకొండ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ గణిత అవధాని, రిటైర్డ్ గణిత అధ్యాపకుడు డాక్టర్ అడ్లూరు నర్సింహమూర్తి శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య నుంచి ప్రతిష్ఠాత్మకమైన భారత సేవా పురస్కార్ అవార్డును అందుకున్నారు. నాలుగు దశాబ్దాలుగా గణిత రంగంలో చేసిన విశేషమైన సేవలకు గుర్తింపుగా బెంగుళూరుకు చెందిన వెయిల్ ఫౌండేషన్ ఇండియా డాక్టర్ అడ్లూరును భారత సేవా పురస్కారానికి ఎంపిక చేసింది. ఈ అవార్డు కింద వెయిల్ ఫౌండేషన్ ఇండియా పంపిన ట్రోఫీ, ప్రశంసాపత్రాన్ని కలెక్టర్ ప్రావీణ్య చేతుల మీదుగా డాక్టర్ నర్సింహమూర్తి స్వీకరించారు.

డైరెక్టర్ ఆఫ్ హెల్త్ ఉత్తర్వులు బేఖాతరు

లెక్క చేయని పైడిపల్లి మెడికల్ ఆఫీసర్, ఫార్మసిస్టు

వరంగల్ మెడికల్, ఆగస్టు 16: వైద్య, ఆరోగ్యశాఖలో ఇటీవల జరిగిన బదిలీలలో ఎంజీఎం ఆస్పత్రిలో పనిచేస్తున్న ఫార్మసిస్టు సుచరితకు పీహెచ్‌సీ పైడిపల్లికి పోస్టింగ్స్ ఇచ్చారు. ప్రభుత్వ జీవో నెంబర్ 80 ప్రకారం ఫోకల్ నుంచి ఫోకల్‌కు ఎవరికీ పోస్టింగ్ ఇవ్వరాదు. సుచరితకు జీవోకు విరుద్ధంగా పైడిపల్లికి ట్రాన్స్‌ఫర్ చేయగా, కొందరు ఫార్మసిస్టులు డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో సుచరితను వెంటనే పైడిపల్లి నుంచి మరిపెడ పీహెచ్‌సీకి ట్రాన్స్‌ఫర్ చేస్తూ జూలై 31న డైరెక్టర్ ఆఫ్ హెల్త్ ఉత్తర్వులు ఇచ్చినట్లు తెలిసింది. ఉత్తర్వుల ప్రకారం ఫార్మసిస్టును మరిపెడకు పంపించాలి కానీ డైరెక్టర్ ఉత్తర్వులను మెడికల్ ఆఫీసర్ సైతం లెక్కచేయకుండా ఇంకా పైడిపల్లిలోనే ఉంచారు. విషయం తెలుసుకున్న వరంగల్ డీఎంహెచ్‌వో కె.వెంకటరమణ.. ఫార్మసిస్టును మరిపెడకు పంపించాలని మెడికల్ ఆఫీసర్‌కు మెయిల్ ద్వారా సమాచారం ఇచ్చారు. అయినా కూడా ఫార్మసిస్టును విధుల్లో కొనసాగిస్తున్న మెడికల్ ఆఫీసర్‌పై విచారణ జరిపించి, క్రమ శిక్షణ చర్యలు తీసుకొని ఫార్మసిస్టు సుచరితను వెంటనే మరిపెడకు పంపించాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యం కోసం చదవాలి

కేయూ క్యాంపస్, ఆగస్టు 16: విద్యార్థులు ఉన్నత లక్ష్యం కోసం చదవాలని, దాన్ని సాధించుకోవాలని దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం అన్నారు. శుక్రవారం లైబ్రరీ సైన్స్ విభాగంలో ఎంఎల్ఐఎస్సీ రెగ్యులర్ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రామచంద్రం హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. లైబ్రరీ సైన్స్ విభాగంలో విస్తృత ఉపాధి, ఉద్యోగ అవకాశాలున్నాయని చెప్పారు. పోటీ ప్రపంచంలో విద్యార్థులు బాగా చదివి ఎదగాలని చెప్పారు. విద్యార్థుల ఉన్నత వృద్ధికి లైబ్రరీలు ఉపయోగపడుతాయని అన్నారు. తెలంగాణ వర్సిటీల లైబ్రరీ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ టి.సంపత్ మాట్లాడుతూ.. విద్యార్థులను గొప్ప వ్యక్తులుగా తీర్చిదిద్దేది గ్రంథాలయమేనని చెప్పారు. లైబ్రరీలో విద్యార్థి తనకు తాను దిశ నిర్దేశం చేసుకుంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కేయూ లైబ్రరీ సైన్స్ విభాగాధిపతి రాధిక, కుల్సా జనరల్ సెక్రటరీ బి.జగదీశ్, రేణుక, భాగ్యలక్ష్మి, భానుప్రసాద్, సాహితీ, ఇతర డిపార్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఆనంద్‌కు బల్దియా కమిషనర్ అభినందనలు



ఆనంద్‌కు సర్టిఫికెట్ ప్రదానం చేస్తున్న కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 16: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పీఆర్వో కార్యాలయంలో ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తూ శాఖాపరమైన విధులపై విశిష్ట సేవలందించినందుకు ఆనంద్‌కు ఉత్తమ ఉద్యోగిగా గుర్తించి ప్రశంసా పత్రాన్ని అందించారు. శుక్రవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో కమిషనర్ అశ్విని తానాజీ వాకడే చేతుల మీదుగా స్వీకరించారు.

గ్రామ పూజారులకు గుర్తింపు పత్రాలు జారీ చేయాలి

వడ్డేపల్లి, ఆగస్టు 16: గ్రామ పూజారులకు తహసీల్దార్ ద్వారా గుర్తింపు పత్రాలు జారీ చేయించాలని, ధూప, దీప, నైవేద్యానికి ప్రభుత్వం రూ.6వేల వేతనాలు ప్రకటించాలని జగదాంబ మేడారం భద్రకాళి పూజారుల సంఘం జాతీయ గౌరవ అధ్యక్షుడు కుడికాల అంజనేయులు, జాతీయ అధ్యక్షుడు తేజావత్ రాములు, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ చిత్రపు పుష్పలయ డిమాండ్ చేశారు. శుక్రవారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బ్రాహ్మణులతో సమానంగా ప్రభుత్వం తమను గౌరవించాలని, ప్రభుత్వమే స్థలం ఇచ్చి ఆలయాన్ని నిర్మించి ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో పూజారుల సంఘం రాష్ట్ర, జిల్లా నేతలు గుగులోత్ కిశోర్, వేల్పుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ టౌన్, ఆగస్టు16: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా శనివారం నగరంలోని పలు సబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. యాదవనగర్, వెస్ట్‌సిటీ, టీకులగూడెం, మడికొండ టెక్స్‌టైల్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో ఉదయం 9గంటల నుంచి 11 గంటల వరకు, బాలసముద్రం పరిధిలో ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు, గోపాల్‌పూర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు, నక్కలగుట్ట పరిధిలో ఉదయం 10 గంటల 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని డీఈ తెలిపారు.

ఎల్లాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో..

హసన్‌పర్తి, ఆగస్టు 16: ఎల్లాపూర్ సబ్‌స్టేషన్ పరిధి లోని ఎల్లాపూర్ టౌన్, సీతంపేట గ్రామాలకు శనివారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఎల్లాపూర్ సబ్‌స్టేషన్ ఇన్‌చార్జి అసిస్టెంట్ ఇంజనీర్ తరుణ్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ అంతరాయానికి విద్యుత్ వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని ఏఈ తరుణ్ తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

వేలేరు, ఆగస్టు 16: వేలేరు మండలంలోని గుండ్లసాగర్ గ్రామానికి చెందిన గాదె వినోద, మల్లికుదుర్ల గ్రామానికి చెందిన రాచకొండ నర్సయ్యలు ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. వీరికి వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా, గురువారం సంబంధిత చెక్కులను వేలేరు మాజీ ఎంపీపీ కేసిరెడ్డి సమ్మిరెడ్డి, మల్లికుదుర్ల మాజీ సర్పంచ్ గోదల రాజిరెడ్డిలు బాధితులకు చెక్కులను అందజేశారు. ఇందులో గాదె వినోద ఇటీవల మృతి చెందగా ఆమె భర్త శ్రీనివాస్‌రెడ్డి చెక్కును అందుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రవిందర్‌యాదవ్, కాంగ్రెస్ నాయకులు కుంట రవి, రంగు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం



మడికొండ చౌరస్తాలో కేటీఆర్ దిష్టి బొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

వడ్డేపల్లి, ఆగస్టు 16: మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ దిష్టిబొమ్మను గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ గోపాల్‌పూర్‌లో వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, స్థానిక కార్పొరేటర్ సిరంగి సునిల్‌కుమార్ ఆదేశం మేరకు టీపీసీసీ లీగల్ సెల్ కన్వీనర్ కందుకూరి రజినీకాంత్ ఆధ్వర్యంలో శుక్రవారం దహనం చేశారు. ఈ సందర్భంగా రజినీకాంత్ మాట్లాడుతూ.. మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్సహించి మహిళా సాధికారతకు కృషి చేయాల్సిన కేటీఆర్ వారిని అవమానపర్చడం దుర్మార్గమని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సెక్రెటరీ కందుకూరి పూర్ణచందర్, ఓబీసీ జిల్లా కో ఆర్డినేటర్ బొమ్మ చంద్రమౌళిగౌడ్, కాంగ్రెస్ శ్రేణులు బీరం రవీందర్‌రెడ్డి, కందుకూరి మహేందర్, గిన్నారపు రాజు, ఇమ్మడి అశోక్‌బాబు, కందుకూరి ప్రవీణ్, పవన్‌తో పాటు మహిళలు పాల్గొన్నారు.

● హసన్‌పర్తి: వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆదేశాల మేరకు శుక్రవారం హసన్‌పర్తి బస్టాండులో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణంపై కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హసన్‌పర్తి బస్టాండులో ధర్నా, రాస్తారోకో నిర్వహించి నిరసన తెలిపారు. మహిళా లోకానికి కేటీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యకమంలో కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు జోరుక పూల, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తంగెళ్లపల్లి తిరుపతి, డివిజన్ అధ్యక్షుడు కనపర్తి కిరణ్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వీసం సురేందర్‌రెడ్డి, మహిళా మండల ఉపాధ్యక్షురాలు బత్తుల స్వాతి, నాయకులు ప్రభాకర్, నర్సింహరాములు, రామరాజు, ఆనంద్, పుల్ల రవీందర్, బిగుళ్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

● మడికొండ: మహిళలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ కేసిన అనుచిత వ్యాఖ్యల పై కాంగ్రెస్ శ్రేణులు మండిపడ్డారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు ఆదేశాల మేరకు స్థానిక కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మడికొండ చౌరస్తాలో కేటీఆర్ దిష్టి బొమ్మ దహనం చేసి, నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాజీపేట మండల పార్టీ అధ్యక్షుడు సారంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, వస్కుల నాగమణి శంకర్, పార్టీ 46వ డివిజన్ అధ్యక్షుడు వస్కుల నాగరాజు, బైరి వరలక్ష్మి లింగమూర్తి, మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘుచందర్, బిల్ల రవిందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రం జ్యోతీ అమర్‌నాథ్, వస్కుల శ్రీను, బైరి రజినివేణు, ఉబ్బని రమారసజ్జ, వస్కుల భిక్షపతి, శివ, నాగరాజ్, శ్రీనివాస్, రాజు, శ్రీధర్, వేణు, భాను తదితరులు పాలొన్నారు.

రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలి

వరంగల్ కలెక్టర్ సత్యశారదా దేవి

ఎంజీఎం, కేఎంసీ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రుల ఆకస్మిక తనిఖీ



ఎంజీఎంలో పర్యటిస్తున్న కలెక్టర్ డాక్టర్ సత్యశారద

వరంగల్ మెడికల్, ఆగస్టు 16: ఎంజీఎం ఆస్పత్రిలోని రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని వైద్యాధికారులను వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద ఆదేశించారు. శుక్రవారం ఎంజీఎంతోపాటు కాకతీయ మెడికల్ కళాశాల ప్రాంగణంలోని పీఎంఎస్ఎస్‌వై ఆస్పత్రిని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో అన్ని విభాగాలను కలెక్టర్ కలియతిరిగి ఓపీ సేవలు, ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌లను పరిశీలించారు. ఓపీలో అందుతున్న సేవలను పరిశీలించి, అక్కడ అందిస్తున్న వైద్య సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. ఫార్మసీలో ఔషధాల పంపిణీ రికార్డులను తనిఖీ చేసిన కలెక్టర్.. ప్రతీ ఔషధం ఈ ఔషధీ ప్రకారం ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో కుక్కకాటుకు నర్సు తీసుకెళుతున్న యాంటీ రాబిస్ మందుల గడువు తేదీలను పరిశీలించారు.

అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం వైరల్ జ్వరాలతో రోగులు ఆస్పత్రుల్లో చేరుతున్నారని, డెంగీ, మలేరియా లాంటి ప్రమాదకర జ్వరాల బారిన పడిన రోగులను నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రత్యేక వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. బ్లడ్ బ్యాంకులో ఎంత మేరకు రక్తం అందుబాటులో ఉందో.. రక్త పరీక్షలు జరుగుతున్నాయో చూడాలన్నారు. ఏ ప్రాంతాల నుంచి ఎన్ని కేసులు వస్తున్నాయో గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. కార్డియాలజీ, న్యూరాలజీ, డయాలసిస్ అందించడానికి 14 బెడ్‌లను ఏర్పాటు చేసే విభాగం తుది దశలో ఉందని, పూర్తి చేసి అందుబాటులోకి తేవాలన్నారు. గుండె సంబంధిత వ్యాధులకు వెంటనే మందులు తెప్పించే ఏర్పాట్లు చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ చిలుక మురళి, ఆర్ఎంవోలు మురళి, రోషన్ తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

మడికొండ, ఆగస్టు 16: అప్పులబాధతో కౌలు రౌతు ఆత్మహత్యకు ప్రయత్నించి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మడికొండ ఎస్సై రాజబాబు తెలిపిన వివరాల మేరకు.. కాజీపేట సోమిడికి చెందిన కౌలు రైతు కాయితపు రాంచందర్(38) మడికొండ రెవెన్యూ శివారులో పొలం కౌలుకు చేస్తున్నాడు. అలాగే చిన్న గేదెల ఫామ్ నడిపిస్తున్నాడు. వీటి నిర్వహణ కోసం కొన్ని అప్పులు చేశాడు. డైరీ ఫారం నిర్వహణలో నష్టాలు రావడంతో అప్పులు తీర్చే మార్గం లేక గురువారం పొలం వద్ద గడ్డిమందు తాగాడు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. మృతుడికి భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. తండ్రి ఐలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఘనంగా వరలక్ష్మీ వ్రతం



హసన్‌పర్తిలో వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలు

హసన్‌పర్తి, ఆగస్టు 16: మండల కేంద్రంలోని పాత మార్కెట్ రాజరాజేశ్వరస్వామి దేవాలయ ఆవరణలో శుక్రవారం వరలక్ష్మీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళలు సంప్రదాయ దుస్తులతో ఆలయానికి చేరుకొని వరలక్ష్మీ వ్రతాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కందుకూరి చంద్రమోహన్, కమిటీ ప్రతినిధులు సంద్రు నిరోశ, రాధిక, విజయ, వనజ, లతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● మడికొండ: పవిత్ర శ్రావణ మాసోత్సవాలలో భాగంగా మడికొండలోని మెట్టుగుట్టపై సీతారామచంద్రస్వామి ఆలయంలో వరలక్ష్మీ అమ్మ వారికి అత్యంత ప్రీతిపాత్రమైన శ్రావణ శుక్రవారం రోజున అర్చకులు పరాశరం విష్ణువర్ధనాచార్యులు ఘనంగా వరలక్ష్మీ వ్రతం, కుంకుమార్చన నిర్వహించారు. 64వ డివిజన్ కార్పొరేటర్ ఆవాల రాధికారెడ్డి, భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే మెట్టురామలిగేశ్వరస్వామి వారికి ప్రాతఃకాల రుద్రాభిషేకం జరిపి భక్తులకు దర్శనం కలిగించారు. ఈవో శేషుభారతి, చైర్మన్ పైడిపాల రఘుచందర్ ఆధ్వర్యంలో జరిగిన పూజలలో అర్చకులు అభిలాష్‌శర్మ, పారుపెల్లి సత్యనారాయణ శర్మ, ధర్మకర్తలు రాజు, శ్రీనివాస్, దయాకర్, ఉమ, జ్ఞానేశ్వరి, కేదారి, ఆలయ సిబ్బంది భాస్కర్, రణధీర్, అనిల్, కుమార్, సురేష్, రాజమణి, వెంకటలక్ష్మి, భక్తులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న ఈఫిల్ టవర్



ఈఫిల్ టవర్‌ను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

బాలసముద్రం, ఆగస్టు 16: స్మార్ట్‌సిటీ అభివృద్ధి పనుల్లో భాగంగా బాలసముద్రం జంక్షన్‌లో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఈఫిల్ టవర్ నగరవాసులను ఆకట్టుకుంటోంది. టవర్ పనులు కొనసాగుతుండగానే అటు వైపుగా ప్రయాణించే నగర వాసులు ఆసక్తిగా తిలకిస్తున్నారు. వేగంగా ఏర్పాటు పనులు జరుగుతున్నాయని త్వరలోనే పూర్తి స్థాయిలో నగరవాసులను టవర్ కనువిందు చేసే విధంగా అందుబాటులోకి తెస్తామని అధికారులు తెలిపారు.

మెడికో హత్య నిందితుడిని కఠినంగా శిక్షించాలి



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేస్తున్న ఏబీఎస్ఎఫ్, స్వేరోస్ నేతలు

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 16: కోల్‌కత్తా మెడికల్ పీజీ విద్యార్థినిని హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్, స్వేరోస్ జిల్లా అధ్యక్షుడు శనిగరపు రాజేంద్ర ప్రసాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం హనుమకొండలోని అంబేద్కర్ సెంటర్‌లోని విగ్రహం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చక్రి, సునిల్, మహేందర్, వినయ్, రాజేష్, పృథ్వి, రాజు, శేఖర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థిని హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి

వరంగల్ కార్పొరేషన్: కోల్‌కత్తాలో వైద్య విద్యార్థిపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను వెంటనే శిక్షించాలని సీఐటీయూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాగుల రమేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం హనుమకొండ రాంనగర్‌లోని జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. విద్యార్థిపై సామూహిక అత్యాచారం చేసి హత్యచేసినట్టు ఆధారాలు, సాక్ష్యాలు లభించినా ప్రభుత్వం ఇప్పటివరకు నిందితులను అదుపులోకి తీసుకోకపోవడం దుర్మార్గం అని మండిపడ్డారు. దేశవ్యాప్తంగా మహిళా డాక్టర్లకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కోల్‌కత్తాలో జరిగిన ఘటనలు పునరావృత్తం కాకుండా దేశలో ప్రత్యేక చట్టం తీసుకురావాలని రమేష్ డిమాండ్ చేశారు.

22 నుంచి సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు

సీపీఐ రాష్ట్ర నేత తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర నేత

బాలసముద్రం, ఆగస్టు 16: హనుమకొండ నక్కలగుట్టలోని హరితకాకతీయ హోటల్‌లో ఈనెల 22 నుంచి 24 వరకు సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఈ సమావేశాలకు సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ డి.రాజా, జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ, మాజీ ఎంపీ అజీజ్‌పాషా హాజరుకానున్నట్లు శ్రీనివాసరావు తెలిపారు. ఈ సమావేశాలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై రాజకీయ పరిస్థితులు, స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, మాజీ ఎమ్మెల్యే సి.హెచ్. రాజారెడ్డి, మాజీ ఎమ్మెల్యే పోతరాజు సారయ్య, జ్యోతి, రమేష్, శ్రీనివాస్, సంతోష్, రవి, రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సంస్థాగత నియామకాలు

హనుమకొండ టౌన్, ఆగస్టు 16: బీజేపీ సంస్థాగత నియామకాల్లో భాగంగా పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్న వ్యక్తులకు వివిధ పదవులను కట్టబెట్టినట్లు బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షుడిగా దాస్యం అభినవ్‌భాస్కర్, నర్మెట్ట శ్రీనివాస్, ఆకుల శ్రీకాంత్, కార్యదర్శులుగా మార్త రాజభద్రయ్య, సీహెచ్. ప్రభాకర్‌రెడ్డి, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మాలోతు తిరుపతి, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా సంద్ర మధు, జిల్లా అధికార ప్రతినిధులుగా కొండెం రవీందర్‌రెడ్డి, శనిగరం విజయ్, 49వ డివిజన్ అధ్యక్షుడిగా సిరిపురం పవన్ నియమించినట్లు పేర్కొన్నారు.

కేయూ సైన్స్ విభాగాల డీన్‌గా హన్మంతు

కేయూ క్యాంపస్, ఆగస్టు 16: కాకతీయ యూనివర్సిటీ సైన్స్ విభాగాల నూతన డీన్‌గా కెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ గుగులోత్ హన్మంతు నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా హన్మంతును క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ బి.సురేశ్‌లాల్, కంప్యూటర్‌సైన్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ రమేశ్, గిరిజన సంఘాల నేతలు కలిసి పుష్పగుచ్ఛం అందచేసి అభినందనలు తెలిపారు.

బాలుడిని చేరదీసిన ఆర్టీసీ సిబ్బంది

బాలసముద్రం, ఆగస్టు 16: హాస్టల్ నుంచి తప్పించుకొని వచ్చి హనుమకొండ బస్టాండ్‌లో శుక్రవారం ఒంటరిగా ఏడుస్తూ ఉన్న బాలుడిని ఆర్టీసీ సిబ్బంది చేరదీసి బంధువులకు అప్పగించారు. బాలుడి వివరాలను ఆరా తీయగా హైదరాబాద్ అని చెప్పడంతో కంట్రోలర్ బషీర్ అక్కడి వారితో మాట్లాడి వరంగల్‌లో ఉన్న బాలుడి మేనమామను బస్టాండ్‌కు పిలిపించి అప్పగించారు.

క్యాంటీన్ మరమతు పనుల్లో వేగం పెంచండి

మేయర్ గుండు సుధారాణి



క్యాంటీన్ పనులు పరిశీలిస్తున్న మేయర్, అధికారులు

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 16: బల్దియా ప్రధాన కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన క్యాంటీన్ మరమతు పనుల్లో వేగం పెంచాలని మేయర్ గుండు సుధారాణి అధికారులకు సూచించారు. బల్దియా కార్యాలయంలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ మరమతు పనులను సిబ్బందితో కలిసి శుక్రవారం పరిశీలించారు. క్యాంటన్ ఇన్నర్ వర్క్‌లో భాగంగా ఫ్లోరింగ్, లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. గోడలపై క్యాంటీన్ ప్రత్యేకతను తెలిపే చిత్రాలను అతికించాలన్నారు. అంతేకాకుండా చుట్టుపక్కల సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేయాలన్నారు. క్యాంటీన్ పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా సిబ్బంది చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, టీపీఆర్‌వో కోల రాజేశ్‌కుమార్, ట్యాక్సీల విభాగం అధికారి బిర్రు శ్రీనివాస్, టీఎంసీ రమేష్, ఇంచార్జీ పీఆర్‌వో అయూబ్, ఏఈలు, బల్దియా సిబ్బంది పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలి

హసన్‌పర్తి, ఆగస్టు 16: హసన్‌పర్తి పోలీసుస్టేషన్ పరిధిలోని గ్రామాలలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు పూర్తి సహాయసహకారాలు అందించాలని ఇన్‌స్పెక్టర్ చేరాలు సూచించారు. హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన చేరాలను శుక్రవారం పలువురు కాంట్రాక్టర్లు, రాజకీయ నాయకులు, కుల సంఘాల ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనను కలిసిన వారిలో కాంట్రాక్టర్లు వీసం రవీందర్‌రెడ్డి, పాడి మల్లారెడ్డి, పెసరు శ్రీనివాస్‌రెడ్డి, నేదునూరి కుమారస్వామి, పీఏసీఎస్ వైస్ చైర్మెన్ పాడి మల్లారెడ్డి, కురుమ సంఘం ప్రతినిధులున్నారు.

రేపు నగరంలో 4కే రన్ : సీపీ

వరంగల్ క్రైం, ఆగస్టు 16: మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ఈనెల 18న నగరంలో 4కే రన్ నిర్వహిస్తున్నట్లు వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ తరువాత అతి పెద్ద నగరమైన వరంగల్ నగరంలో పారిశ్రామిక అభివృద్ధితోపాటు వివిధ వ్యాపారాల ఏర్పాటు, ట్రైసిటీ పరిధిలో విద్య, వైద్యం ఉపాధి అవకాశాల కోసం యువత సొంత గ్రామాలను వదిలి వరంగల్‌కు చేరుకుంటోందని తెలిపారు. కొందరు విద్యార్థులు మత్తుకు బానిసలుగా మారుతున్నట్లు తెలిపారు. మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ఈనెల 18న వరంగల్ పోలీసు కమిషనరేట్ పోలీసుల ఆధ్వర్యంలో పోలీసు పరేడ్‌గ్రౌండ్‌లో ఉదయం 7గంటలకు 4కే రన్ నిర్వహిస్తున్నామని, ఇందులో గెలిచిన ముగ్గురికి రూ.5వేలు, 3వేలు, 2వేల నగదు బహుమతులు అందించనున్నట్లు సీపీ అంబర్‌కిషోర్‌ఝా ప్రకటనలో తెలిపారు.

పెండింగ్ ఫైళ్లు లేకుండా సత్వర చర్యలు తీసుకోవాలి



రికార్డులను పరిశీలిస్తున్న ఆర్‌డీఓ వెంకటేష్

హసన్‌పర్తి, ఆగస్టు 16: మండల రెవెన్యూ పరిధిలో పెండింగ్ ఫైళ్లు లేకుండా సత్వర చర్యలు తీసుకోవాలని ఆర్డీవో అధికారులను ఆదేశించారు. ఆర్డీవో వెంకటేష్ శ్రుకవారం హసన్‌పర్తి తహసీల్దారు కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెండింగ్ ఫైళ్ల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తు చేసుకున్న బాధితుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా పాలనలో ఆరు గ్యారెంటీ స్కీముల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలలో లోపాలను ఆన్‌లైన్‌లో సవరించి అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు అయ్యేలా సత్వర చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజాపాలన దరఖాస్తులను భద్రపరచడమే కాకుండా రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో వెంకటేష్ వెంట డిప్యూటీ తహసీల్దార్ ఎం.డి.రహీమ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ఫాజిల్, రాజేంద్రప్రసాద్, ధరణి రికార్డు సీనియర్ అసిస్టెంట్ రజనీకాంత్, ధరణి ఆపరేటర్ ప్రవీణ్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

మోదీ.. ఓ రాఖీ!



ఆర్ఎస్ఎస్ ప్రచారక్.. పాకిస్తానీ మహిళ. ముప్ఫయ్యేళ్ళ క్రితం వారి మధ్య చిగురించిన సోదర సోదరీ బంధం ఆయన ముఖ్యమంత్రి, ఆ తరువాత ప్రధానమంత్రి అయ్యాక కూడా కొనసాగుతోంది. ఈ ఏడాది మరోసారి నరేంద్రమోదీకి కట్టడానికి ఖమర్ మెహ్సిన్ షేక్ రాఖీని సిద్ధం చేశారు. ఆప్యాయతానురాగాలకు దేశాలు, వాటి మధ్య ద్వేషాలు అవరోధాలు కావని వారి అనుబంధం రుజువుచేస్తోంది.

"శ్రావణ పౌర్ణమి వస్తోందంటే నాలో ఉత్సాహం, ఉద్వేగం కలుగుతాయి. ఈ ఏడాది నా సోదరుడి కోసం ఎలాంటి రాఖీ తయారు చెయ్యాలి?... మనసంతా అదే ఆలోచన. ఎందుకంటే సామాన్యుడిగా నాకు పరిచయమైన సోదరుడు... ఇప్పుడు ఎంతో ఎత్తు ఎదిగిపోయారు. కానీ ఆయనలోని ఆప్యాయత అలాగే ఉంది" అంటారు ఖమర్ మెహ్సిన్ షేక్. ఆమెది పాకిస్తాన్‌లోని కరాచీ నగరానికి చెందిన ముస్లిం కుటుంబం. అక్కడే పుట్టి పెరిగారు. 1981లో.. మెహ్సిన్ షేక్‌తో ఆమెకు వివాహమయింది. ఆ దంపతులు భారతదేశానికి వలస వచ్చారు. కొన్నాళ్ళు ఢిల్లీలో ఉన్నారు. తరువాత గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో స్థిరపడ్డారు. "అది 1991. అప్పటి గుజరాత్ గవర్నర్ డాక్టర్ స్వరూప్ సింగ్‌తో మాకు పరిచయం ఉంది. ఒకసారి ఎయిర్‌పోర్టులో మా దంపతులకు ఆయన ఎదురుపడ్డారు. మమ్మల్ని చూడగానే సాదరంగా పలకరిస్తూ... అక్కడ ఉన్న ఒక వ్యక్తిని మాకు పరిచయం చేశారు. నన్ను ఉద్దేశించి... "ఈమె నాకు కుమార్తె లాంటిది" అని చెప్పారు. అప్పుడు ఆ వ్యక్తి "అయితే ఈమె నాకు సోదరి. ఎలా ఉన్నారు సోదరీ?" అని నన్ను పలకరించారు. అలా ఆయన నాకు దేవుడిచ్చిన సోదరుడయ్యారు. ఆ తరువాత వచ్చిన రక్షాబంధన్ పర్వదినాన ఆయనకు తొలిసారిగా రాఖీ కట్టాను. ఆయనే మన ప్రస్తుత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ. అప్పట్లో ఆయన ఆర్ఎస్ఎస్ ప్రచారక్‌గా ఉండేవారు" అని గుర్తు చేసుకున్నారు ఖమర్.

ఆ మాట విని మోదీ నవ్వారు, కానీ...

ఆ తరువాత ప్రతి సంవత్సరం మోదీ ఎక్కడున్నా రాఖీ పండగ రోజున తప్పకుండా కలుసుకోవడం, రాఖీ కట్టడం ఆమెకు ఆనవాయితీ అయిపోయింది. అలాంటి ఒక సందర్భంలో "ఏదో ఒక రోజు మీరు గుజరాత్ ముఖ్యమంత్రి కావాలని నేను ఆ భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను" అని



మోదీతో అన్నారు ఖమర్. ఆ మాట విని మోదీ నవ్వారు. కొన్నేళ్ళ తరువాత ఆమె ప్రార్థన ఫలించింది. "ఆ తరువాత ఆయనను కలుసుకున్నప్పుడు... "ఈసారి నీ సోదరుడి కోసం ఏం కోరుకుంటున్నావు?" అని అడిగారు. "దేశానికి ప్రధానమంత్రి కావాలని పార్థిస్తున్నాను" అని చెప్పాను. నేను ఎంతో అదృష్టవంతురాలిని. ఆ కోరిక కూడా తీరింది. ఇప్పుడు మూడోసారి మోదీ ప్రధాని అయ్యారు. అయినా ఆయన వైఖరిలో ఎలాంటి మార్పూ లేదు. ఆయనలో గొప్ప నాయకత్వ లక్షణాలున్నాయనేది మొదటి నుంచీ నా విశ్వాసం. అది పదేపదే రుజువు అవుతూనే ఉంది" అని చెప్పారామె. "కొవిడ్ కారణంగా... 2020, 2021, 2022 సంవత్సరాల్లో మోదీకి వ్యక్తిగతంగా రాఖీలు కట్టడం కుదరలేదు. పోస్టులో పంపించాను. అవి అందినట్టు సమాచారం వచ్చింది. కిందటి ఏడాది స్వయంగా ఢిల్లీ వెళ్ళి, రాఖీ కట్టాను. నేను రాఖీలను మార్కెట్‌లో ఎప్పుడూ కొనలేదు. ప్రతి సంవత్సరం రాఖీ పౌర్ణమికి ముందు స్వయంగా తయారు చేస్తాను. ఈ ఏడాది కూడా ఇప్పటికే సుమారు పది రాఖీలు రూపొందించాను. వాటిలో నాకు బాగా నచ్చినదాన్ని నా సోదరుడు మోదీ చేతికి కడతాను" అన్నారు ఖమర్. "ఇది నేను ఆయనకు కట్టబోయే 30వ రాఖీ. కాబట్టి ఏదైనా ప్రత్యేకంగా చెయ్యాలనుకున్నాను. వెల్వెట్‌తో దాన్ని తయారు చేశాను. అలంకరణల కోసం ముత్యాలను, మెటల్ ఎంబ్రాయిడరీని, టిక్కీలను ఉపయోగించాను. ఈ సోమవారం రాఖీ పౌర్ణమి. ఒక రోజు ముందే నేను, నా భర్త ఢిల్లీ చేరుకోవడానికి టిక్కెట్లు బుక్ చేసుకున్నాం. ఈ ఏడాది వ్యవసాయం గురించి ఒక పుస్తకాన్ని కూడా ఆయనకు అందజేస్తాను. ఆయనకు పుస్తకపఠనం చాలా ఇష్టం" అంటున్న ఈ సోదరి... తన సోదరుడి కోసం ఇప్పుడు ఏం కోరుకుంటున్నారు? "ఆయన ఎల్లప్పుడూ ఆరోగ్యంగా ఉండాలి. దీర్ఘాయుష్షుతో జీవించాలి. పదేళ్ళపాటు ప్రజాసంక్షేమానికి ఆయన చేసిన సేవలు భవిష్యత్తులో మరింత గొప్పగా కొనసాగాలి అని రోజూ ప్రార్థిస్తున్నాను" అంటున్నారు ఖమర్.

బీరాకుల మహిమ!

ఒకప్పుడు మొక్కల మీద ఆధారపడి ఆహారాన్ని తీసుకునే భారతీయులకి సహజంగా ఆహార పీచు (డయటరీ ఫైబర్) చాలినంత అందేది. కానీ కొత్త రకాల వంటలు అందుబాటులోకి వచ్చిన తర్వాత పీచు తగ్గిపోయింది. ఈ పీచు తగినంత పొందటానికి బీరాకులు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి.

సొరకాయ మన శరీరానికి చలువ చేస్తుంది. కానీ దానిలో చింతపండు, ఇతర మసాలాలు వేస్తే దాని గుణం మారిపోతుంది. శరీరానికి వేడి చేస్తుంది. ఒకప్పుడు మన పూర్వీకులు తినే ఆహారం ఈ విధంగా ఉండేది కాదు. కూరలతో పాటుగా లేత ఆకులను కూడా ప్రత్యేకమైన పద్ధతిలో వండుకొనేవారు. ఈ వండే విధానాన్ని తెలుసుకుందాం.



బీరాకుల పచ్చడి

లేత బీరాకులను మజ్జిగలో ఉడకపెట్టాలి. దానిని ఇంగువ నూనెలో మగ్గబెట్టాలి. ఆ తర్వాత తాలింపును, మగ్గపెట్టిన ఆకులను మిక్సీలో వేసి తిప్పితే బీరాకుల పచ్చడి తయారవుతుంది.

బీరాకుల కూర...


- బీర తీగ కొసకు ఉండే లేత ఆకులను ఎంచుకొని కోసుకోవాలి. వాటిని నీటితో శుభ్రపరచాలి.
- ఇలా శుభ్రపరిచిన ఆకులను చేతితోనే చిన్న చిన్న ముక్కలుగా చేసి- మజ్జిగలో నానబెట్టాలి.
- ఇలా నానబెట్టిన మిశ్రమంలో- అల్లం, ధనియాల పొడి, సైంధవ లవణం కలపాలి. దానిని పొయ్యి మీద పెట్టి ఆకులు మెత్తపడేదాకా ఉడికించాలి.
- మజ్జిగను వడగట్టి- ఆకులను బయటకు తీసుకురావాలి. వాటిని ఒక మూకుడులో నూనెలో వేసి వేయించాలి. ఆ తర్వాత తాలింపు పెట్టాలి.
- కొందరు ఈ కూరలో ఉడికించిన మినపప్పు లేదా శనగపప్పు లేదా వేయించిన మినప వడియాలు కలుపుతారు.

క్షేమశర్మ- ఈ కూరను 'తనుపుష్టిదాయికా' (శరీరానికి అమితమైన పుష్టినిచ్చేది)గా పేర్కొన్నాడు. ఇక వైద్య శాస్త్ర ప్రకారం చూస్తే- బీర ఆకులు- శరీరంలోని నీటి శాతాన్ని తొలగిస్తాయి. ఎసిడిటీని తొలగించి జీర్ణశక్తిని పెంచుతాయి. కాలేయానికి సంబంధించిన వ్యాధుల నివారణలో ఉపకరిస్తాయి. శరీరంలో విషదోషాలను కూడా తొలగిస్తాయి.

- అయితే ప్రస్తుతం మనకు బీర ఆకులు అందుబాటులో ఉండటం లేదు. పొలాలలో బీర పాదులు ఉన్నవారికి కూడా లేత ఆకుల విశిష్టత తెలియదు. ఈ లేత ఆకుల కూర ప్రచారంలోకి వస్తే చాలా మందికి అనేక రకాల వ్యాధులు తగ్గిపోతాయి.

• గంగరాజు అరుణాదేవి

తల్లులు ? నేర్పుతున్న పాఠం!



పిల్లలకు తల్లులకు మధ్య అనుబంధం ఏర్పడటానికి చనుబాలు ఒక కారణమంటారు మానసిక శాస్త్రవేత్తలు. తల్లి పాలు త్రాగటం వల్ల పిల్లలకు పోషకాలు అందటమే కాకుండా- పిల్లలు తమ తల్లులకు దగ్గర అయ్యే అవకాశముందంటారు. అయితే ఇది కేవలం మనుషులకు మాత్రమే కాదు- జంతువుల విషయంలో కూడా నిజమని డబ్లిన్ జూ అధికారులు పేర్కొంటున్నారు. ఈ జూలో 'ముజుర్' అనే 19 అరుదైన ఓరంగూటన్ (ఒక రకం కోతి) ఉంది. మనుషులకు అతి దగ్గర పోలికలు ఉన్న జంతువుల్లో ఓరంగూటన్‌ను ప్రధానంగా పేర్కొంటారు. ముజుర్‌కు ఇంతకు ముందు రెండు సార్లు పిల్లలు పుట్టాయి. కానీ వాటితో ముజుర్‌కు సరైన సంబంధాలు ఏర్పడలేదు. దీనికి కారణం ముజుర్‌కు పాలు ఇవ్వటం సరిగ్గా రాకపోవటమనేది ఒక కారణంగా జూ అధికారులు భావించారు. జూలై చివరి వారంలో మళ్లీ ముజుర్‌కు ఒక పిల్ల పుట్టింది. ఆ పిల్లను ముజుర్ ప్రేమగా చూసుకుంటోంది. కానీ పాలు ఇవ్వటం మాత్రం రావటం లేదు. దీనితో ముజుర్‌కు పాలు ఇవ్వటం ఎలాగో నేర్పటానికి 30 మంది తల్లులతో ఒక టీమ్‌ను ఏర్పాటు చేశారు. వీరు ముజుర్ ఉన్న ఎన్‌క్లోజర్ ముందు కూర్చుని తమ పిల్లలకు పాలు ఇస్తూ ఉంటారు. వీరిని చూసి ముజుర్ తన పిల్లకు పాలు ఇవ్వటం నేర్చుకుంటుందని జూ అధికారులు భావిస్తున్నారు. "వీరిని చూడటానికి ముజుర్ చాలా ఆసక్తి చూపిస్తోంది. కొన్ని సార్లు వారిని అనుకరించటానికి ప్రయత్నిస్తోంది. ఒక విధంగా మా ప్రయత్నాలు విజయవంతమయినట్లే" అని జూ అధికారులు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో తల్లులు కూడా చాలా ఉత్సాహంగా పాల్గొంటున్నారు. "నా పిల్లలకు చెప్పటానికి ఇది ఒక ఆసక్తికరమైన కథగా నాకు అనిపించింది. ఒక తల్లి మరొక తల్లికి ఇలాంటి సాయం చేయగలదని నాకు ఇప్పటి దాకా తెలియదు" అంటున్నారు నోరా మర్ఫి అనే ఒక తల్లి. జూ చేస్తున్న ఈ వినూత్న ప్రయోగం విజయవంతం కావాలని కోరుకుందాం.

వంటిల్లు

ఒకో ప్రాంతంలో ఒకో వంటకం బాగా ప్రసిద్ధి చెందుతుంది. దానికి ముందో.. వెనకో.. ఆ ప్రాంతం పేరు కూడా చేరుతుంది. ఎన్నేళ్లు అయినా ఆ వంట ఆ పేరుతోనే ప్రసిద్ధి చెందుతుంది. అలాంటి కొన్ని వంటలను మీకు పరిచయం చేస్తున్నాం...

రుచిలో వారసత్వం

బచ్కా

మన ఆహారంలో తృణ ధాన్యాలకు ప్రాధాన్యత చాలా ఉంది. అందుకే ఉత్తర భారత దేశంలో పచ్చి బఠానీలతో ఎక్కువ వంటలు చేస్తూ ఉంటారు. అలాంటి ఒక వంటకం బీహార్‌కు చెందిన బచ్కా. దీనిని సాయంత్రం ఒక చిరుతిండిగా మాత్రమే కాకుండా- కొన్ని సార్లు మధ్యాహ్నం భోజనంలో కూడా తింటారు.

కావాల్సిన పదార్థాలు

బియ్యపు పిండి- అరకేజీ, పచ్చి బఠానీలు- పావు కిలో, మిరియాల పొడి- ఒక టేబుల్ స్పూన్, జీలకర్ర పొడి- రెండు టేబుల్ స్పూన్‌లు, ఉప్పు- తగినంత, ఆవ నూనె- తగినంత

తయారీ విధానం



1) బియ్యపు పిండిని ఒక గిన్నెలోకి తీసుకోవాలి. దానిలో మిరియాల పొడి, జీలకర్ర, ఉప్పు వేసి ముద్దగా చేయాలి.

2) ఆ ముద్దలో పచ్చి బఠానీలను కలపాలి. ఈ మిశ్రమాన్ని 30 నిమిషాల పాటు నానబెట్టాలి.

3) ఒక మూకుడులో నూనెను తీసుకొని వేడి చేయాలి. మిశ్రమాన్ని చిన్న చిన్న ఉండలుగా చేసి.. వాటిని చేతితో వడల మాదిరిగా ఒత్తి.. నూనెలో వేయించుకోవాలి. బీహార్‌లో సాధారణంగా ఆవనూనెలో వేయిస్తారు. ఆవనూనె ఇష్టం లేని వారు మామూలు నూనెలో కూడా వేయించుకోవచ్చు.

4) దీనిని గ్రీన్ చట్నీతో కలిపి తింటే చాలా బావుంటుంది.

పంజాబీ చోలే

మనకు స్వాతంత్ర్యం రాకముందు అవిభాజ్య పంజాబ్‌లో చాలా ప్రసిద్ధి చెందిన వంటకమిది. పంజాబీ ప్రజలు చాలా కష్టపడి పనిచేస్తూ ఉంటారు కాబట్టి వారికి అవసరమైన పోషక విలువలన్నీ ఈ వంటకంలో మనకు కనిపిస్తాయి.

కావాల్సిన పదార్థాలు

కాబూలీ చెన్నా (పెద్ద తెల్ల శనగలు)- ఒక కప్పు, తినే సోడా - ఒక స్పూను, బే లీఫ్- ఒకటి, నల్ల ఏలక్కాయలు- రెండు, లవంగాలు- 2, సినమన్ - ఒక అంగుళం ముక్క, జీలకర్ర- ఒక టేబుల్ స్పూను, ధనియాలు- అర స్పూను, అల్లం- ఒక ఇంచు ముక్క తురుము, వెల్లుల్లి పాయలు - మూడు, ఎర్రకారం పొడి- ఒక స్పూను, పసుపు- అర స్పూను, ధనియాల పొడి- అర స్పూను, గరం మసాలా పౌడర్- ఒక స్పూను, ఆమ్‌చూర్ (ఎండపెట్టిన మామిడి పొడి)- ఒక స్పూను, నూనె- తగినంత, ఉప్పు- తగినంత, తరిగిన కొత్తిమీర- రెండు స్పూన్లు.. ఒక ఉల్లిపాయను.. మూడు టమోటాలను సన్నని ముక్కలుగా తరిగి సిద్ధంగా ఉంచుకోవాలి.

తయారీ విధానం

1) శనగలను కనీసం 8 గంటలు నాననియ్యాలి. తినే సోడా వేసి నానబెడితే ఇది నాలుగు గంటల తర్వాత ఉడకపెట్టుకోవచ్చు. నానిన శనగలను బాగా కడగాలి.

2) ప్రెషర్ కుక్కర్‌లో శనగలు, బే లీఫ్, నల్ల ఏలకులు, లవంగాలు, సినామిన్ ముక్క వేసి- శనగలు బాగా మునిగే దాకా నీళ్లు పోసి 10 విజిల్స్ వచ్చే దాకా ఉడకపెట్టాలి. కుక్కర్ మూత తెరుచుకొనే దాకా కంగారుపడకూడదు. ఆ తర్వాత కుక్కర్‌లో ఉన్న శనగలను, ఇతర సుగంధ దినుసులను వడబోసి బయటకు తీయాలి.

3) ఒక మూకుడులో నూనెను వేసి- జీలకర్ర, ధనియాలను వేసి బాగా వేయించాలి. ఆ తర్వాత ఉల్లిపాయ ముక్కలు వాసన పోయేదాకా వేయించాలి. ఆ తర్వాత అల్లం, వెల్లుల్లి వేసి వేయించాలి. దానిలో ఎర్ర కారం, పసుపు, ధనియాల పొడి, గరం మసాలా పౌడర్ వేసి వేయించాలి.

4) ఆ తర్వాత దీనిలో టమోటా ముక్కలను వేసి బాగా ఉడకపెట్టాలి. బాగా ఉడికిన తర్వాత ఈ మిశ్రమంలో ఆమ్‌చూర్ పొడిని వేయాలి. దీని వల్ల ఈ మిశ్రమానికి కొద్దిగా పులుపు వస్తుంది. ఆమ్‌చూర్ పొడి వేసిన తర్వాత తగినంత ఉప్పు వేసి బాగా కలపాలి. మూకుడును కిందకు దింపిన తర్వాత దానిపై తరిగిన కొత్తిమీరను వేయాలి.

5) ఈ కూర పూరీలలోకి.. చపాతీలలోకి చాలాబావుంటుంది.



మేకప్

వేడుకల్లో వెలుగులీనేలా

పగటి వేళ వేడుకులకూ, రాత్రివేళ వేడుకలకూ వేసుకునే మేకప్ భిన్నంగా ఉంటుంది. వెలుగుకు తగిన మేకప్ వేసుకున్నప్పుడే, ఆకర్షణీయంగా, సహజసిద్ధంగా కనిపిస్తాం. కాబట్టి నైట్‌పార్టీల కోసం ఇదుగో ఇలాంటి మేకప్ టిప్స్ పాటించండి.

లిప్ షేడ్: పగటి వేళ న్యూడ్ బీజ్ లాంటి రంగులతో మేకప్‌ను మ్యానేజ్ చేయవచ్చు. కానీ రాత్రి వేళ ముదురు ఎరుపు రంగు లిప్‌స్టిక్స్ ఆకర్షణీయంగా కనిపిస్తాయి.

ఐ షాడో: లైట్ల వెలుగులో తారలా వెలిగిపోవాలంటే ఐ షాడోకు కూడా మెరుపులు జోడించాలి. అందుకోసం గ్లిట్టర్ వాడుకోవాలి.

బేస్ ఫిక్స్: మేకప్ చెక్కుచెదరకుండా ఉండడం కోసం మేకప్ సెట్టింగ్ స్ప్రే వాడుకోవాలి. లేదంటే, ఫౌండేషన్ మీద కాంపాక్ట్ పౌడర్ అద్దుకోవాలి. అలాగే బేస్‌ను ఫిక్స్ చేయడం కోసం కొంత ఫౌండేషన్, బ్యూటీ బ్లెండర్ కలిపి వాడుకోవాలి.

ఐలైనర్: మేకప్ లుక్ అదిరిపోవాలంటే కనురెప్పలకు నియాన్ ఐలైనర్ అప్లై చేయాలి.

చెక్కిన లుక్: ముక్కూ, చుబుకం, కనుబొమలు స్పష్టంగా చెక్కినట్టు కనిపించడం కోసం బ్రాంజర్‌తో కాంటూర్ చేసుకోవాలి.



బ్లషర్: సాధారణంగా బ్లషర్ కొన్ని గంటలకే చెదిరిపోతూ ఉంటుంది. కాబట్టి చెక్కిళ్లకు కూడా బ్లషర్ అప్లై చేయడం మర్చిపోకూడదు.

ఐల్యాషెస్: ఫాల్స్ ఐల్యాషెస్ ఉపయోగించవచ్చు. ఇష్టం లేకపోతే డ్రమాటిక్ మస్కారా అప్లై చేయాలి.

హైలైటర్: ఈ బ్లెండింగ్ హైలైటర్‌ను చెక్కిళ్లు, బ్రో బోన్ మీద అద్దుకోవాలి.

ఫుడ్ ఫ్యాక్ట్స్

ఆహారం... కలకాలం!

ఆహారపదార్థాలు కొన్ని గంటల్లో లేదా కొన్ని రోజుల్లో పాడైపోతూ ఉంటాయి. కానీ కొన్ని పదార్థాలు కలకాలం పాడయిపోకుండా ఉంటాయని మీకు తెలుసా? అలాంటి వాటిని నిల్వ చేసుకుని, నిక్షేపంగా వాడుకోవచ్చు. అవి ఇవే!

తెల్ల బియ్యం: పాలిష్ పట్టిన లేదా పాలిష్ పట్టని బియ్యం సరైన పరిస్థితుల్లో నిల్వ చేస్తే దాదాపు 30 ఏళ్లపాటు చెక్కుచెదరకుండా ఉంటాయి. వాటిలోని పోషకాలు కూడా నిర్వీర్యమవకుండా ఉంటాయి. ఇందుకోసం ఆ బియ్యాన్ని గాలి చొరబడని డబ్బాల్లో, 40 డిగ్రీల ఫారిన్‌హీట్ ఉష్ణోగ్రతల్లో నిల్వ చేయాలి. అయితే గోధుమ బియ్యం ఎన్ని జాగ్రత్తలు పాటించినా ఆరు నెలలకు మించి నిల్వ ఉండదు. ఇందుకు కారణం దాన్లో సహజసిద్ధ నూనెలు ఉండడమే!



తేనె: పూల నుంచి సేకరించిన మకరందంతో తేనెటీగల శరీరాల్లో ఉండే రసాయనాలు కలిసి, మకరందం రసాయన స్థితి మారుతుంది. ఇలా తయారయిన తేనె సింపుల్ సుగర్స్‌లా విడివడి, తేనె తుట్టె గదుల్లోకి చేరుతుంది. ఈ క్రమం మూలంగా తేనె ఎల్లకాలం చెక్కుచెదరకుండా ఉంటుంది.

ఉప్పు: భూమిలోని సహజసిద్ధ ఖనిజలవణం రూపమే సోడియం క్లోరైడ్. కాబట్టే దీని నిల్వ కాలం ఎక్కువ. తేమను పీల్చుకునే గుణం ఉండడం మూలంగా ఉప్పును పదార్థాల నిల్వకు ఉపయోగించే ఆనవాయితీ శతాబ్దాల పూర్వం నుంచి ఉంది. అయితే ఇదే గుణం ఆహారంలో ఉపయోగించే మెత్తని ఉప్పుకు ఉండదు. ఈ ఉప్పు తయారీలో భాగంగా జోడించే అయొడిన్ మూలంగా మెత్తని ఉప్పు నిల్వ సామర్థ్యం తగ్గుతుంది. ఇలాంటి అయొడైజ్‌డ్ సాల్ట్ ఐదేళ్లకు మించి నిల్వ ఉండదు.

కాచిన వెన్న: వెన్న లోని తేమ మొత్తం పోయేలా వేడి చేసి నిల్వ చేయాలి. కాచిన వెన్న లేదా నెయ్యిలను చల్లని ఉష్ణోగ్రత వద్ద, మూత బిగించిన సీసాల్లో నిల్వ చేస్తే దాదాపు వందేళ్లపాటు పాడవకుండా నిల్వ ఉంటాయి.

ఎండిన పప్పుధాన్యాలు: కందులు, మినుములు, చిక్కుడు గింజలు, సోయా, రాజ్మా మొదలైనవి తేమ లేకుండా, ఎండబెట్టి నిల్వ చేస్తే 30 ఏళ్ల పాటు పాడవకుండా ఉంటాయి. ఇంతకాలం నిల్వ ఉన్నా వాటిలోని మాంసకృత్తుల పరిమాణం ఏమాత్రం తగ్గదు.

స్ఫూర్తి



పర్వత రాణి లక్పా షెర్పా

2000 సంవత్సరంలో ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన తొలి మహిళగా చరిత్ర సృష్టించింది నేపాల్‌కు చెందిన లక్పా షెర్పా. అప్పటి నుంచి ఇప్పటివరకూ ఏకంగా పదిసార్లు ఎవరెస్ట్‌ను అధిరోహించి, స్వీయ రికార్డులను బద్దలు కొట్టిన ఈ పర్వతారోహకురాలి జీవితం తాజాగా నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలై ప్రశంసలందుకుంటోంది. ఈ సందర్భంగా లక్పా గురించిన మరిన్ని విశేషాలను తెలుసుకుందాం!

బాలకర్మలోని మారుమూల హిమాలయ ప్రాంతం, నేపాల్‌లోని మకాలు గ్రామం లక్పా స్వస్థలం. ప్రాథమిక విద్యను కూడా అభ్యసించలేకపోయిన లక్పా, 2000, సెప్టెంబరులో నేపాలీ విమెన్ మిలీనియం ఎక్స్‌పెడిషన్‌లో భాగంగా ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించి, ప్రపంచం గుర్తించే స్థాయికి ఎదిగింది. 2003 నాటికి లక్పా షెర్పా మూడోసారి ఎవరెస్టును అధిరోహించి రికార్డును నెలకొల్పింది. 2007లో ఆ రికార్డు ఆరు శిఖరాలకు పెరిగింది. 2006లో ఆమె టిబెట్ మీదుగా, సవాళ్లతో కూడుకున్న మార్గం ద్వారా ఏడోసారి ఎవరెస్టును అధిరోహించి సరికొత్త రికార్డును నెలకొల్పింది. చివరిగా 2022, మేలో పదోసారి ఎవరెస్టును అధిరోహించి అందర్నీ అబ్బురపరిచింది. ప్రస్తుతం అమెరికాలో నివసిస్తున్న లక్పా షెర్పాకు ముగ్గురు పిల్లలు. ఈమె పదోసారి ఎవరెస్టును అధిరోహించడం కోసం తన పదిహేనేళ్ల కూతురు, షైనీని వెంటబెట్టుకుని నేపాల్‌కు తిరిగొచ్చినప్పుడు, ఎవరెస్టు ఆవిడకు భిన్నంగా కనిపించింది. హిమాలయాల మీద పరుచుకున్న తక్కువ మంచు, ఎక్కువ చెత్తను చూసి ఆమె మనసు ద్రవించింది. మృతదేహాలు కూడా బయల్పడడం మొదలుపెట్టాయి. పర్వతారోహణకు ఉపయోగించే తాళ్లు, నిచ్చెనలు సైతం ఖుంబు ఐస్ ఫాల్‌లో కూరుకుపోయాయి. అయినా ఆ సవాళ్లన్నింటినీ అధిగమించి పదోసారి విజయవంతంగా ఎవరెస్టు అధిరోహించగలిగిందామె. లక్పా, హిమాలయాల నీలి మంచును మొట్టమొదటిసారిగా తాకిన రోజులను స్మరించుకుంటే...



లక్పా హిమాలయాల్లోని ఎన్నో ఇతర శిఖరాలను అధిరోహించింది. తన అనుభవాన్ని ఎంతో మంది పర్వతారోహకులకు పంచి పెట్టింది. న్యూ ఇంగ్లండ్, హిమాలయాల్లో క్లౌడ్‌స్కేప్ క్లైంబింగ్ పేరుతో ఎంతోమంది పర్వతారోహకులకు పర్వతారోహణ మెలకువలను నేర్పిస్తోంది.

పర్వతాలే స్నేహితులుగా...

నేపాల్‌లోని మకాలు గ్రామంలో, గొర్రెల కాపరికి 11వ సంతానంగా పుట్టింది లక్పా. ప్రపంచంలోని ఐదవ ఎత్తైన పర్వత శిఖరమైన మకాలు పర్వతపాదాల్లో లక్పా పెరిగింది. సంతానం మొత్తానికీ బూట్లను కొనలేని పేద కుటుంబం వాళ్లది. ఆ ఇంట్లో మగపిల్లలే బడికి వెళ్లేవారు. "మా ఇంట్లో టివి, ఫోన్ ఉండేవి కావు. నేను రోజంతా గొర్రెలు, పక్షులను చూస్తూ కాలక్షేపం చేసేదాన్ని. మా గ్రామం నుంచి ఎవరెస్టు శిఖరం కనిపిస్తూ ఉండేది" అని తన చిన్ననాటి రోజులను గుర్తు చేసుకునే లక్పా, తనకు అడ్డుచెప్పే అమ్మ కళ్లుగప్పి, ఒంటరిగా, బూట్లు లేకుండా పర్వతాల్లో సంచరిస్తూ ఉండేది. మంచులో తిరిగే చిరుతలు గాయపరుస్తాయనీ, అప్పుడు తననెవరూ పెళ్లి చేసుకోడానికి ముందుకు రారనీ అమ్మ చెప్పే మాటలు గుర్తుకొచ్చి, ఇంటికి భయంభయంగా తిరిగొచ్చేది. కానీ లక్పాలో ఆమె తండ్రికి పట్టుదల, సామర్థ్యాలు కనిపించాయి. ఒక రోజు అతను గొర్రెపిల్లలు, జడలబర్రె పిల్లలను తోలుకురమ్మని, లక్పాను మకాలు బేస్‌క్యాంప్‌కు పంపించాడు. అక్కడ ఆమెకు పర్వతాన్ని అధిరోహించబోతున్న ఒక షెర్పా కంటపడ్డాడు. అప్పట్లో నేపాలీ మహిళలకు షెర్పాలుగా ఉద్యోగం చేయడానికి అనుమతి లేకపోయినప్పటికీ, తానెప్పటికైనా షెర్పా మహిళగా ఎదిగి, ఎవరెస్టును అధిరోహించాలని నిర్ణయించుకుంది లక్పా. అలా 15 ఏళ్లకే పోర్టర్‌గా మారి, ఏటవాలు పర్వతాల మీద బరువులను మోసుకుంటూ ఎక్కడం మొదలుపెట్టింది. తర్వాత రెండేళ్లకే కిచెన్ బాయ్‌గా పదోన్నతి పొందింది. రోజంతా పర్వతాన్ని అధిరోహించి, కిచెన్ టెంట్ ఏర్పాటు చేసుకుని, గైడ్స్, ఇతరులకూ భోజనం వండడం కోసం ఉల్లిపాయలూ, వెల్లుల్లీ వలుస్తూ ఉండిపోయేది. అందుకామెకు నెలకు 50 రూపాయలు జీతంగా దక్కేవి.

వెనకడుగు వేయకుండా...

తర్వాత 2000 సంవత్సరంలో అప్పటి కాబోయే నేపాల్ ఉప ప్రధాని, సుజాతా కొయిరాలా సహాయంతో, మొట్టమొదటి నేపాలీ విమెన్ ఎవరెస్ట్ ఎక్స్‌పెడిషన్‌లో స్థానం సంపాదించుకుని, ఏడుగురు మహిళలతో అధిరోహణ మొదలుపెట్టింది. ఆ బృందంలో మిగతా ఆరుగురు ఆల్టిట్యూడ్ సిక్‌నెస్‌తో వెనుదిరగడంతో, లక్పా ఒక్కతే విజయవంతంగా ఆ సాహసయాత్రను పూర్తి చేయగలిగింది. ఆ తర్వాత చేపట్టిన ప్రతి ఎక్స్‌పెడిషన్‌లో ఎన్నో విషాదాలను ప్రత్యక్షంగా చూసింది. స్నేహితులను కోల్పోయింది. అంతిమంగా 2002లో రొమేనియన్ పర్వతారోహకుడు జార్జ్ డిజ్మరెస్కును పెళ్లి చేసుకున్న లక్పా అమెరికాలోని కనెక్టికట్‌కు వెళ్లిపోయింది. వాళ్లిద్దరూ కలిసి రూఫింగ్, పెయింటింగ్ వ్యాపారం చేసేవారు. భర్త మరణించడంతో ఆమె చిన్నా చితకా పనులు చేసుకుంటూ ఇద్దరు ఆడపిల్లలను చదివించుకుంటూ ఉండిపోయింది. చివరకు 2022లో పదోసారి ఎవరెస్టును ఎక్కడం కోసం ఆవిడ తిరిగి నేపాల్ చేరుకుంది. కానీ ఆమె సాహసయాత్రకు స్పాన్సర్స్ లేరు. మహిళా పర్వతారోహకులకు ఇది కొత్త కాదు. కాబట్టి సొంత ఖర్చులతోనే సాహసయాత్రకు పూనుకుని విజయవంతంగా ఎవరెస్టును అధిరోహించి చరిత్ర సృష్టించింది.

తల్లి బాటలోనే కూతురు...

లక్పా ఇప్పటివరకూ హిమాలయాల్లోని ఎన్నో ఇతర శిఖరాలను అధిరోహించింది. తన అనుభవాన్నీ, పరిజ్ఞానాన్నీ ఎంతో మంది పర్వతారోహకులకు పంచి పెట్టింది. న్యూ ఇంగ్లండ్, హిమాలయాల్లో క్లౌడ్‌స్కేప్ క్లైంబింగ్ పేరుతో ఎంతో మంది పర్వతారోహకులకు పర్వతారోహణ మెలకువలను నేర్పిస్తోంది. లక్పా సేవలు షెర్పా సంస్కృతిలో సమూల మార్పులకు దోహదపడ్డాయి. నేపాల్, న్యూ ఇంగ్లండ్‌లోని ఎంతోమంది మహిళలకు ప్రేరణగా నిలిచాయి. కొడుకు నిమా, కూతుళ్లు సన్నీ, షైనీలు కూడా తల్లి లక్పా మార్గాన్నే అనుసరించారు. 15 షైనీ ఇప్పటికే కొన్ని క్లిష్టమైన పర్వతాలను అధిరోహించడం విశేషం. "షెర్పా సంస్కృతినీ, షెర్పా మహిళలు, నేపాలీ మహిళల స్థితిగతులను మార్చగలిగినందుకు నాకెంతో సంతోషంగా ఉంది. నా జీవితం సవాళ్లతో సాగింది. పర్వతాలే నా మనసుకు స్వాంతన చేకూర్చాయి. నేనెప్పటికీ వెనకడుగు వేయను. నాలాగే యువతులందరూ వెనకడుగు వేయకుండా ఉండాలనే నేను కోరుకుంటాను" అంటూ సాటి యువతులకు ప్రేరణగా నిలుస్తోంది లక్పా.



శ్రీకృష్ణుడే అవార్డుని తెచ్చాడు

కార్తికేయ 2 చిత్రానికి జాతీయ పురస్కారం దక్కడం పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థకు గొప్ప విజయం అని ఆ చిత్ర నిర్మాత టీజీ విశ్వప్రసాద్ చెప్పారు. నిఖిల్ సిద్ధార్థ్ హీరోగా చందూ మొండేటి దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా పురస్కారం గెలుచుకున్న సందర్భంగా చిత్రబృందం మీడియాతో ముచ్చటించింది. టీజీ విశ్వప్రసాద్ మాట్లాడుతూ 'కార్తికేయ 2' మొదలుపెట్టినప్పుడే పెద్ద సినిమా అనుకున్నాం. ఇంత సక్సెస్‌ను ఊహించలేదు. జాతీయ పురస్కారం దక్కడం మా సంస్థకు చాలా గొప్ప విషయం' అన్నారు. ఈ అవార్డునే శ్రీకృష్ణుడే తీసుకొచ్చాడని భావిస్తున్నాను అని అభిషేక్ అగర్వాల్ చెప్పారు. నేషనల్ అవార్డ్ మాపై బాధ్యతను మరింత పెంచింది అని చందు మొండేటి తెలిపారు. ప్రస్తుతం నాగచైతన్య హీరోగా తను తీస్తున్న 'తండేల్' పూర్తయ్యాక 'కార్తికేయ 3' ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. తను హీరోగా నటించిన 'కార్తికేయ 2' జాతీయ స్థాయిలో సత్తా చాటడం ఆనందంగా ఉందని హీరో నిఖిల్ చెప్పారు.

విజేతలకు ప్రముఖుల అభినందనలు

జాతీయ చలన చిత్ర పురస్కారాల్లో ఉత్తమ ప్రాంతీయ చిత్రాల విభాగంలో తెలుగు నుంచి కార్తికేయ - 2 అవార్డు పొందటం సంతోషకరం. ఉత్తమ నటి నిత్యమీనన్, ఉత్తమ నటుడు రిషబ్ శెట్టి, ఉత్తమ నృత్య దర్శకుడిగా ఎంపికైన జానీ మాస్టర్‌కు హృదయపూర్వక అభినందనలు.

- పవన్ కల్యాణ్, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి

70వ జాతీయ చలనచిత్ర పురస్కార విజేతలకు అభినందనలు. ఉత్తమ నటుడు రిషబ్‌శెట్టి, ఉత్తమ నటి నిత్యామేనన్.. ఉత్తమ చిత్రం 'ఆట్టమ్', కార్తికేయ 2' మేకర్స్‌కు అలాగే ఇతర పురస్కార గ్రహీతలందరికీ అభినందనలు

- చిరంజీవి

రిషబ్‌శెట్టికి అభినందనలు. 'కాంతార' చిత్రానికి ఉత్తమ నటుడి పురస్కారం అందుకోవడం సంతోషంగా ఉంది. అందుకు అవసరమైన అన్ని అర్హతలు ఉన్న వ్యక్తివి. 'కాంతార' చిత్రంలో నీ అభినయం గుర్తుకు వస్తే ఇప్పటికీ నాకు గూస్ బంప్స్ వస్తున్నాయి.

- ఎన్టీఆర్

జాతీయ చలనచిత్ర అవార్డుల్లో.. దుమ్మురేపిన సౌత్ సినిమా

జాతీయ చలనచిత్ర పురస్కారాలను కేంద్రం శుక్రవారం ప్రకటించింది. ఉత్తమ చిత్రం అవార్డు మలయాళ సినిమా 'ఆట్టమ్'ను వరించగా, ఉత్తమ నటుడి పురస్కారం 'కాంతార' సినిమాకు గాను రిషబ్ శెట్టికి దక్కింది. ఉత్తమ వినోదాత్మక చిత్రంగా సైతం 'కాంతార' నిలిచింది. ఉత్తమ నటి పురస్కారానికి నిత్య మేనన్(తిరుచిత్రంబళం), మానసి పరేఖ్ (కచ్ ఎక్స్ ప్రెస్)ను జ్యూరీ సంయుక్తంగా ఎంపిక చేసింది. ప్రాంతీయ చిత్రాల విభాగంలో ఉత్తమ తెలుగు చిత్రంగా 'కార్తికేయ 2' నిలిచింది. ఉత్తమ కన్నడ చిత్రంగా కేజీఎఫ్-2 అవార్డు దక్కించుకుంది. ఉత్తమ హిందీ చిత్రంగా 'గులెహర్' నిలిచింది. 'పొన్నియిన్ సెల్వన్-1' చిత్రానికి నాలుగు పురస్కారాలు దక్కాయి. మలయాళ, తమిళ చిత్రాలకు ఐదు చొప్పున అవార్డులు ప్రకటించగా, కన్నడ సినిమాకు మూడు పురస్కారాలు వచ్చాయి. తెలుగుకు దక్కింది ఉత్తమ ప్రాంతీయ చిత్రం ఒక్కటే! 2022 డిసెంబర్ 31 నాటికి సెన్సార్ అయిన చిత్రాలకుగాను ఈ అవార్డులను కేంద్రం ప్రకటించింది. 2022లో దేశవ్యాప్తంగా సుమారు 28 భాషల్లో విడుదలైన 300కు పైగా చిత్రాల నుంచి అందిన నామినేషన్లను 11 మందితో కూడిన జ్యూరీ పరిశీలించి ఈ అవార్డులను ప్రకటించింది.

న్యూఢిల్లీ, (ఆంధ్రజ్యోతి)

నాలుగోసారి దక్షిణాది హీరోలదే హవా

తాజాగా రిషబ్ శెట్టిని జాతీయ ఉత్తమ నటుడి పురస్కారం వరించడంతో దక్షిణాది చిత్రపరిశ్రమ అరుదైన ఘనతను సాధించినట్లైంది. వరుసగా నాలుగుసార్లు దక్షిణాది హీరోలు జాతీయ ఉత్తమ నటుడి పురస్కారాన్ని దక్కించుకున్నారు. 2019లో ధనుష్‌కు మనోజ్ బాజ్‌పాయ్‌తో కలసి ఉత్తమ నటుడి పురస్కారం దక్కింది. 'అసురన్' చిత్రానికి గాను ధనుష్ ఉత్తమ నటుడి పురస్కారానికి ఎంపికయ్యారు. 2020లోనూ సూర్య, అజయ్ దేవ్‌గణ్ ఉత్తమ నటుడి పురస్కారానికి ఎంపికయ్యారు. 'సూరారై పొట్రు' (తెలుగులో 'ఆకాశం నీ హద్దురా') చిత్రానికి గాను సూర్య ఉత్తమ నటుడి పురస్కారానికి ఎంపికయ్యారు. 2021లో 'పుష్ప' చిత్రానికి గాను అల్లు అర్జున్ ఉత్తమ నటుడిగా ఎంపికయ్యారు. ఇప్పుడు 2022కి గాను రిషబ్‌శెట్టిని ఈ పురస్కారం వరించింది. అంతకు ముందు 2010లో కూడా 'ఆడుకాలం' చిత్రానికి గాను ధనుష్ ఉత్తమ నటుడిగా ఎంపికయ్యారు. ఈసారి కూడా ఉత్తమ నటుడి పురస్కారానికి దక్షిణాది నుంచి మమ్ముట్టి, రిషబ్ శెట్టి, బాలీవుడ్ నుంచి విక్రాంత్ మాసే (ట్వల్త్ ఫెయిల్) పోటీ పడగా అదృష్టం రిషబ్‌ను వరించింది. మమ్ముట్టి 'నాన్పకల్ నేరట్టు మయక్కం, రోషాక్' రెండు చిత్రాలతో బరిలో నిలిచినా ఫలితం నిరాశపరిచింది.







తెలుగు సినిమాకు అన్యాయం జరిగిందా?





జాతీయ చలనచిత్ర అవార్డులు శుక్రవారం ప్రకటించారు. గత ఏడాది తెలుగు సినిమాకు ఉత్తమ జాతీయ నటుడు అవార్డు సహా తొమ్మిది అవార్డులు రావడంతో కాలరు ఎగరేసిన తెలుగు ప్రేక్షకుడు ఈసారి ప్రకటించిన అవార్డుల్లో తెలుగు సినిమాకు ఒక్కటంటే ఒక్క అవార్డ్ కూడా లేకపోవడం చూసి ఆశ్చర్యపోయాడు. ఇలా ఎందుకు జరిగిందని ఆలోచనలో పడ్డాడు.

తెలుగు రాష్ట్రాలు విడిపోయిన తర్వాత సినిమాలకు ప్రభుత్వ అవార్డులు అన్నవి లేనేలేవు. ఇప్పుడైనా ఇస్తారో, ఇవ్వరో తెలియని పరిస్థితి. ఫిల్మ్ ఫేర్ వంటి ప్రైవేట్ అవార్డులను పక్కన పెడితే, సినిమా ప్రముఖులు ఆశించేది, రావాలని కోరుకునేది జాతీయ చలనచిత్ర అవార్డులే. జాతీయ అవార్డ్ పొందితే కెరీర్ పరంగా ఏదో సాధించామనే సంతృప్తి చాలా మందికి ఉంటుంది. అయితే జాతీయ అవార్డు అందుకునే స్థాయి కలిగిన చిత్రాలు తెలుగులో ఎన్ని వస్తున్నాయనేది ఒక ప్రశ్న. తెలుగు చిత్ర పరిశ్రమలో టాలెంట్‌కు కొదువ లేదు. సినీ ప్రపంచమంతా తెలుగు చిత్రపరిశ్రమ వైపే చూస్తున్న రోజులివి. కొత్త తరహాగా ఆలోచించడం, కష్టపడే తత్వం తెలుగు వారికి ఎక్కువ. అయినా సరే కొత్త తరహా చిత్రాల గురించి ఆలోచించకుండా కమర్షియల్ చిత్రాలపై మోజుతో నిర్మాతలు పరుగులు తీస్తున్నారన్నది ఎవరూ కాదనలేని సత్యం. కాకపోతే ఈ ఏడాది ఢిల్లీకి పంపిన చిత్రాల్లో అవార్డుకు అర్హమైనవి కొన్ని ఉండడం వాటికి ఒక్క అవార్డ్ కూడా రాకపోవడం చర్చనీయాంశం అయింది.

కరోనా కారణంగా..

శుక్రవారం ప్రకటించిన నేషనల్ అవార్డ్స్ 2022 సంవత్సరం లో సెన్సార్ పూర్తి చేసుకున్న చిత్రాలకు సంబంధించినవి. వాస్తవానికి 2023 మే 3న ఈ అవార్డులను ప్రదానం చేయాలి. అయితే కరోనా తర్వాత జాతీయ చలన చిత్ర అవార్డుల షెడ్యూల్‌లో మార్పులు జరిగాయి. అవార్డుల ఎంపిక, ప్రదాన కార్యక్రమం ఆలస్యమవుతూ వస్తున్నాయి. లోకసభకు జరిగిన ఎన్నికల కారణంగా జాతీయ అవార్డులు ఈసారి మరింత ఆలస్యమయ్యాయి. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడానికి ముందే అవార్డుల ఎంపిక ప్రక్రియ మొదలైనా ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో దానిని మధ్యలోనే ఆపేసి ఎన్నికల ఫలితాలు వెల్లడి అయ్యాక మళ్లీ మొదలుపెట్టారు. ఇప్పుడు ప్రకటించిన అవార్డులను అక్టోబరు నెలలో విజేతలకు అందజేస్తారని సమాచారం.

ఇరవై సినిమాలు... ఒకే ఒక్క అవార్డ్

జాతీయ అవార్డుల కోసం తెలుగు నిర్మాతలు ఈసారి పెద్ద సంఖ్యంలోనే ఎంట్రీలు పంపారు. ఆ జాబితాలో ఉన్న సినిమాలు ఏమిటంటే 1. రైటర్ పద్మభూషణ్, 2. సీతారామం 3. అంటే సుందరానికి.. 4. విరాటపర్వం 5. యశోద 6. రాధేశ్యామ్ 7. సర్కారు వారి పాట 8. మర్రి చెట్టు 9. కుదిరామ్ బోస్ 10. ఇట్లు మారేడుమిల్లి 11. కార్తికేయ 2 12. డీజె టిల్లు 13. ఇక్షూ 14. ధమాకా 15. చదువే నా ఆయుధం 16. బింబిసార 17. భారత పుత్రులు 18. ఎట్ లవ్ 19. అశోకవనంలో అర్జున కల్యాణం 20. అల్లూరి. ఇన్ని సినిమాలు పంపిస్తే వాటిల్లో ఒక్కటంటే ఒక్కదానికి కూడా ఏ అవార్డూ దక్కలేదు. ఇది ఆలోచించాల్సిన అంశం. 'కార్తికేయ 2' చిత్రానికి ఇచ్చారు కదా అని అంటే అది ఉత్తమ ప్రాంతీయ చిత్రం కేటగిరిలో ఇచ్చిన అవార్డు. ఆ అవార్డు తెలుగు సినిమాకే ఇవ్వాలి కనుక కంటితుడుపు అన్నట్లు 'కార్తికేయ 2'కు ప్రకటించి చేతులు దులుపేసుకుంది అవార్డుల కమిటీ.

ఆ రెండు సినిమాలను పక్కన పెట్టేశారా?

'యుద్ధం రాసిన ప్రేమ లేఖ' అనే ట్యాగ్‌లైన్‌తో రూపుదిద్దుకొన్న చిత్రం 'సీతారామం' వైజయంతీ మూవీస్ సంస్థ సగర్వంగా సమర్పించిన ఈ సినిమా సూపర్ హిట్ అయింది. ప్రేక్షకులను తిరిగి థియేటర్లకు రప్పించిన సినిమా ఇదని టాలీవుడ్ సెలబ్రేట్ చేసుకుంది. చక్కని కథ, కథనాలతో రూపుదిద్దుకున్న 'సీతారామం'కు జాతీయ అవార్డు ఖాయం అని అందరూ అనుకున్నారు. తీరా శుక్రవారం ప్రకటించిన అవార్డుల జాబితాలో ఆ సినిమా ఊసే లేదు. విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసిన విషయం ఏమిటంటే 'సీతారామం' చిత్రం చివరి వరకూ పోటీలో ఉంది. అయితే అందులో సుమంత్ పోషించిన పాత్ర పాకిస్థాన్‌కు అనుకూలంగా ఉందనే సాకుతో అవార్డుల కమిటీ సినిమాను పక్కను పెట్టేసిందట. అలాగే నక్సలైట్లకు అనుకూలంగా, నక్సలిజాన్ని సమర్థించే రీతిలో 'విరాటపర్వం' చిత్రం ఉందంటూ ఆ సినిమాను కూడా పక్కన పెట్టేశారని అంటున్నారు. కల్యాణ్‌రామ్ నటించిన 'బింబిసార' చిత్రం కూడా కొత్త తరహా ప్రయత్నం. ఆ సినిమాను కూడా అవార్డుల కమిటీ పట్టించుకోలేదు. జ్యూరీలో తెలుగు సభ్యుడు కనీసం ఒకరున్నా తెలుగు సినిమాకు ఇలా అన్యాయం జరిగేది కాదనీ, ఫైట్ చేసి ఏదో ఒక సినిమాకు అవార్డ్ తీసుకువచ్చేవారని అంటున్నారు. తెలుగు చిత్ర పరిశ్రమకు సంబంధించిన సభ్యులు ఎవరూ లేకపోవడంతో . ఇతర భాషల వారు పెత్తనం చెలాయించి, అవార్డుల పరంగా తెలుగు సినిమాకు అన్యాయం చేశారని చిత్ర ప్రముఖులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వారికి అవార్డులు ఇచ్చారు కానీ..

తెలుగు ప్రేక్షకులకు సుపరిచితులైన ముగ్గురికి ఈసారి జాతీయ అవార్డులు రావడం కొంతలో కొంత ఉపశమనం. అయితే వారు అవార్డులు పొందింది తెలుగు చిత్రాలకు కాదు.. తెలుగేతర చిత్రాలకు.

నిత్యా మీనన్‌కు జాతీయ ఉత్తమ నటిగా అవార్డ్ వచ్చింది. అయితే తెలుగు సినిమా కాదు 'తిరుచిత్రంబలం' తమిళ చిత్రం. అలాగే ఎ.ఆర్.రెహమాన్ కూడా తమిళ చిత్రం 'పొన్నియిన్ సెల్వన్ 1' చిత్రానికే ఉత్తమ నేపథ్య సంగీతం అవార్డ్ పొందారు. అదే విధంగా కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ కూడా తమిళ సినిమాతోనే జాతీయ అవార్డ్ పొందారు.

70 వ జాతీయ చలనచిత్ర అవార్డులు

ఉత్తమ చిత్రం: 'ఆట్టమ్ (మలయాళం)

ఉత్తమ నటుడు: రిషబ్ శెట్టి (కాంతార- కన్నడం)

ఉత్తమ నటి: నిత్యా మీనన్ (తిరుచిత్రంబళం - తమిళం), మానసి పరేఖ్ (కచ్ ఎక్స్‌ప్రెస్- గుజరాతీ)

ఉత్తమ దర్శకుడు: సూరజ్ బర్జాత్యా (ఉంఛాయి- హిందీ)

హోల్‌సమ్ ఎంటర్‌టైన్‌మెంట్ ఫిల్మ్: కాంతార (కన్నడ)

ఉత్తమ విజువల్ ఎఫెక్ట్స్ ఫిల్మ్: బ్రహ్మాస్త్ర పార్ట్ 1 - శివ

ఉత్తమ నూతన దర్శకుడు: ప్రమోద్‌కుమార్- (ఫౌజ- హరియాన్వీ)

ఉత్తమ సహాయ నటి: నీనా గుప్తా (ఉంఛా- హిందీ)

ఉత్తమ సహాయ నటుడు: పవన్ రాజ్ మల్హోత్రా- (ఫౌజ)

ఉత్తమ బాలనటుడు: శ్రీపథ్ (మాలికాపురం- మలయాళం)

ఉత్తమ ఛాయాగ్రాహకుడు: రవి వర్మన్ (పొన్నియిన్ సెల్వం 1)

ఉత్తమ స్క్రీన్ ప్లే రచయిత: ఆనంద్ ఏకర్షి(ఆట్టమ్)

ఉత్తమ సంభాషణల రచయితలు: అర్పితా ముఖర్జీ, రాహుల్ వి చిట్టేలా (గుల్ మొహర్)

ఉత్తమ సంగీత దర్శకుడు (పాటలు): ప్రీతమ్ (పొన్నియిన్ సెల్వం 1)

ఉత్తమ సంగీత దర్శకుడు (నేపథ్యం): ఏ.ఆర్.రెహమాన్ (పొన్నియిన్ సెల్వం 1)

ఉత్తమ గీత రచయిత: నౌషాద్ సదర్ ఖాన్-(ఫౌజ)

ఉత్తమ నేపథ్య గాయకుడు: అర్జిత్ సింగ్ (బ్రహ్మాస్త్ర 1 - శివ)

ఉత్తమ గాయని: బాంబే జయశ్రీ (సౌదీ వెల్లక్క సీసీ 225 -2009)

ఉత్తమ ప్రాంతీయ చిత్రం: (కార్తికేయ 2 - తెలుగు)

ప్రత్యేక ప్రశంస: నటుడు మనోజ్ వాజ్‌పాయ్ (గుల్ మోహర్- హిందీ), సంగీత దర్శకుడు - సంజోయ్ సలీల్ చౌదరి (కదికన్ - మలయాళం)

ఉత్తమ ఎడిటర్: మహేశ్ భువనేండ్ (ఆట్టమ్)

ఉత్తమ యాక్షన్ డైరెక్టర్: అన్బరివు (కేజీఎఫ్ 2'

బెస్ట్ బుక్ ఆన్ సినిమా: కిశోర్‌కుమార్ (ది అల్టిమేట్ బయోగ్రఫీ)- రచయితలు- అనిరుద్ధ భట్టాచార్జీ, పార్థివ్ ధార్

బెస్ట్ క్రిటిక్: దీపక్ దువా (హిందీ)

త్వరలోనే కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ విలీనం!

- కేసీఆర్‌కు ఏఐసీసీ, కేటీఆర్‌కు పీసీసీ చీఫ్, హరీశ్‌కు మంత్రి, కవితకు రాజ్యసభ ఖాయం
- కవిత బెయిల్‌తో మా పార్టీకి ఏం సంబంధం?
- ఆప్ విలీనంతోనే సిసోడియాకు బెయిల్ వచ్చిందా?
- బాధ్యత లేకుండా కోర్టులపై బురద జల్లడం దుర్మార్గం
- దమ్ముంటే అవినీతి కేసుల్లో కేసీఆర్‌ను జైలులో పెట్టండి
- రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి సంజయ్ ధ్వజం



న్యూఢిల్లీ/హైదరాబాద్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): "అతి త్వరలోనే కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ విలీనం కానుంది. కేసీఆర్‌కు ఏఐసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, కేటీఆర్‌కు పీసీసీ చీఫ్, హరీశ్‌రావుకు మంత్రి పదవి ఇవ్వనుంది. తెలంగాణ నుంచి కవితను రాజ్యసభకు పంపినా ఆశ్చర్యం లేదు" అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు. ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి మీడియాతో చిట్‌చాట్ చేసిన కాసేపటికే బండి సంజయ్ ఒక ప్రకటన విడుదల చేశారు. బీజేపీలో బీఆర్ఎస్ విలీనం కానుందని, ఒప్పందంలో భాగంగానే కవితకు బెయిల్ రానుందని రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. "కవితకు బెయిల్ ఇవ్వాలా? వద్దా? అనేది న్యాయస్థానం పరిధిలోని అంశం. కవిత బెయిల్‌కు, బీజేపీకి ఏం సంబంధం? ఆమ్ ఆద్మీ పార్టీని విలీనం చేసుకుంటేనే మనీష్ సిసోడియాకు బెయిల్ వచ్చిందా? ముఖ్యమంత్రి పదవిలో కొనసాగుతూ రాజకీయ లబ్ధి కోసం గౌరవ న్యాయస్థానాలపై బురద చల్లడం దుర్మార్గం" అని వ్యాఖ్యానించారు. బీజేపీని బదనాం చేసేందుకు కాంగ్రెస్ నేతలు దిగజారి మాట్లాడుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్‌ది ముగిసిన అధ్యాయమని, ప్రజలు ఛీత్కరించిన ఆ పార్టీతో పొత్తు పెట్టుకోవాల్సిన ఖర్మ బీజేపీకి లేదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్‌ను విలీనం చేసుకోవాలని కాంగ్రెస్సే తహతహలాడుతోందని, పథకం ప్రకారమే ఆ పార్టీ ఎమ్మెల్యేలను చేర్చుకుంటోందని ఆరోపించారు. గతంలోనూ పొత్తు పెట్టుకొని, మంత్రి పదవులు పంచుకున్న చరిత్ర ఆ రెండు పార్టీలకు ఉందని గుర్తు చేశారు. కాళేశ్వరంలో అవినీతి, డ్రగ్స్, ఫోన్ ట్యాపింగ్ వంటి కేసుల్లో కేసీఆర్, కేటీఆర్ సహా బీఆర్ఎస్ నేతలను జైలుకు పంపే అవకాశం ఉన్నా, కాంగ్రెస్ కాపాడుతోందని ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ తీరు "నువ్వు కొట్టినట్లు చేయ్... నేను ఏడ్చినట్లు చేస్తా" అన్నట్టుగా ఉందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ నేతలకు దమ్ముంటే కాళేశ్వరం సహా అనేక అంశాల్లో వేల కోట్ల రూపాయల అవినీతికి పాల్పడ్డ కేసీఆర్, కేటీఆర్‌ను జైలుకు పంపాలని డిమాండ్ చేశారు. కాగా, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా ఢిల్లీలోని ఆయన సమాధి వద్ద బండి సంజయ్ నివాళులర్పించారు. వాజ్‌పేయి జీవితం స్ఫూర్తిదాయకమని కొనియాడారు.

కూల్చివేతలు ఆగవు

వెనక్కి తగ్గేది లేదు.. ఎవరున్నా వదిలేది లేదు.. ఒత్తిళ్లొస్తాయని తెలుసు.. పట్టించుకోం

- సౌత్ జోనే కాదు.. అంతటా చర్యలు
- చెరువులు, పార్కుల్ని కాపాడుకోవాలి
- ప్రజలు అనుకుంటే నేతలు సైలెంట్
- 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో హైడ్రా కమిషనర్ రంగనాథ్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): "చెరువులు, పార్కుల్లో అక్రమ నిర్మాణాల కూల్చివేతలో రాజీ పడేది లేదు. రాజకీయ నేతలు ఎందుకలా మాట్లాడుతున్నారో నాకు తెలియదు. వారి విమర్శలపై స్పందించను. భూముల ధరలు పెరగడంతో భూమాఫియా చెరువులు, పార్కులు, ప్రభుత్వ స్థలాలను చెరబడుతోంది. వారి వెనుక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల చైర్మన్లు, కార్పొరేటర్లు, వ్యాపారవేత్తలు ఉన్నారు. తమకు నష్టం జరుగుతుందనుకున్నప్పుడు వాళ్లు అలాగే స్పందిస్తారు. రాజకీయాలతో నాకు సంబంధం లేదు. ఫిర్యాదులపై చట్టప్రకారం చర్యలు తప్పవు" అని హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ(హైడ్రా) కమిషనర్ ఏవీ రంగనాథ్ పేర్కొన్నారు. బాధ్యతలు స్వీకరించి నెలకావస్తున్న నేపథ్యంలో ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

కొత్త బాధ్యతల అనుభవం ఎలా ఉంది?

హైడ్రాకు తొలి కమిషనర్‌గా రావడం అదృష్టంగా భావిస్తున్నా. చెరువులు, పార్కులతో ముడిపడి ఉన్న హైదరాబాద్ మనుగడను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరి మీదా ఉంది. ఆ విషయంలో హైడ్రా కీలకంగా వ్యవహరిస్తుంది. చెరువులు, పార్కుల కబ్జా, భూవివాదాల గురించి తెల్సుకోవడం రాకెట్ సైన్స్ కాదు. వరంగల్, నల్గొండలో పని చేసినప్పుడు కొంత అవగాహన ఉంది. పురపాలన, రెవెన్యూ, పట్టణ ప్రణాళిక, ఇరిగేషన్ విభాగాల చట్టాల గురించి తెల్సుకుంటున్నా. తాగు, సాగు నీటి అవసరాలకు, భూగర్భ జలాల పెంపునకు.. ఇలా బహుళ ప్రయోజనాలు సాధించేలా నిజాం, కాకతీయులు, ఇతర పాలకులు ప్రణాళికాబద్ధమైన నీటిపారుదల వ్యవస్థ తయారు చేశారు. వాటన్నిటి వివరాలూ సేకరిస్తున్నాం. కొన్నిచోట్ల మ్యాపుల్లో చెరువులున్నాయి. కానీ, క్షేత్రస్థాయిలో కనిపించట్లేదు. కొన్ని నాలాలు, పార్కులదీ అదే దుస్థితి. చెరువుల ఆక్రమణలపై సుప్రీం, హైకోర్టు, ఎన్‌జీటీల తీర్పులతో కంపెండియమ్ తయారు చేస్తున్నాం. యజమాన్యపు హక్కు వివాదాలుండే అవకాశమున్న దృష్ట్యా ప్రభుత్వ భూముల కబ్జాల జోలికి వెళ్లట్లేదు. చెరువులు, పార్కుల్లో నిర్మాణాలు కూల్చివేస్తున్నాం.

> నిబంధనలకు విరుద్ధంగా అనుమతులిచ్చిన అధికారులపై చర్యలుంటాయి. వారిపై విచారణ జరిపి ప్రాసిక్యూట్ చేస్తాం. ఆక్రమణదారుల వెనుక ఉన్న ఇతర వ్యక్తులనూ గుర్తిస్తాం. ఆధారాలు దొరికితే వారిపైనా చర్యలు తీసుకుంటాం. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ.. ఎవరైనా వదలం. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో భవనాలు నిర్మించి మెనేజ్ చేస్తామనుకుంటే ఇక కుదరదు. కోర్టులు కూడా అంత సులువుగా స్టేలు ఇవ్వవు. ఫోర్జరీ డాక్యుమెంట్లతో వ్యవస్థను తప్పుదోవపట్టించే వారిని ప్రాసిక్యూట్ చేస్తాం.
>
> - రంగనాథ్, హైడ్రా కమిషనర్



అవాంతరాలను ఎలా అధిగమిస్తారు?

గ్రేహౌండ్స్, ఆక్టోపస్, టీజీన్యాబ్, ఎస్ఐబీ తరహాలో హైడ్రా కొత్త సంస్థ. సరైన మార్గంలో తీసుకెళ్లేందుకు వ్యవస్థను సమర్థంగా నిర్మించుకోవాలి. ఆరంభంలో అవాంతరాలుంటాయి. కూల్చివేతలకు సంబంధించి కార్పొరేషన్లు, మునిసిపాలిటీలు, జీహెచ్ఎంసీ, పంచాయతీ రాజ్ యాక్ట్‌ల అధికారాలను హైడ్రాకు ఇచ్చారు. ఒత్తిళ్లు వస్తాయని ముందే తెలుసు. కానీ.. ఈ విషయానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యం దృష్ట్యా వాటిని అంతగా పట్టించుకోవాల్సిన అవసరం లేదు. ఈ విషయంలో ఎన్ఆర్ఎస్‌సీ, ఇస్రో, పర్యావరణవేత్తలు మాతో కలిసి పనిచేసేందుకు ముందుకు వస్తున్నారు. హైడ్రా పనితీరుపై ప్రజల నుంచి అభినందనలు వస్తున్నాయి.

ఎఫ్‌టీఎల్ నిర్ధారణ ఏ ప్రతిపాదికన చేస్తున్నారు?

ఔటర్ వరకు 400కుపైగా చెరువులున్నాయి. వాటిలో మెజారిటీ జలాశయాల పూర్తి నీటి నిల్వ సామర్థ్యం(ఎఫ్‌టీఎల్)పై ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేశారు. కొన్ని చోట్ల కోఆర్డినేట్స్ మారినట్టు తెలుస్తోంది. అందుకే ఎఫ్‌టీఎల్ ఎలా నిర్ధారించాలి? ఎంత విస్తీర్ణంలో ఉన్న చెరువుకు ఎంత బఫర్ జోన్ ఉంటుంది? తెలుసుకునేందుకు రిటైర్డ్ ప్రొఫెసర్లు, ఇంజనీర్లు, పర్యావరణవేత్తలతో వర్క్‌షాప్ నిర్వహిస్తాం. దశాబ్దాల నాటి శాటిలైట్ చిత్రాలు, గూగుల్ మ్యాపుల ద్వారా వాస్తవాలు తెల్సుకునే ప్రయత్నం చేస్తాం.

జంట జలాశయాల పరీవాహక ప్రాంతంలో అక్రమ నిర్మాణాలపై చర్యలుంటాయా?

జంట జలాశయాల ఎగువన ఉన్న కాలువల్లో ఎస్‌టీపీలు నిర్మించారు. వాటి నుంచి వచ్చే మురుగును శుద్ధి చేసి జలాశయాల్లోకి వదులుతున్నారు. ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ నీటిని నగర తాగునీటి అవసరాలకూ వాడుతుంటారు. అలాంటప్పుడు శుద్ధి చేసిన నీరు ఎంత వరకు సురక్షితం? జీఓ-111 పరిధి జోలికి వెళ్లడం లేదు. చెరువులు, ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమ నిర్మాణాల కూల్చివేతపై దృష్టి సారించాం. ఫామ్‌హౌస్ లైనా.. ఇతర నిర్మాణాలైనా వరద కాలువలు, చెరువుల్లో ఉంటే కూల్చివేస్తాం.

అనుమతిలిచ్చిన అధికారులపై చర్యలుంటాయా?

చందానగర్‌లోని ఈర్ల చెరువు, ప్రగతినగర్‌లోని ఎర్ర చెరువు ఎఫ్‌టీఎల్‌లో జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు అనుమతులిచ్చారు. ఇక్కడ సర్వే నెంబర్లు, సరిహద్దులను తారుమారు చేసి నిర్మాణదారులు అనుమతులు తీసుకున్నారు. ఇరిగేషన్ నిరభ్యంతర పత్రాలూ లేవు. నిబంధనలకు విరుద్ధంగా అనుమతులిచ్చిన అధికారులపై చర్యలుంటాయి. వారిని ప్రాసిక్యూట్ చేస్తాం.

ఆ చెరువు చూసి బాధేసింది!

జీవవైవిధ్య పరంగా ఎంతో ప్రాధాన్యం ఉన్న అమీన్‌పూర్ చెరువును చూస్తే బాధేసింది. వ్యర్థాలతో నింపి చెరువును రెండుగా విభజించారు. అక్కడి రాళ్లపై ఏపీ మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అగ్రిమెంట్ భూమి అని రాసి ఉంది. రేపు పోలీస్‌స్టేషన్ వచ్చాక దీనిపై విచారణ జరుపుతాం. గూగుల్ మ్యాప్, శాటిలైట్ చిత్రాలు తీసి.. ఎవరు పూడ్చారో విచారించి క్రిమినల్ చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పూడ్చిన వ్యర్థాలను తొలగిస్తాం.

కూల్చివేతలకు ప్రభుత్వ అనుమతి తీసుకుంటున్నారా?

ఏదైనా స్పష్టత కావాలనుకుంటే ప్రభుత్వంతో చర్చిస్తా. లేదంటే నేనే నిర్ణయం తీసుకుంటా. క్షేత్రస్థాయిలో వాస్తవాలు పరిశీలించి చర్యలు చేపడుతున్నాం. అందుకు ప్రభుత్వం మద్దతు ఇస్తోంది. విధి నిర్వహణకు సంబంధించి పూర్తి స్వేచ్ఛ ఉంది. సర్కారుకు ఏదైనా సందేహాలుంటే నివృత్తి చేసుకుంటుంది. అక్రమ నిర్మాణాలకు గతంలోలా రంధ్రాలు చేసి వదలకుండా పూర్తిస్థాయిలో నేలమట్టం చేస్తున్నాం. ఇందుకు ఎక్కువ ఖర్చవుతోంది. కూల్చివేతల వ్యయం నిర్మాణదారుల నుంచి వసూలు చేసే విషయమై చర్యలు జరుగుతున్నాయి. దీనిపై ప్రభుత్వ స్థాయిలో తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అక్రమ నిర్మాణాలు కూల్చివేసిన చెరువులకు ఫెన్సింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.

హైడ్రా ఏర్పాటు సత్ఫలితాలనిస్తుందా?

హైడ్రా ఏర్పాటు దేశంలోనే సరికొత్త చర్చకు దారి తీసింది. ఇతర రాష్ట్రాల్లోనూ ఈ తరహా ఏజెన్సీ ఏర్పాటుకు డిమాండ్లు వస్తున్నాయి. ఢిల్లీ నుంచి ఓ ప్రొఫెసర్ నాతో మాట్లాడారు. హైడ్రా పనితీరు గురించి ఆరా తీశారు. ఢిల్లీలో ఎక్కువ అక్రమ నిర్మాణాలే ఉన్నాయని.. అక్కడ హైడ్రా లాంటిది కావాలని ప్రభుత్వాన్ని కోరుతామని చెప్పారు. ఏపీలోని వైజాగ్‌లోనూ ఇదే డిమాండ్ వచ్చిందని ఐపీఎస్ ఆఫీసర్ల వాట్సాప్ గ్రూపులో చూశా. ఈ తరహా డిమాండ్లు, పెరుగుతున్న ఫిర్యాదులే.. హైడ్రాపై శ్వాసం పెరిగిందనేందుకు నిదర్శనం.

కొనుగోలుదారులు బాధితులవుతున్నారు కదా?

ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు.. వెబ్‌సైట్‌లో చెరువుల ఎఫ్‌టీఎల్ హద్దులు అందుబాటులో ఉంచుతాం. ఎఫ్‌టీఎల్ జోన్‌లో ఉన్నారా? లేక బఫర్ జోన్‌లో ఉన్నారా తెలిసేలా యాప్ రూపొందిస్తున్నాం.

విపత్తుల నిర్వహణ మెరుగుదలకు ఏం చేస్తున్నారు?

హైదరాబాద్‌లో వర్షపాతం తీవ్రత ఎక్కువగా ఉంటోంది. రియల్ టైమ్‌లో ఎక్కడ ఎంత వర్షం పడింది.. ఎంత వరద నీరు నిలిచే అవకాశముందనేది సాంకేతికతతో తెల్సుకునే ప్రయత్నం చేస్తున్నాం. దీనిపై స్టార్టప్‌లతో పని చేస్తాం. ఐఎండీ వాళ్లతోనూ సమన్వయం చేసుకుంటున్నాం.

మళ్లీ గూగుల్‌పే/ఫోన్‌పే/పేటీఎంతో కరెంట్ బిల్లుల చెల్లింపు

- 'భారత్ బిల్ పే సర్వీస్'లో చేరిన డిస్కమ్‌లు
- ప్రతి లావాదేవీకి రూ.2 చెల్లింపుతో డిస్కమ్‌లపై భారం



హైదరాబాద్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కరెంట్ బిల్లులను మునపటిలాగే మళ్లీ గూగుల్‌పే/ఫోన్‌పే/అమెజాన్ పే/పేటీఎంల ద్వారా చెల్లించేందుకు మార్గం సుగమమైంది. రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మార్గదర్శకాల ఫలితంగా గత జూలై 1వ తేదీ నుంచి బిల్లుల చెల్లింపులు ఆయా థర్డ్ పార్టీ యాప్‌లలో నిలిచిపోయిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే ఉత్తర, దక్షిణ డిస్కమ్‌లు తాజాగా 'భారత్ బిల్ పేమెంట్ సర్వీసు (బీబీపీఎస్)'లో చేరిపోయాయి. దీంతో కరెంటు బిల్లుల చెల్లింపునకు యాప్‌లను వినియోగించుకునే అవకాశం అందుబాటులోకి వచ్చింది. అయితే ప్రతీ లావాదేవీకి రూ.2తో పాటు (జీఎస్టీ అదనం)గా డిస్కమ్‌లు భారత జాతీయ చెల్లింపుల సంస్థ (నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా-ఎన్‌పీసీఐ)కు చెల్లించాల్సి ఉంటుంది. దీంతో ప్రతీ నెల రూ.1.5 కోట్ల దాకా రెండు డిస్కమ్‌లపై అదనపు భారం పడనుంది. ఆర్‌బీఐ మార్గదర్శకాలు రానంతవరకు గూగుల్ పే/ఫోన్‌పేలలో కరెంట్ బిల్లులు కడితే.. డిస్కమ్‌లు అదనంగా చెల్లింపులు చేయాల్సిన అవసరం ఉండేది కాదు.. కాగా, థర్డ్ పార్టీ యాప్‌ల కంటే డిస్కమ్‌ల యాప్‌లే చెల్లింపులకు సురక్షితమని అధికారులు చెబుతున్నారు. గూగుల్ ప్లేస్టోర్‌లో టీజీఎస్పీడీసీఎల్, టీజీఎన్పీడీసీఎల్ యాప్‌లు లేదా https://tgsouthpower.org లేదా https://tgnpdcl.com లలోకి వెళ్లి.. బిల్లులు చెల్లించవచ్చని, ఒకవేళ ఏదైనా సమస్య వచ్చినా నేరుగా అధికారులను సంప్రదించే అవకాశముంటుందంటున్నారు.

రుణమాఫీ ప్రకటనలకు రూ. 300 కోట్ల ఖర్చు

- మాజీమంత్రి నిరంజన్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రుణమాఫీ ప్రక్రియ అంతా అరకొరగా సాగిందని మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. భాక్రానంగల్ ప్రాజెక్టు హిమాచల్‌ప్రదేశ్‌లో ఉంటే.. అది తెలంగాణలో ఉందని దాన్ని కాంగ్రెస్ కట్టిందని సీఎం రేవంత్‌రెడ్డి ఓ సందర్భంలో అన్నారని, రుణమాఫీ విషయంలో కూడా అలాంటి బోగస్ ప్రకటనలే చేస్తున్నారని విమర్శించారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. సంపూర్ణంగా రుణమాఫీ చేశామని సీఎం అబద్ధాలు చెబుతున్నారన్నారు. అదే జరిగితే రైతులంతా బ్యాంకుల చుట్టూ ఎందుకు తిరుగుతున్నారో సమాధానం చెప్పాలన్నారు. సగం, సగం మాఫీ చేసి, అందరికీ మాఫీ చేసినట్లు కాంగ్రెస్ ప్రకటించుకుంటోందని, ఆ ప్రకటనలకే రూ.300 కోట్లు ఖర్చు చేసిందన్నారు. పార్లమెంటులో ప్రతిపక్షనేతగా రాహుల్‌గాంధీ చాలా విషయాల్లో చక్కగా వ్యవహరిస్తున్నారని, ఇక్కడ సీఎం రేవంత్ మాత్రం అడ్డగోలుగా ప్రవర్తిస్తున్నారన్నారు.

వారాంతపు సెలవులకు ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, ఆగస్టు 16: వారాంతపు సెలవు రోజుల్లో ఆయా ప్రాంతాలకు వెళ్లి వచ్చే ప్రయాణికుల కోసం దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక రైళ్లను నడపనుంది. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఆగస్టు 18న నర్సాపూర్-సికింద్రాబాద్ ప్రత్యేకరైలు(07175), 19న సికింద్రాబాద్-నర్సాపూర్ ప్రత్యేక రైలు(07176), ఆగస్టు 17, 19 తేదీల్లో కాకినాడటౌన్-సికింద్రాబాద్ ప్రత్యేక రైలు(07177), ఆగస్టు18, 20తేదీల్లో సికింద్రాబాద్-కాకినాడటౌన్ ప్రత్యేక రైలు(07178) నడుపుతున్నట్లు అధికారులు తెలిపారు. ఆగస్టు17న తిరుపతి-కాచిగూడ ప్రత్యేక రైలు(07456), 18న కాకినాడ టౌన్-సికింద్రాబాద్ ప్రత్యేక రైలు(07187), 19న సికింద్రాబాద్-కాకినాడ టౌన్ ప్రత్యేక రైలు(07188) ఉంటుంది. ఇదిలా ఉండగా నర్సాపూర్-సికింద్రాబాద్ ప్రత్యేక రైళ్లు(07175-07176) పాలకొల్లు, భీమవరంటౌన్, ఆకివీడు, కైకలూరు, గుడివాడ, విజయవాడ, గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి, మిర్యాలగూడ, నల్లగొండ స్టేషన్లలో వచ్చి వెళ్లేప్పుడు ఆగుతుంది. కాకినాడటౌన్- సికింద్రాబాద్ ప్రత్యేక రైళ్లు(07177-07178) సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు, తణుకు, భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు గుడివాడ, విజయవాడ, గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి, మిర్యాలగూడ, నల్లగొండ స్టేషన్లలో నిలుపనున్నట్లు తెలిపారు.

దేవినేని అవినాశ్‌కు 'లుకవుట్' ఝలక్

- దుబాయ్ వెళ్లేందుకు యత్నించగా.. శంషాబాద్‌లో అడ్డుకున్న సీఐఎస్ఎఫ్

విజయవాడ/శంషాబాద్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత, విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాశ్‌కు చుక్కెదురైంది. టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో నిందితుడిగా ఉన్న ఆయన గురువారం అర్ధరాత్రి దుబాయ్ వెళ్లేందుకు ప్రయత్నించగా.. శంషాబాద్ విమానాశ్రయంలో సీఐఎస్ఎఫ్ బలగాలు అడ్డుకున్నారు. ఈ కేసులో ఆయనతో పాటు పలువురు నిందితులపై మంగళగిరి పోలీసులు దేశంలోని అన్ని విమానాశ్రయాలకు లుకవుట్ నోటీసులు జారీచేసిన సంగతి తెలిసిందే. శంషాబాద్‌లో సిబ్బంది ఆయనకు ఆ నోటీసు చూపించి దుబాయ్ వెళ్లడానికి వీల్లేదని స్పష్టం చేశారు. అనంతరం ఎయిర్‌పోర్టు అధికారులు మంగళగిరి రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. అవినాశ్‌పై కేసు నమోదై ఉన్నందున్న ఆయన విదేశీ ప్రయాణాలకు అనుమతులు ఇవ్వరాదని పోలీసులు స్పష్టం చేశారు. దీంతో ఆయన్ను వెనక్కి పంపించారు. అయితే ఈ ఘటనను అవినాశ్ ఖండించారు. తాను ఎక్కడికీ పారిపోలేదని, రెండు నెలలుగా విజయవాడలోనే ఉంటున్నానని చెప్పడం గమనార్హం.

అమెరికాలో తెలుగు యువకుడి మృతి

- మూడు రోజుల క్రితం తన గదిలోనే అనుమానాస్పద స్థితిలో మరణం


కొడుకు ఫొటో పట్టుకుని రోదిస్తున్న తల్లి నీలమ్మ

ఆత్మకూరు, ఆగస్టు 16: అమెరికాలో మరో తెలుగు యువకుడు మృతి చెందాడు. పార్ట్‌టైం జాబ్ చేసుకుంటూ ఉన్నత చదువులు కొనసాగిస్తున్న అతడు మూడు రోజుల క్రితం అనుమానాస్పద స్థితిలో మరణించాడు. ఆసరా ఉంటాడనుకున్న కొడుకు మృతి చెందడంతో ఆ కుటుంబం శోక సంద్రంలో మునిగిపోయింది. హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన ఏరుగొండ సాంబయ్య, నీలమ్మ దంపతులకు కుమారుడు రాజేష్(32), కూతురు రమ ఉన్నారు. పేద కుటుంబంలో పుట్టిన రాజేష్ ఫార్మసీ కోర్సు పూర్తి చేశాడు. ఆ తర్వాత ఎమ్మెస్ చదివేందుకు 2015లో అమెరికా వెళ్లాడు. అక్కడి మిసిసిపి రాష్ట్రంలోని డీస్ మెమోరియల్ ఫ్యునరల్ హోమ్‌లో ఉంటూ చదువుకుంటూనే పార్ట్ టైం ఉద్యోగంలో చేరాడు. ఈ క్రమంలో కరోనా సమయంలో ఆ ఉద్యోగం కూడా పోవడంతో ఆర్థికంగా కష్టాల్లో కూరుకుపోయాడు. ఈ నేపథ్యంలో తండ్రి సాంబయ్య అనారోగ్యంతో గత ఏడాది మృతి చెందగా.. ఆర్థిక పరిస్థితుల కారణంగా వీసా రాకపోవడంతో రాజేష్ తండ్రికి తలకొరివి పెట్టేందుకు కూడా రాలేకపోయాడు. ఈ క్రమంలో రాజేష్ మూడు రోజుల క్రితం అనుమానాస్పద స్థితిలో నివాసం ఉంటున్న గదిలోనే మృతి చెందినట్టు అతడి మిత్రులు తల్లి నీలమ్మకు ఫోన్ ద్వారా తెలిపారు. మంచి ఉద్యోగంతో ఉన్నత స్థాయిలో ఉంటాడనుకున్న కొడుకు మరణించాడని తెలియడంతో ఆ తల్లి రోదనకు అంతులేకుండాపోయింది. కుమారుడి మృతదేహాన్ని స్వదేశానికి తీసుకురావడానికి సుమారు రూ.12లక్షల నుంచి రూ.15లక్షల వరకు ఖర్చవుతాయని తెలియడంతో ఆమె దిక్కుతోచని స్థితిలో పడింది. ప్రభుత్వం చొరవ చూపి అమెరికా నుంచి రాజేష్ మృతదేహాన్ని సొంత గ్రామానికి తీసుకొచ్చేలా కృషి చేయాలని అతడి కుటుంబసభ్యులు, బంధువులు కోరుతున్నారు. కాగా, రాజేష్ మతదేహాన్ని తీసుకురావడానికి బీజేపీ నేతలు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.

నేడు, రేపు భారీ వర్షాలు

- 20వ తేదీ వరకు యెల్లో అలెర్ట్
- హైదరాబాద్, పలు జిల్లాల్లో వానలు
- కరీంనగర్ జిల్లా చిగురుమామిడిలో అత్యధికంగా 16.9 సెం.మీ.
- ఆసిఫాబాద్‌లో పిడుగులు.. ఇద్దరి మృతి

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్రంలో రెండ్రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. శని, ఆదివారాల్లో చాలా చోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వానలు పడతాయని వెల్లడించింది. ఆదివారం 24 జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశముందని తెలిపింది. ఈనెల 20 వరకు రాష్ట్రంలోని మెజారిటీ జిల్లాలకు యెల్లో అలెర్ట్ జారీ చేసింది. కాగా, రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో శుక్రవారం భారీ వర్షాలు కురిశాయి. ఉమ్మడి కరీంనగర్, మెదక్, నిజామాబాద్‌తో పాటు హైదరాబాద్‌లో పలుచోట్ల భారీ వానలు పడ్డాయి. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లపైకి వరద నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. పలు చోట్ల పంటపొలాలు నీట మునిగాయి. కరీంనగర్ జిల్లా చిగురుమామిడిలో అత్యధికంగా 16.9 సెం.మీ., మెదక్ జిల్లా కేంద్రంలో 12.9, సంగారెడ్డి జిల్లా చౌట్కూర్‌లో 10.5 సెం.మీ., మెదక్ జిల్లా పాతూరులో 9.3, జగిత్యాల జిల్లా కొడిమ్యాలలో 9.2, కరీంనగర్ జిల్లా ఈదులగట్టెపల్లిలో 8.5 సెం.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది. వర్షానికి మెదక్ జిల్లా కేంద్రం జలమయమైంది. అదే జిల్లా బెజ్జంకి మండలంలోని పలు గ్రామాల్లో పంట చేలు నీటమునిగాయి. ఆసిఫాబాద్ జిల్లాలో పిడుగులు పడి వేర్వేరు చోట్ల ఇద్దరు మృతి చెందారు. ఆసిఫాబాద్ మండలం నందుపా గ్రామానికి చెందిన దౌత్రే అంజన్న(20), కెరమెరికి చెందిన చౌదరి రమేశ్ (30) పిడుగుపాటుకు మృతి చెందారు. నిజామాబాద్, కామారెడ్డిలో కురిసిన భారీ వర్షంతో పలు కాలనీల్లో ఇళ్లల్లోకి వర్షపు నీరు వచ్చి చేరింది. హైదరాబాద్‌లో లంగర్‌హౌస్, పటాన్‌చెరు, మెహిదీపట్నం, హయత్‌నగర్ ప్రాంతాల్లో భారీ వర్షం పడింది.

ఎల్లుండి నుంచి కృష్ణాకు వరదలు!

మహారాష్ట్రలోని కృష్ణాబేసిన్ పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో సోమవారం నుంచి ప్రాజెక్టులకు మళ్లీ వరద పెరిగే అవకాశాలున్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రాజెక్టులకు నిలకడగా వరద వచ్చి చేరుతుండటంతో ఆల్మట్టి నుంచి పులిచింతల వద్ద ఉన్న జలవిద్యుత్తు కేంద్రాల్లో విద్యుత్తు ఉత్పాదన జోరుగా జరుగుతోంది. శుక్రవారం ఆల్మట్టిలో జలవిద్యుత్తు కోసం 14 వేల క్యూసెక్కులు, నారాయణపూర్‌లో 4,667, ఉజ్జయినిలో 1,600, జూరాలలో 32 వేలు, తుంగభద్రలో 4,688, శ్రీశైలంలో 68 వేలు, నాగార్జునసాగర్‌లో 28 వేలు, పులిచింతలలో 15 వేల క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. ఇక తుంగభద్ర ప్రాజెక్టులో కొట్టుకుపోయిన 19వ గేటు స్థానంలో స్టాప్‌లాగ్ గేటు పెట్టే ప్రయత్నాలు శుక్రవారం కూడా సఫలీకృతం కాలేదు. శనివారం కల్లా స్టాప్‌లాగ్ గేటు పెట్టే అవకాశాలున్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇక గోదావరి బేసిన్‌లోని ప్రాజెక్టులకు వరద అంతంత మాత్రంగానే ఉండడంతో ప్రాజెక్టుల్లో నిల్వలు పెరగలేదు. సింగూరుకు 391 క్యూసెక్కులు, ఎస్సారెస్పీకి 10,680, కడెం ప్రాజెక్టుకు 2,539, శ్రీపాద ఎల్లంపల్లికి 7,741 క్యూసెక్కుల వరద వస్తోంది. ఎల్లంపల్లి నుంచి 3,602 క్యూసెక్కులను మిడ్‌మానేరుకు ఎత్తిపోస్తున్నారు. ఇక, మేడిగడ్డ బ్యారేజీకి 1.57లక్షలు, అన్నారం బ్యారేజీకి 2,500 క్యూసెక్కులు వస్తుండగా.. వచ్చిన నీటిని వచ్చినట్లే దిగువకు వదులుతున్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న జూనియర్ డాక్టర్లు

రాష్ట్రంలో 24 గంటల పాటు ఓపీ సేవలు బంద్

(మొదటి పేజీ తరువాయి)

నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు కానున్నారు. పంజగుట్టలోని నిమ్స్‌లో కూడా ఓపీ సేవలతోపాటు కొన్ని రకాల సర్జరీలను నిలిపివేస్తున్నట్టు ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నిమ్మ సత్యనారాయణ తెలిపారు. యశోద, రెయిన్‌బో, కిమ్స్‌సన్‌షైన్ తదితర ఆస్పత్రులు కూడా ఈ మేరకు ప్రకటన చేశాయి. కాగా.. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేద రోగులకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకూ ఒక గంట పాటు నిరసన ప్రదర్శన చేయాలని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం ప్రతినిధి డాక్టర్ నరహరి పిలుపునిచ్చారు. జూనియర్ డాక్టర్లు ఇప్పటికే సమ్మె చేస్తున్న కారణంగా.. అవసరమైతే ఒక గంట ఎక్కువగా పనిచేసి ఓపీ నిర్వహించాలన్నారు. ఇక.. వైద్యులు, నర్సుల ఆందోళనకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ శుక్రవారం ఒక ప్రకటనలో సంఘీభావం తెలిపారు. ఇంతటి దారుణానికి పాల్పడిన నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని.. కేసు దర్యాప్తును సీబీఐ వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టును ఏర్పాటు చేసి కఠిన శిక్ష పడేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇలాంటి ఘటనలు జరగకుండా డాక్టర్లు, నర్సులు, వైద్య సిబ్బంది భద్రతకు చర్యలు చేపట్టాలని.. వారి మీద దాడులు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ఓపీ సేవల బంద్ నేపథ్యంలో.. వైద్య సేవలకు అంతరాయం రాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యవసర సేవలు అందుబాటులో ఉండేలా డాక్టర్లు సమన్వయంతో పనిచేయాలని కోరారు.

ఎమ్మెల్సీలుగా కోదండ, అలీఖాన్ ప్రమాణం

ప్రమాణం చేయించిన మండలి చైర్మన్

హైదరాబాద్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా టీజేఎస్ అధినేత కోదండరాం, ఉర్దూ పత్రిక సియాసత్ న్యూస్ ఎడిటర్ అమెర్ అలీ ఖాన్ ప్రమాణ స్వీకారం చేశారు. శుక్రవారం శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తన చాంబర్‌లో వీరితో ప్రమాణం చేయించారు. కార్యక్రమానికి మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, పలువురు ఎమ్మెల్సీలు హాజరయ్యారు. కాగా, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దాసోజు, కుర్రా సత్యనారాయణలను గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా సిఫార్సు చేయగా అప్పటి గవర్నర్ తమిళిసై తిరస్కరించారు. తర్వాత వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పంపిన కోదండరాం, అలీ ఖాన్ పేర్లకు ఆమోదం తెలిపింది. ఈ నేపథ్యంలో దాసోజు, సత్యనారాయణలు హైకోర్టులో పిల్ వేశారు. కేసుకు సంబంధించి మార్చి 7న ఇచ్చిన ఉత్తర్వుల్లో.. దాసోజు, సత్యనారాయణ నియామకాలకు సంబంధించి మంత్రివర్గం సిఫారసులను తిప్పి పంపే అధికారమే ఉంది కానీ.. తిరస్కరించే అధికారం గవర్నర్‌కు లేదంటూ స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టుకు వెళ్లగా.. మార్చి 7న హైకోర్టు ఇచ్చిన తీర్పును నిలిపేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో కోదండరాం, అలీఖాన్‌ల ప్రమాణ స్వీకారానికి మార్గం సుగమమైంది. జనవరి చివరి వారంలో ప్రమాణం చేయాల్సిన వీరు ఆరున్నర నెలలు ఆగాల్సి వచ్చింది. కాగా, ఎమ్మెల్సీ పదవిని అదనపు బాధ్యతగా మాత్రమే భావిస్తున్నానని కోదండ రాం తెలిపారు. ప్రమాణం తర్వాత ఆయన మాట్లాడారు. తాము ఈ స్థాయిలో ఉన్నామంటే అనేకమంది చేసిన బలిదానాలే కారణమని పేర్కొన్నారు. తనతో పాటు పనిచేసిన ఉద్యమకారులు, అమర వీరుల ఆకాంక్షల మేరకు పని చేస్తానని తెలిపారు. అనంతరం అమరవీరుల స్థూపం వద్ద కోదండరాం, అలీఖాన్ నివాళులు అర్పించారు.


ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేస్తున్న కోదండరాం



సుమిత్ వచ్చేశాడు

▸▸ స్వీడన్‌తో డేవిస్‌కప్‌కు భారత జట్టు



న్యూఢిల్లీ: భారత టెన్నిస్ సింగిల్స్ టాప్ ఆటగాడు సుమిత్ నగల్ డేవిస్ కప్ జట్టులోకి తిరిగొచ్చాడు. వచ్చేనెల 14, 15వ తేదీల్లో స్వీడన్‌తో భారత్ తలపడే వరల్డ్ గ్రూప్ 1 పోరుకు శుక్రవారం ప్రకటించిన జట్టులో నగల్ చోటు దక్కించుకున్నాడు. ఇటీవల ఇస్లామాబాద్ వేదికగా పాకిస్థాన్‌తో భారత్ ఆడిన డేవిస్ కప్ పోరుకు నగల్ దూరమైన సంగతి తెలిసిందే. ఇక, స్వీడన్‌తో పోరుకు సుమిత్‌తో పాటు రామ్‌కుమార్ రామనాథన్, శ్రీరామ్ బాలాజీ, నికీ పొనాచా, సిద్దార్థ్ విశ్వకర్మ భారత్ జట్టులో ఉన్నారు. ఆర్యన్ షాను రిజర్వ్ ఆటగాడిగా ఎంపికచేశారు. కాగా, డబుల్స్ స్పెషలిస్టు యుకీ భాంబ్రీ ఈ పోరు నుంచి తప్పుకొన్నాడు. దీంతో శ్రీరామ్ బాలాజీకి తోడుగా రామ్‌కుమార్‌ను డబుల్స్‌లో ఆడించే చాన్సుంది. సింగిల్స్‌లో కూడా రామ్‌కుమార్ తలపడతాడు. ఇక, జీషన్ అలీ స్థానంలో మాజీ ఆటగాడు అశుతోష్ సింగ్ కొత్త కోచ్‌గా వ్యవహరించనున్నాడు.

మనసు మార్చుకుందా?

కెరీర్ కొనసాగింపుపై వినేశ్ పరోక్ష సంకేతం



న్యూఢిల్లీ: కేవలం 100 గ్రాములు అధిక బరువుందనే కారణంతో పారిస్ ఒలింపిక్స్ మహిళల 50 కిలోల విభాగం ఫైనల్‌కు స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగట్‌ను అనర్హురాలిగా ప్రకటించడంతో దేశం యావత్తు నివ్వెరపోయింది. క్రీడల నిర్వాహకుల నిర్ణయాన్ని జీర్ణించుకోలేకపోయింది. మనకే ఇంత బాధ ఉంటే రెజ్లర్ వినేశ్‌కు ఇంకా ఎంత వేదన ఉంటుందో కదా! అందివచ్చిన ఒలింపిక్ పతకం చేజారడంతో మనసు వికలమైన ఫొగట్ అనూహ్యంగా తన కెరీర్‌కు వీడ్కోలు పలికింది. తన నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని ఫ్యాన్స్, సహచర క్రీడాకారులు వినేశ్‌ను కోరారు కూడా. పైగా..తన అనర్హతను సవాలు చేస్తూ..క్రీడా మధ్యవర్తిత్వ న్యాయస్థానా (కాస్)న్ని ఆశ్రయించిన వినేశ్‌కు అక్కడా ఊరట లభించలేదు. ఈ నేపథ్యంలో పోరాటానికి మారుపేరైన 29 ఏళ్ల ఫొగట్ తన మనసు మార్చుకున్నట్టే కనిపిస్తోంది. మరో రెండు ఒలింపిక్స్‌లో తలపడాలనే ఆకాంక్షను పరోక్షంగా వ్యక్తీకరించింది. ఈమేరకు సోషల్‌మీడియాలో ఆమె శుక్రవారం ఉద్వేగంతో కూడిన సుదీర్ఘ పోస్టు చేసింది. 'విభిన్న పరిస్థితుల నేపథ్యంలో 2032 వరకు నేను ఆడగలననే అనిపిస్తోంది. నాలో పోరాటం, నాలో రెజ్లింగ్ ఎప్పుడూ ఉంటుంది. నా భవిష్యత్ ఎలా ఉంటుందో, ఆ ప్రయాణంలో ఏమి జరుగుతుందో చెప్పలేను. కానీ నేను నమ్మిన, నాకు సరైనదే అనిపించిన దానికోసం పోరాటాన్ని ఎప్పుడూ ఆపను' అని తేల్చి చెప్పింది. 'మనుగడ కోసం పోరాటం ఎన్నో పాఠాలు నేర్పింది. నాన్నను చిన్నతనంలోనే కోల్పోయా. అమ్మ కేన్సర్ బారిన పడింది. అయినా ఆమె ఎప్పుడూ జీవన పోరాటం ఆపలేదు. పోరాడేతత్వం అమ్మనుంచే అలవడింది' అని కష్టాలమయమైన తన బాల్యాన్ని గుర్తు చేసుకుంది. చిన్నతనంలో.. పొడవైన జుత్తు కోసం ఎన్నో కలలు కన్నానని చెప్పింది. తన కెరీర్ ఎదుగుదలకు ఎంతో తోడ్పడిన కోచ్‌లు, ట్రెయినర్, డాక్టర్ పార్థీవాలాకు ఎప్పటికీ రుణపడి ఉంటానని పేర్కొంది. భర్త సోమ్‌వీర్ తనకు నిరంతరం రక్షణ కవచంలా నిలిచాడని తెలిపింది.

చనిపోతుందేమోనని భయపడ్డాం..

వినేశ్ కోచ్ వోలర్

న్యూఢిల్లీ: ఒలింపిక్స్ 50 కిలోల ఫ్రీస్టయిల్ విభాగం ఫైనల్ బరిలో నిలిచేందుకు రెజ్లర్ వినేశ్ ఫొగట్ కష్టపడిన తీరును కోచ్ వోలర్ ఎకోస్ వివరించాడు. ఓ దశలో ఆమె చనిపోతుందేమోనని భయపడినట్టు ఆందోళన వ్యక్తం చేశాడు. ఫైనల్‌కు ముందు నిర్ణీత బరువుకన్నా 100 గ్రాములు అధికంగా ఉండడంతో వినేశ్‌పై అనర్హత వేటు పడిన విషయం తెలిసిందే. 'సెమీస్ తర్వాత వినేశ్ 2.7 కేజీల అధిక బరువుంది. వెంటనే గంటా 20 నిమిషాలు వ్యాయామం చేయించాం. అయినా 1.5 కేజీ అలాగే ఉంది. ఆ తర్వాత 50 నిమిషాల ఆవిరి సెషన్ తర్వాత ఒక చుక్క చెమట కూడా కనిపించలేదు. దీంతో అర్ధరాత్రి నుంచి ఉదయం 5.30 వరకు రకరకాల వ్యాయామాలను చేయించాం. మధ్యలో రెండు మూడు నిమిషాలపాటు విశ్రాంతి మాత్రమే ఉండేది. ఓ దశలో తను కుప్పకూలిపోయేది. తిరిగి లేపి గంటపాటు ఆవిరి సెషన్ కోసం పంపేవాళ్లం. ఈ క్రమంలో ఆమె చనిపోతుందేమో అనిపించేది' అని గురువారం ఫేస్‌బుక్‌లో పోస్టు చేసిన కోచ్ వోలర్ ఆ తర్వాత దాన్ని తొలగించాడు.

కరాటే, భరతనాట్యం ప్రాక్టీస్ చేస్తా

మను భాకర్

న్యూఢిల్లీ: ఒలింపిక్స్‌లో రెండు పతకాలతో రికార్డు సృష్టించిన స్టార్ షూటర్ మను భాకర్ ఇప్పుడు కరాటే, భరతనాట్యంలో రాటుదేలేందుకు సిద్ధమవుతోందట. అదేంటి.. ఇక షూటింగ్‌కు వీడ్కోలు పలికినట్టేనా? అనే ఆందోళన అవసరం లేదు. ఎందుకంటే.. బిజీ షెడ్యూల్‌తో అలసిపోయిన మను కొన్ని నెలలు షూటింగ్‌కు దూరంగా ఉండాలనుకుంటోంది. 'ఇప్పుడు నాకు తగినంత సమయం లభించింది. ఇక వ్యక్తిగత అభిరుచులపై దృష్టి సారిస్తా. కరాటేలో సాధనను తిరిగి ఆరంభిస్తా. అలాగే భరతనాట్యం కూడా నేర్చుకుంటున్నా. ఒలింపిక్స్ కారణంగా క్లాసులకు హాజరుకాలేదు. వయోలిన్ వచ్చు. గుర్రపు స్వారీ, స్కేటింగ్ కూడా ఎంతో ఇష్టం' అని ఓ ఇంటర్వ్యూలో మను భాకర్ వెల్లడించింది. అయితే మను గుర్రపు స్వారీ చేయవద్దని, పడిపోతే కష్టమని పక్కనే ఉన్న కోచ్ రాణా చెప్పడంతో... అలాంటిదేమీ లేదని, తనకు స్వారీ బాగా వచ్చని మను సమాధానమిచ్చింది.

పీడకలలు వెంటాడేవి



ఆండ్రూ ఫ్లింటాఫ్

లండన్: ఇంగ్లండ్ మాజీ ఆల్‌రౌండ్ ఆండ్రూ ఫ్లింటాఫ్ రెండేళ్ల క్రితం జరిగిన ఘోర ప్రమాదం నుంచి కోలుకుని ఇప్పుడు కోచింగ్‌పై దృష్టి సారించాడు. అయితే 2022 డిసెంబరులో బీబీసీ టాప్ గేర్ షోలో భాగంగా జరిగిన కారు ప్రమాదంలో ముఖంపై తీవ్రగాయాలయ్యాయి. తాజాగా 'ఫ్రెడ్డీ ఫ్లింటాఫ్స్ ఫీల్డ్ ఆఫ్ డ్రీమ్స్' రెండో సీజన్‌లో అప్పటి సంగతులను గుర్తుచేసుకున్నాడు. 'ఆ ప్రమాదం జరిగాక ఇలా మీ ముందుకు వస్తానని అనుకోలేదు. కానీ నాపై నేను జాలి పడాలని అనుకోను. అలాగే ఎవరి సానుభూతిని కోరుకోలేదు. ఆ సమయంలో మానసిక ఒత్తిడితో పాటు పీడకలలు వచ్చేవి. వాటిని ఎదుర్కోవడం చాలా కష్టంగా ఉండేది. కానీ నేను దీన్ని అధిగమించలేకపోతే ముందుకెళ్లలేను అనిపించేది. అందుకే నేను సాయం కోసం చూశాను. ఆశాభావంతో ముందుకెళ్లేందుకు ఇప్పుడు నాకు మరో అవకాశం దక్కింది' అని ఫ్లింటాఫ్ తెలిపాడు. ముఖంపై గాయాలకు సర్జరీ చేయించుకున్న తను ప్రస్తుతం ది హండ్రెడ్‌లో నార్తర్న్ సూపర్ చార్జర్స్ కోచ్‌గా ఉన్నాడు.



విజయీభవ

పారాలింపిక్స్‌కు భారత బృందం పయనం

న్యూఢిల్లీ: పారిస్‌లో ఒలింపిక్స్ ఇటీవలే ముగిశాయి. ఆ విశ్వక్రీడల్లో మనోళ్లు ఆరు పతకాలతో మెరిశారు. ఇప్పుడిక పారా అథ్లెట్ల వంతు. పారిస్ వేదికగానే ఈనెల 28 నుంచి వచ్చేనెల 8వ తేదీ వరకు పారాలింపిక్స్ జరగనున్నాయి. ఈ ప్రతిష్ఠాత్మక క్రీడల్లో సత్తా చాటేందుకు భారత అథ్లెట్లు సిద్ధమయ్యారు. పారాలింపిక్స్‌లో తలపడుతున్న 84 మందితో కూడిన భారత బృందం శుక్రవారం పారిస్‌కు పయనమైంది. వీరికి భారత పారాలింపిక్ కమిటీ (పీసీఐ), భారత క్రీడా ప్రాధికార సంస్థ (సాయ్) ఘనంగా వీడ్కోలు పలికాయి. 'మన పారా అథ్లెట్లు అడ్డంకులను అధిగమించి, సవాళ్లను అవకాశాలుగా మలచుకోవడంలో అద్భుత సామర్థ్యాలు కలిగి ఉన్నారు. పారిస్ సన్నాహకాల్లో వారు ఎక్కడలేని పట్టుదల ప్రదర్శించారు. పారాలింపిక్స్‌కు బయలుదేరుతున్న వేళ దేశమంతా మీకు అండగా ఉంటోంది. ఈ క్రీడల్లో మీరు దేశానికి ఎంతో కీర్తి ప్రతిష్ఠలు తీసుకొస్తారనే నమ్మకముంది. విశ్వవేదికపై తలపడుతున్న వారికి శుభాకాంక్షలు' అని పారా అథ్లెట్ల కోసం ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో పాల్గొన్న కేంద్ర క్రీడాశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవ్య అన్నారు.

ఈమారు పారాలింపిక్స్‌లో 12 అంశాల్లో మన క్రీడాకారులు అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఇక గత టోక్యో పారా ఒలింపిక్స్‌లో భారత్ 19 పతకాలు సాధించింది. ఈసారి మరింత మెరుగ్గా రాణించి పతకాల సంఖ్యను పెంచుకుంటామనే ధీమాను భారత పారాలింపిక్ కమిటీ చీఫ్ దేవేంద్ర జఝారియా వ్యక్తంజేశాడు.

పతాకధారులుగా సుమిత్, భాగ్యశ్రీ

పారిస్ పారాలింపిక్స్ ప్రారంభ వేడుకల్లో భారత జట్టును సుమిత్ అంటిల్, భాగ్యశ్రీ జాదవ్‌లు ముందుండి నడిపించనున్నారు. ఈ మేరకు వీరిద్దరు వేడుకల్లో మన జట్టు పతాకధారులుగా వ్యవహరిస్తారని పీసీఐ చీఫ్ దేవేంద్ర జఝారియా శుక్రవారం తెలిపాడు. జావెలిన్ త్రోయరైన సుమిత్ అంటిల్ గత టోక్యో పారాలింపిక్స్‌లో బంగారు పతకం సాధించి అదరగొట్టాడు. ఇక, షాట్‌పుట్ ఈవెంట్‌లో భాగ్యశ్రీ గత ఆసియా పారా క్రీడల్లో రజత పతకంతో మెరిసింది.

వినేశ్ వీర పుత్రిక

ప్రధాని ప్రశంస

న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్ మహిళల 50 కిలోల ఫైనల్ నుంచి అనూహ్యంగా అనర్హతకు గురైన రెజ్లర్ వినేశ్ ఫొగట్‌పై ప్రధాని మోదీ ప్రశంసలు కురిపించారు. ఆమెను 'వీర పుత్రిక'గా అభివర్ణించారు. విశ్వక్రీడల్లో పాల్గొన్న భారత క్రీడాకారులు స్వాతంత్ర్య దినోత్సవాన మోదీని కలిసిన విషయం విదితమే. ఈమేరకు..అథ్లెట్లతో తన భేటీకి సంబంధించిన వివరాలను మోదీ ఎక్స్‌లో శుక్రవారం పోస్టు చేశారు.

నన్ను తిట్టింది ఎవరు?

అథ్లెట్లతో మోదీ సరదా వ్యాఖ్యలు

ఒలింపిక్స్ సమయంలో పారిస్‌లో ఎండలు మండిపోయాయి. సూర్యుడి భగభగలకు అథ్లెట్లు అల్లాడిపోయారు. విశ్వ క్రీడలను పర్యావరణ సహితంగా నిర్వహించాలని నిర్ణయించిన నేపథ్యంలో క్రీడా గ్రామంలోని ఏ గదిలోనూ ఎయిర్ కండిషనర్లు ఏర్పాటు చేయలేదు. ఎండకు మన క్రీడాకారులు తట్టుకోలేకపోవడంతో పారిస్‌లోని భారత రాయబార కార్యాలయ అధికారులు హుటాహుటిన 40 పోర్టబుల్ ఏసీలను ఏర్పాటు చేశారు. ఈ విషయాన్ని ప్రస్తావించిన ప్రధాని..అథ్లెట్లతో జోక్ చేశారు. 'నిజం చెప్పండి. మోదీ బాగా మాటలు చెబుతారు. కానీ గేమ్స్ విలేజ్ రూములలో ఏసీ ఏర్పాటు చేయలేదు. ఇప్పుడు ఏం చేయాలని మీలో ఎవరు నన్ను తిట్టుకున్నారు' అని ప్రధాని నవ్వుతూ ప్రశ్నించారు.

అజిత్, అర్జున్ జిగేల్

ముగిసిన ప్రొ. కబడ్డీ వేలం

ముంబై: ప్రొ. కబడ్డీ సీజన్-11 ఆటగాళ్ల వేలం ముగిసింది. మొత్తం 118 మంది ఆటగాళ్లను ఫ్రాంచైజీలు కొనుగోలు చేశాయి. తొలిరోజైన గురువారం సచిన్ తన్వర్, మహ్మద్‌రెజాలపై కోట్లు కుమ్మరించిన ఫ్రాంచైజీలు.. రెండోరోజైన శుక్రవారం జరిగిన వేలంలో అజిత్, జై భవాన్, అర్జున్‌లను లక్షాధికారులను చేశాయి. అజిత్‌ను పుణెరి పల్టన్ జట్టు రూ.66 లక్షలకు, భగవాన్‌ను బెంగళూరు బుల్స్ రూ. 63 లక్షలకు, అర్జున్‌ను బెంగాల్ వారియర్స్ రూ.41 లక్షలకు సొంతం చేసుకున్నాయి.

డబ్ల్యూఎఫ్ఐకి మళ్లీ అడ్‌హాక్ కమిటీ

ఢిల్లీ హైకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) రోజువారీ వ్యవహారాల ను పర్యవేక్షించే బాధ్యతను భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) ఆధ్వర్యంలోని అడ్‌హాక్ కమిటీకి మళ్లీ అప్పగిస్తూ ఢిల్లీ హైకోర్టు శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. రెజ్లింగ్ సమాఖ్య ప్రస్తుత కార్యవర్గం ఎలాంటి కార్యకలాపాలు చేపట్టకుండా స్టే విధించాలని స్టార్ రెజ్లర్లు బజ్‌రంగ్, వినేశ్ ఫొగట్, సాక్షి మాలిక్ గతంలో ఈ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన జస్టిస్ సచిన్ దత్తా.. మధ్యంతర ఆదేశాలు జారీ చేశారు. గతంలో ఏర్పాటు చేసిన అడ్‌హాక్ కమిటీని ఐఓఏ పునరుద్ధరించాలని సూచించారు. అందులో ప్రముఖ క్రీడాకారులు ఉండాలని ఆదేశించారు. డబ్ల్యూఎఫ్ఐ కార్యకలాపాల నిర్వహణకు గతేడాది డిసెంబరు 27 అడ్‌హాక్ కమిటీని ఐఓఏ ఏర్పాటు చేసింది. భారత రెజ్లింగ్ సమాఖ్యకు ఎన్నికలు జరిగిన నేపథ్యంలో..ఈ ఏడాది ఫిబ్రవరి 13న డబ్ల్యూఎఫ్ఐపై విధించిన నిషేధాన్ని యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ (యూడబ్ల్యూడబ్ల్యూ) ఎత్తివేసింది. దాంతో గత ఏప్రిల్ 4న అడ్‌హాక్ కమిటీని ఐఓఏ రద్దు చేసింది. కాగా, ఈ ఆదేశాలను డివిజన్ బెంచిలో సవాలు చేయనున్నట్టు డబ్ల్యూఎఫ్ఐ వెల్లడించింది. రెజ్లింగ్ సమాఖ్య వ్యవహారాల్లో ఇతరుల జోక్యాన్ని యూడబ్ల్యూడబ్ల్యూ అంగీకరించ దని డబ్ల్యూఎఫ్ఐ చీఫ్ సంజయ్ సింగ్ అన్నారు. సమాఖ్యలో ఇతరులు జోక్యం చేసుకుంటే.. రాబోయే వరల్డ్ చాంపియన్‌షిప్‌లో మన రెజ్లర్లు ఆడకుండా నిషేధం విధించే ప్రమాదముందని ఆయన హెచ్చరించారు.

బిజినెస్

2024-25లో రూ.20,000 కోట్ల ఆర్డర్లు

ఎన్‌సీసీ లిమిటెడ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో మరిన్ని ఆర్డర్లు లభించే అవకాశం ఉందని హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే నిర్మాణ రంగ కంపెనీ ఎన్‌సీసీ లిమిటెడ్ భావిస్తోంది. ఇవి ఎంత లేదన్నా కనీసం రూ.20,000 కోట్ల వరకు ఉండే అవకాశం ఉందని కంపెనీ తన 2023-24 వార్షిక నివేదికలో పేర్కొంది. ఇందులో ఎక్కువ భాగం భవన నిర్మాణం, రవాణా, నీటిపారుదల, విద్యుత్ రంగాల నుంచి లభించే అవకాశం ఉందని భావిస్తోంది. ఈ ఏడాది మార్చి చివరి నాటికి కంపెనీ చేతిలో రూ.57,536 కోట్ల ఆర్డర్లు ఉన్నాయి. గత నెల కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రకటించిన కొత్త విమానాశ్రయాల నిర్మాణం, ఉడాన్ పథకం ఇందుకు కలిసివస్తాయని భావిస్తోంది. కాగా గత ఆర్థిక సంవత్సరానికి ఎన్‌సీసీ లిమిటెడ్ రూ.20,971 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.711 కోట్ల నికర లాభం ఆర్జించింది. అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే ఆదాయం 34 శాతం పెరగడం కంపెనీకి బాగా కలిసొచ్చింది.

పీ2పీ రుణాలపై ఆర్‌బీఐ ఆంక్షలు

ముంబై: నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ (ఎన్‌బీఎ్‌ఫసీ)ల పీర్ టు పీర్ (పీ2పీ) రుణాల ప్లాట్‌ఫామ్స్‌పై భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) కొరడా ఝుళిపించింది. ఈ సంస్థలు నిర్ణీత కాలపరిమితి, కనీస రాబడులకు హామీ, లిక్విడిటీ ఆప్షన్ల వంటి సదుపాయాలతో కూడిన ఎలాంటి పెట్టుబడి పథకాలను ప్రమోట్ చేయకూడదని ఆంక్షలు విధించింది. అలాగే రుణ పరిమితి పెంపు, పరపతి హామీల పేరుతో ఎలాంటి ఇన్సూరెన్స్ పథకాలనూ క్రాస్ సెల్ చేయకూడదని స్పష్టం చేసింది. పీ2పీ రుణదాతల డైరెక్టర్ల బోర్డు ఆమోదిత విధానాలకు అనుగుణంగా ఉంటేనే రుణ గ్రహీతకు రుణాలు పంపిణీ చేయాలని కోరింది. కొన్ని పీ2పీ ప్లాట్‌ఫామ్స్ రుణాలు మంజూరు చేసేటప్పుడు 2017లో జారీ చేసిన ఆదేశాలను అతిక్రమిస్తున్నందున ఈ సరికొత్త ఆదేశాలు జారీ చేసినట్టు ఆర్‌బీఐ తెలిపింది.

రూ.7.30 లక్షల కోట్ల లాభం

మార్కెట్ సంపదలో భారీ వృద్ధి
సెన్సెక్స్ 1,330 పాయింట్లు అప్
24,500 ఎగువ స్థాయికి నిఫ్టీ



ముంబై: వారాంతం ట్రేడింగ్‌లో దేశీయ స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు భారీగా లాభపడ్డాయి. శుక్రవారం సెన్సెక్స్ ఒక దశలో 1,412 పాయింట్ల వరకు పెరిగి 80,518 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి 1,330.96 పాయింట్ల (1.68 శాతం) లాభంతో 80,436.84 వద్ద స్థిరపడింది. గత రెండు వారాలకు పైగా సమయంలో సూచీకిదే అతిపెద్ద ఒక్కరోజు లాభం. రెండు వారాల గరిష్ఠ ముగింపు స్థాయి కూడా. నిఫ్టీ విషయానికొస్తే, 397.40 పాయింట్ల (1.65 శాతం) వృద్ధితో 2 వారాల గరిష్ఠ స్థాయి 24,541.15 వద్ద ముగిసింది. అమెరికా ఆర్థిక మాంద్యం భయాలు తగ్గుముఖం పట్టడంతో పాటు వచ్చే నెలలో ఫెడ్ రేట్ల తగ్గింపు ప్రారంభం కావచ్చన్న అంచనాలు ఊపందుకోవడంతో గ్లోబల్ మార్కెట్లతో పాటు దేశీయ సూచీలూ ర్యాలీ తీశాయి. ఐటీ, ఆటో, బ్యాంకింగ్, మెటల్, రియల్టీ రంగ షేర్లలో భారీగా కొనుగోళ్లు జరిగాయి. దాంతో ఈక్విటీ ఇన్వెస్టర్ల సంపదగా పరిగణించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ ఒక్కరోజే రూ.7.30 లక్షల కోట్లు పెరిగి రూ.451.59 లక్షల కోట్లకు (5.38 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది. మరిన్ని ముఖ్యాంశాలు..

● సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీలూ పాజిటివ్‌గా ముగిశాయి. టెక్ మహీంద్రా షేరు 4.02 శాతం ఎగబాకి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు 3 శాతానికి పైగా పుంజుకోగా.. టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్, ఇన్ఫోసిస్, అల్ట్రాటెక్, టాటా స్టీల్, అదానీ పోర్ట్స్, ఐటీసీ, ఐసీఐసీఐ బ్యాంక్, నెస్లే, బజాజ్ ఫైనాన్స్ షేర్లు రెండు శాతానికి పైగా రాణించాయి.

● ఈ మధ్యనే స్టాక్ మార్కెట్లో లిస్టయిన ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ షేరు మరో 20 శాతం వృద్ధితో అప్పర్ సర్క్యూట్ స్థాయి రూ.132.76కు చేరుకుంది. దాంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.58,558 కోట్లకు ఎగబాకింది. కంపెనీ ఐపీఓ ధర రూ.76తో పోలిస్తే షేరు ఇప్పటివరకు 75 శాతం పుంజుకుంది.

● ఈ నెల 9తో ముగిసిన వారంలో విదేశీ మారకం (ఫారెక్స్) నిల్వలు 480 కోట్ల డాలర్ల తగ్గుదలతో 67,011 కోట్ల డాలర్లకు పడిపోయాయని ఆర్‌బీఐ వెల్లడించింది. అంతక్రితం వారంలో నిల్వలు ఏకంగా 753 కోట్ల డాలర్ల వృద్ధితో సరికొత్త జీవితకాల రికార్డు స్థాయి 67,491.9 కోట్ల డాలర్లకు చేరుకున్నాయి.

ఎలక్ట్రానిక్స్ మార్ట్‌లో 7.8% వాటా విక్రయం

హైదరాబాద్‌కు చెందిన ఎలక్ట్రానిక్స్ మార్ట్ ఇండియా లిమిటెడ్ (ఈఎంఐఎల్, బజాజ్ ఎలక్ట్రానిక్స్) ప్రమోటర్లైన పవన్ కుమార్ బజాజ్, కరణ్ బజాజ్.. కంపెనీలో తమకు చెందిన 7.8% వాటాను ఓపెన్ మార్కెట్ ద్వారా రూ.689 కోట్లకు విక్రయించారు.పవన్ బజాజ్, కరణ్ బజాజ్ తమ వాటా నుంచి 1.50 కోట్ల షేర్ల చొప్పున విక్రయించగా.. ఎస్‌బీఐ ఎంఎఫ్ 3.92% వాటాకు సమానమైన 1.51 కోట్ల షేర్లను, నార్వే ఫండ్, ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ ఎంఎఫ్ 99.41 లక్షల షేర్లను దక్కించుకున్నాయి. రూ.229.75-229.77 ధర శ్రేణిలో ఈ షేర్లు కొనుగోలు చేశాయి. ఈ లావాదేవీ అనంతరం కంపెనీలో ప్రమోటర్లు, ప్రమోటర్ గ్రూప్ సంస్థల వాటా 72.97 శాతం నుంచి 65.17 శాతానికి తగ్గింది.

జేఎస్‌డబ్ల్యూ సిమెంట్ రూ.4,000 కోట్ల ఐపీఓ

సజ్జన్ జిందాల్‌కు చెందిన జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ కంపెనీ జేఎస్‌డబ్ల్యూ సిమెంట్ పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కు రాబోతోంది. ఐపీఓ ద్వారా రూ.4,000 కోట్ల సమీకరణకు అనుమతి కోరుతూ సెబీకి శుక్రవారం ప్రాథమిక ముసాయిదా పత్రాలు (డీఆర్‌హెచ్‌పీ) సమర్పించింది. పబ్లిక్ ఆఫర్‌లో భాగంగా కంపెనీ రూ.2,000 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రస్తుత వాటాదారులకు చెందిన రూ.2,000 కోట్ల విలువైన షేర్లను అమ్మకానికి పెట్టనుంది.

● లాజిస్టిక్ సేవల కంపెనీ ఈ-కామ్ ఎక్స్‌ప్రెస్ లిమిటెడ్ సైతం ఐపీఓ ద్వారా రూ.2,600 కోట్ల వరకు సేకరించేందుకు అనుమతి కోరుతూ సెబీకి డీఆర్‌హెచ్‌పీ సమర్పించింది. ఐపీఓలో భాగంగా కంపెనీ రూ.1,284.50 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రస్తుత ప్రమోటర్లు, వాటాదారులకు చెంది రూ.1,315.50 కోట్ల విలువైన షేర్లను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిన విక్రయించనుంది.

● స్మార్ట్‌వర్క్స్ కోవర్కింగ్ స్పేసెస్ లిమిటెడ్ కూడా సెబీ వద్ద డీఆర్‌హెచ్‌పీ దాఖలు చేసింది. ఐపీఓ ద్వారా రూ.550 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రమోటర్లకు చెందిన 67.59 లక్షల షేర్లను విక్రయించనున్నట్లు తెలిపింది.

● ఐటీ సొల్యూషన్స్ ప్రొవైడర్ ఓరియంట్ టెక్నాలజీస్ ఐపీఓ ఈ నెల 21న ప్రారంభమై 23న ముగియనుంది. ఐపీఓ ధరల శ్రేణిని కంపెనీ రూ.195-206గా నిర్ణయించింది. గరిష్ఠ ధర ప్రకారంగా కంపెనీ రూ.215 కోట్లు సమీకరించే అవకాశం ఉంది.

అరబిందో యూనిట్‌కు ఎఫ్‌డీఏ హెచ్చరిక లేఖ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): తెలంగాణలోని అరబిందో ఫార్మా అనుబంధ సంస్థ యూజియా ఫార్మా ఫార్ములేషన్ల ప్లాంట్‌కు అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ మండలి (యూఎస్ ఎఫ్‌డీఏ)హెచ్చరిక లేఖ జారీ చేసింది. పటాన్‌చెరు మండలం పాశమైలారంలో ఉన్న తమ యాజమాన్యంలోని యూజియా ఫార్మా స్పెషాలిటీస్ లిమిటెడ్ తయారీ ప్లాంట్‌లోని యూనిట్-3పై యూఎస్ ఎఫ్‌డీఏ అఫీషియల్ యాక్షన్ ఇండికేటెడ్ (ఓఏఐ) జారీ చేసిందని, దానికి అనుబంధంగా ఈ హెచ్చరిక లేఖ కూడా అందిందని నియంత్రణ సంస్థలకు పంపిన లేఖలో అరబిందో ఫార్మా తెలిపింది. ఆ లేఖ వివరాలేవీ ప్రకటించలేదు. అయితే ఈ లేఖ ప్రభావం వల్ల ప్రస్తుత సరఫరాలకు ఎలాంటి అంతరాయం ఉండబోదని పేర్కొంది. ఎఫ్‌డీఏ నిబంధనలకు తాము కట్టుబడతామని, సన్నిహితంగా కలిసి పని చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని తెలిపింది. ఈ యూనిట్‌లో ఎఫ్‌డీఏ బృందం ఈ ఏడాది జనవరి 22 నుంచి ఫిబ్రవరి 2 వరకు తనిఖీలు నిర్వహించిందని, ఆ తర్వాతనే ఓఏఐ జారీ చేసిందని ఆ ప్రకటనలో అరబిందో ఫార్మా వెల్లడించింది.

ఆక్సిటా కాటన్ లిమిటెడ్.. జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో రూ.154.96 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.3.54 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. కాగా రూ.1 ముఖ విలువ కలిగిన ప్రతి మూడు షేర్లకు ఒక బోనస్ షేరును జారీ చేసేందుకు డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసిందని కంపెనీ తెలిపింది. వాటాదారుల అనుమతికి లోబడి బోనస్ షేర్ల జారీ ఉంటుందని పేర్కొంది.

1 స్ట్రింగ్ మెటావర్స్ లిమిటెడ్.. జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో రూ.50.02 కోట్ల కన్సాలిడేటెడ్ రెవెన్యూపై రూ.5.38 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. కాగా ఐబీసీ నిబంధనలకు లోబడి బయో గ్రీన్ పేపర్స్ లిమిటెడ్‌లో స్ట్రింగ్ మెటావర్స్ విలీనమయ్యేందుకు జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ఆమోదం తెలిపింది. స్ట్రింగ్ మెటావర్స్‌కు ప్రస్తుతం హైదరాబాద్, గిఫ్ట్ సిటీ, యూఎఈ, హాంకాంగ్‌లో గ్లోబల్ కార్యాలయాలున్నాయి.

1 ఐసీఐసీఐ బ్యాంక్.. ఆంధ్రప్రదేశ్‌లో తన కార్యకలాపాలు మరింతగా విస్తరించింది. శ్రీకాకుళం పట్టణంలోని అరసవిల్లి రోడ్‌లో కొత్త శాఖను ప్రారంభించింది. బ్యాంక్‌కు ఇది జిల్లాలో ఏడో శాఖ. ఐసీఐసీఐ బ్యాంక్ రాష్ట్రంలో మొత్తం 260 శాఖలను నిర్వహిస్తోంది.

1 ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ పలు ఆఫర్లను ప్రకటించింది. ఫ్రీడమ్ ఆఫర్ పేరుతో తీసుకువచ్చిన ఈ ఆఫర్లలో విస్తృత శ్రేణి ఉత్పత్తులను అందుబాటులో ఉంచింది. ఎంపిక చేసిన ఉత్పత్తులపై 26 శాతం క్యాష్‌బ్యాక్ లేదా గరిష్ఠంగా రూ.40 వేల వరకు డిస్కౌంట్స్‌ను అందిస్తోంది. ఈ నెల 20 వరకు ఈ ఆఫర్లు అందుబాటులో ఉంటాయి.

1 జర్మనీ లగ్జరీ కార్ల దిగ్గజం ఆడి.. భారత్‌లో ఆడి క్యూ8 బుకింగ్స్‌ను ప్రారంభించింది. ఆడి ఇండియా వెబ్‌సైట్, మైఆడి కనెక్ట్ యాప్ ద్వారా కస్టమర్లు రూ.50 వేల చెల్లించి ఈ కారును బుక్ చేసుకోవచ్చు.

1 రాయల్‌ఓక్ ఫర్నీచర్ బిగ్ ఫ్రీడమ్ పేరుతో ప్రత్యేక సేల్‌ను ప్రకటించింది. 10 వేలకు పైగా ఉత్పత్తులు ఇందులో అందుబాటులో ఉండనున్నాయి. ఈ సేల్‌లో భాగంగా రూ.75,000కు పైబడి ఉత్పత్తులు కొనుగోలు చేసిన వారికి ఉచితంగా కొన్ని ఫర్నీచర్ ఉత్పత్తులను అందించనుంది.

1 రియల్ ఎస్టేట్ రంగంలోని కల్పతరు లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) జారీకి అనుమతి కోరుతూ సెబీకి దరఖాస్తు సమర్పించింది. ఇష్యూ ద్వారా రూ.1,590 కోట్లు సమీకరించాలన్నది లక్ష్యంగా ప్రకటించింది. ఇష్యూలో భాగంగా ఒక్కోటి రూ.10 ముఖవిలువ గల షేర్లను కంపెనీ విడుదల చేస్తుంది.

'రియల్టీ' పీఈ పెట్టుబడులు అదుర్స్

▸▸ జనవరి-జూన్ మధ్య రూ.32,736 కోట్లు
▸▸ హైదరాబాద్‌కి రూ.2,685 కోట్లు



న్యూఢిల్లీ: హైదరాబాద్‌తో సహా దేశంలోని ఆరు ప్రధాన నగరాల్లో స్థిరాస్తి (రియల్టీ) రంగం కళకళలాడుతోంది. ఈ ఏడాది జనవరి-జూన్ మధ్య కాలంలో ప్రైవేట్ ఈక్విటీ (పీఈ) సంస్థలు ఈ ఆరు ప్రధాన నగరాల్లోని కార్యాలయ, నివాస గృహ ప్రాజెక్టుల్లో 390 కోట్ల డాలర్ల (సుమారు రూ.32,736 కోట్లు) పెట్టుబడులు పెట్టాయి. గత ఏడాది (2023) మొత్తానికి చేసిన పెట్టుబడుల్లో ఇది 70 శాతానికి సమానమని రియల్టీ కన్సల్టెన్సీ సంస్థ 'కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్' ఒక నివేదికలో తెలిపింది. ఇందులో 63.33 కోట్ల డాలర్ల అత్యధిక పీఈ పెట్టుబడులను ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతం ఆకర్షించింది. ఈ ప్రాంతంలో కార్యాలయాల స్పేస్‌తో పాటు హై ఎండ్ లగ్జరీ ఇళ్లకూ మంచి డిమాండ్ ఉందని పేర్కొంది.

మూడో స్థానంలో హైదరాబాద్

ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతం తర్వాత 50.95 కోట్ల డాలర్ల పీఈ పెట్టుబడులతో ఐటీ సిటీ బెంగళూరు రెండో స్థానం ఆక్రమించింది. పీఈ పెట్టుబడులను ఆకర్షించడంలో బెంగళూరు తర్వాత హైదరాబాద్ మహానగరం మూడో స్థానంలో నిలిచింది. ఈ కాలంలో నగరంలోని కార్యాలయాలు, నివాస గృహాల ప్రాజెక్టులు 31.99 కోట్ల డాలర్ల (రూ.2,685 కోట్లు) పీఈ పెట్టుబడులు ఆకర్షించాయి. హైదరాబాద్ తర్వాత చెన్నై (23.47 కోట్ల డాలర్లు), పుణె (15.17 కోట్ల డాలర్లు), ముంబై (14.7 కోట్ల డాలర్లు) నగరాలు పీఈ పెట్టుబడులు ఆకర్షించడంలో ముందున్నాయని కుష్‌మన్ తెలిపింది.

తెలుగు రాష్ట్రాల్లో ఆగిన 32 ప్రాజెక్టులు

కాగా రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ వివిధ కారణాలతో ఆగిపోయిన గృహ నిర్మాణ ప్రాజెక్టుల సంఖ్య పెరిగిపోతోంది. హైదరాబాద్‌లో 6,169 ఇళ్లు లేదా ఫ్లాట్లకు సంబంధించిన 25 ప్రాజెక్టులు గత ఎనిమిదేళ్లుగా ముందుకు కదలడం లేదు. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలోనూ 2,403 ఇళ్లు, ఫ్లాట్లకు సంబంధించి ఆరు ప్రాజెక్టులది ఇదే పరిస్థితి. వైజాగ్‌లోనూ 28 నివాస గృహాలకు సంబంధించి ఒక ప్రాజెక్టు గత ఎనిమిదేళ్లుగా ముందుకు కదలడం లేదు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

17వ తేదీ			
హైదరాబాద్	440	విజయవాడ	491
వరంగల్	442	గోదావరి	491
చిత్తూరు	493	విశాఖపట్నం	495
		డజను గుడ్లు రూ. 66	

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	71,620 ▲	65,650 ▲	89,000 ▲
ముంబై	70,604 ▼	64,673 ▼	81,510 ▲

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	90	విజయవాడ	98
వరంగల్	90	గుంటూరు	98
కరీంనగర్	90	ఒంగోలు	98
మహబూబ్‌నగర్	90	చిత్తూరు	106
కర్నూలు	90	నెల్లూరు	106
విశాఖపట్నం	94	అనంతపురం	98
గోదావరి	98		

ఆస్పత్రులు, మెడికల్ కాలేజీల్లో భద్రతను పెంచండి

» కోల్‌కతా ఘటన నేపథ్యంలో ఆరోగ్యశాఖ మంత్రి ఆదేశాలు

హైదరాబాద్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచార ఘటన నేపథ్యంలో రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రులు, మెడికల్ కాలేజీల్లో భద్రతను పెంచాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ ఆదేశాలు జారీ చేశారు. భద్రతా సిబ్బందికి ఎప్పటికప్పుడు శిక్షణ నిస్తూ, కోల్‌కతా లాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్త పడాలని సూచించారు. ఉస్మానియా, గాంధీ, నిలోఫర్, జిల్లాల్లోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేసే డాక్టర్లు, నర్సింగ్ ఆఫీసర్లు, వైద్య సిబ్బందికి భద్రత పెంచాలని ఆయా ఆసుపత్రుల సూపరింటెండెంట్లను మంత్రి ఆదేశించారు. డాక్టర్లు, నర్సింగ్ ఆఫీసర్లపై దాడులు చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్‌లో డాక్టర్లు, నర్సులు, వైద్య సిబ్బంది భద్రతకు సంబంధించి అనేక అంశాలను పొందుపరిచిందని గుర్తు చేశారు. మహిళా డాక్టర్ల భద్రతకు కట్టుబడి ఉన్నామని మంత్రి తెలిపారు. కోల్‌కతా ఘటనపై దేశవ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనలకు మంత్రి రాజనర్సింహ సంఘీభావం తెలిపారు.

పీఎం సూర్యఘర్ అమలుకు మూడంచెల కమిటీలు

హైదరాబాద్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన అమలుకు మూడంచెల కమిటీలు వేస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కేంద్ర క్యాబినెట్ కార్యదర్శి అధ్యక్షతన జాతీయ స్థాయిలో, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో రాష్ట్రస్థాయి, జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తూ కేంద్ర నూతన, పునరుద్ధరణీయ ఇంధన వనరుల మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు వెలువరించింది. ఈ కమిటీలు పథకం అమలుపై నిరంతరం సమావేశమవుతూ తగిన చర్యలు తీసుకొని పథకం అమలు లక్ష్యాలను సాధించేలా చొరవ తీసుకుంటాయి.

వైద్యకళాశాలల్లో ప్రవేశాలపై టాస్క్‌ఫోర్స్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హైదరాబాద్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలల్లో నాణ్యతపై సర్కారు దృష్టిసారించింది. ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో వైద్యవిద్యతో పాటు వైద్య సౌకర్యాలను కూడా మరింత మెరుగుపరచాలని నిర్ణయించింది. అందుకోసం ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. ఈ మేరకు ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చోంగ్తు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో డిగ్రీ, పీజీ కోర్సుల ప్రవేశాల ప్రక్రియను ఈ టాస్క్‌ఫోర్స్ పర్యవేక్షించనుంది. వైద్యవిద్యా సంచాలకులు ఇందులో సభ్యకార్యదర్శిగా వ్యవహరించనున్నారు. డీఎంఈ (అకడమిక్), కాళోజీ హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్, గాంధీ, ఉస్మానియా వైద్య కళాశాలల ప్రిన్సిపాళ్లు సభ్యులుగా ఉంటారని జీవోలో సర్కారు పేర్కొంది. కాగా, ఈ నెల 12న 'వైద్యవిద్య ..నాణ్యత మిథ్య' పేరిట 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించింది. రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లో నాణ్యత లోపించిందని, అధ్యాపకుల కొరత ఉందని కథనంలో పేర్కొంది. 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం.. వెంటనే దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది.

వైద్యశాఖలో హెచ్‌వోడీ పోస్టులకు ఆర్థికశాఖ ఆమోదం

హైదరాబాద్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్యశాఖలో మూడు కీలక విభాగాధిపతుల పోస్టుల మంజూరుకు ఆర్థికశాఖ ఆమోదం తెలిపింది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రజారోగ్య సంచాలకులు, తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్, డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ పోస్టులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మూడు పోస్టుల మంజూరుకు ఇటీవలే మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. తాజాగా ఆర్థికశాఖ జీవో జారీ చేసింది. త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో డిపార్ట్‌మెంట్ ప్రమోషన్ కమిటీ(డీపీసీ) సమావేశమై.. హెచ్‌వోడీల జాబితాను ప్రభుత్వానికి పంపనుంది.

మహిళా కమిషన్ చైర్‌పర్సన్ పోస్టు ఖాళీ?!

» గత చైర్‌పర్సన్ వివరాలనే చూపిస్తున్న వెబ్‌సైట్

» కొత్త చైర్‌పర్సన్ బాధ్యతలు స్వీకరించి నెల రోజులు

హైదరాబాద్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో మహిళా కమిషన్ చైర్‌పర్సన్ పోస్టు ఖాళీగా ఉంది... అదేంటి... ప్రభుత్వం కొత్త చైర్‌పర్సన్‌ను నియమించింది కదా అనుకుంటున్నారా.. ? నిజమే కొత్త చైర్‌పర్సన్‌ను నియమించి నేటికి సరిగ్గా నెల రోజులు. కానీ ఇంతవరకూ తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ వెబ్‌సైట్‌లో కొత్త చైర్‌పర్సన్ పేరు, ఆమె ఫొటో, వివరాలను పొందుపర్చలేదు. దీంతో మహిళా కమిషన్ వెబ్‌సైట్‌ను సంప్రదించిన ప్రతిఒక్కరికీ కమిషన్ చైర్‌పర్సన్ పోస్టు ఖాళీగా ఉందంటూ(చైర్‌పర్సన్ ఆఫ్ ది కమిషన్ ప్రజెంట్- వేకెంట్) దర్శనమివ్వడం గమనార్హం. గతంలో (2020 డిసెంబరు 27 నుంచి 2023 అక్టోబరు 10 వరకు) వాకిటి సునీతాలక్ష్మారెడ్డి ఆ బాధ్యతల్లో ఉన్నారన్న వివరాలను మాత్రం పొందుపర్చారు. ప్రస్తుతం బాధ్యతల్లో ఉన్నవారి పేరు, వివరాలు పొందుపర్చకపోవడం గమనార్హం.

రుణమాఫీ పథకం బోగస్ :ఈటల

హైదరాబాద్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): రుణమాఫీ పథకాన్ని అమలు చేశామంటూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించుకోవడంలో అర్థం లేదని, అంతా బోగస్ అని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. రుణమాఫీపై ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాన్ని కాంగ్రెస్ నిలబెట్టుకోలేకయిందని విమర్శించారు. ఇప్పుడు సీఎంవో నుంచి విడుదల చేసిన రుణమాఫీ లబ్ధిదారుల జాబితాను కూడా నమ్మేట్టు లేదన్నారు. రుణమాఫీ పథకాన్ని సమగ్రంగా అమలు చేయకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికీ లక్షలాది మంది రైతులు ఆందోళనతో ఉన్నారని, వారికి తక్షణం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. లక్షలాది మంది రైతులకు రుణమాఫీ ఎగ్గొట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. హైడ్రా పేరుతో హైడ్రామా జరుగుతోందని ఈటల దుయ్యబట్టారు. దీనిని తక్షణం ఆపాలని డిమాండ్ చేశారు. ఎఫ్‌టీఎల్‌లో ఉన్న పట్టా భూముల్లో నిర్మాణాలను కూల్చవద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

28 ఆవాసగ్రామాల రోడ్లకు కేంద్రం గ్రీన్ సిగ్నల్

హైదరాబాద్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతాల్లోని మారుమూల ఆవాస గ్రామాలకు ప్రధానరోడ్ల సదుపాయం కల్పించాలన్న ప్రతిపాదనను కేంద్రం ఆమోదించడం హర్షణీయమని మంత్రి సీతక్క శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలి విడత 28 ఆవాస గ్రామాలకు 66.97 కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణానికి కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ పరిపాలన అనుమతులు మంజూరు చేస్తూ లేఖ పంపినట్లు మంత్రి చెప్పారు.

'ఆంధ్రజ్యోతి' జర్నలిస్ట్ కారుసాల వెంకటేష్‌కు మోటూరు హనుమంతరావు పురస్కారం

» 20న విజయవాడలో అవార్డు ప్రదానం

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ప్రజాశక్తి పూర్వ సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మారక ఉత్తమ జర్నలిస్టు పురస్కారానికి 'ఆంధ్రజ్యోతి' సీనియర్ రిపోర్టర్ కారుసాల వెంకటేష్ ఎంపికయ్యారు. తెలుగు రాష్ట్రాల్లోని పలు పత్రికలలో పనిచేస్తున్న జర్నలిస్టుల నుంచి ఎంట్రీలు రాగా.. మానవాసక్తి, సామాజిక ప్రయోజనం మేళవిస్తూ కథనాలు రాసిన, ఇంటర్వ్యూలు చేసిన వెంకటేష్‌ను అవార్డు కమిటీ ఎంపిక చేసినట్లు ప్రజాశక్తి సాహితీ సంస్థ ప్రధాన కార్యదర్శి ఎంవీఎస్ శర్మ శుక్రవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. సీనియర్ సంపాదకులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి.అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన అవార్డు కమిటీ ప్రతిపాదనలను పరిశీలించింది. ఈ నెల 20న విజయవాడలోని ఎంబీ విజ్ఞాన కేంద్రంలో జరిగే సభలో వెంకటేష్‌కు అవార్డును ప్రదానం చేయనున్నారు. 'ఆంధ్రజ్యోతి' నవ్యలో 'అప్పట్లో మా కోడ్ రాపన్స్'.. 'ఎమ్మెల్యే అయ్యాక కూడా చెప్పులు కుట్టేవారు'.. 'చొరబాటుదారులు అనడం అన్యాయం'.. శీర్షికలతో వెంకటేష్ (కలం పేరు సాంత్వన్) రాసిన కథనాలు మానవాసక్తి రేకెత్తించాయని అవార్డు కమిటీ అభిప్రాయపడింది. ప్రజాశక్తి సాహితీ సంస్థ 2002 నుంచి మోటూరు స్మారక అవార్డును అందజేస్తోంది.

బీజేపీలో బీఆర్ఎస్ విలీనం!

(మొదటిపేజీ తరువాయి)



అనుకూలంగా ఉంటే పార్లమెంటులో బిల్లు పెట్టి కేంద్రం ఆమోదించుకునేదని తెలిపారు. జాతీయ స్థాయిలో పాలసీ కావాలంటే కేంద్రమే నిర్ణయం తీసుకోవాలన్నారు. ఎస్సీ వర్గీకరణ అంశం చాన్నాళ్లుగా సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉండడంతో తాను సీఎంగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే ప్రముఖ న్యాయవాదులతో వాదనలు వినిపించామని చెప్పారు. మంత్రి దామోదర రాజనర్సింహ అధ్వర్యంలో క్యాబినెట్ సబ్‌కమిటీని ఏర్పాటు చేశామని, ఢిల్లీకి కూడా ప్రతినిధుల బృందాన్ని పంపామని తెలిపారు. వర్గీకరణ చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలోనే హామీ ఇచ్చామని, రాహుల్‌గాంధీ కూడా ప్రచారంలో చెప్పారని గుర్తు చేశారు. సుప్రీంకోర్టు తీర్పును తమ ప్రభుత్వం అధ్యయనం చేస్తోందన్నారు. ఎస్సీ వర్గీకరణ అనేది పొలిటికల్ రిజర్వేషన్ కాదని, ఉద్యోగాలు, పదోన్నతులకు సంబంధించింది మాత్రమేనని అన్నారు.

మా విధానాలు చెప్పేందుకే విదేశీ టూర్..

విదేశీ పర్యటనపై ప్రచారం చేసుకోవాల్సిన అవసరం లేదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. "రాష్ట్రంలో ప్రభుత్వం మారినందున.. పాలసీలో మార్పులు ఉంటాయేమోనన్న అనుమానాలుంటాయి. అందుకే మా పాలసీ ఇదీ అని చెప్పుకోవడానికే వెళ్లాం. పెట్టుబడులు పెట్టాలని కంపెనీ, బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ పాలసీ కింద తీసుకుంటే తప్ప పెట్టుబడులు రావు. మనం వెళ్లి ప్రభుత్వ విధానాలు ఏంటో వివరిస్తే వారు చర్చించుకుంటారు కదా! కలిసినోళ్లంతా, పెట్టుబడులు పెడతానన్నోళ్లంతా పెడతారనే గ్యారెంటీ లేదు. ఢిల్లీలో ఉన్నవాళ్లకే హైదరాబాద్‌లో ఏముందో తెలియదు. అమెరికాలో ఉన్న వాళ్లకి ఏం తెలుస్తుంది? ఇంకో రెండేళ్ల తర్వాతనైనా పెట్టుబడులు పెట్టాలనుకుంటే ఆలోచించుకుంటారు కదా!" అని సీఎం రేవంత్ అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధులు ఇవ్వకపోవడం మోదీ ఇష్టమని, తాను ప్రయత్నం మాత్రం చేస్తున్నానని చెప్పారు. తనకు అందరితోనూ వ్యక్తిగత సంబంధాలున్నాయన్నారు. ఏపీ సీఎం చంద్రబాబునాయుడు తనకు సహచరుడని, ఆయన ఒక మంచి నేత అని పేర్కొన్నారు. తాను రాజకీయంగా స్వయంగా ఎదిగానని రేవంత్‌రెడ్డి తెలిపారు.

పీసీసీ అధ్యక్షుడు ఎవరైనా మా మనిషే..

పీసీసీ అధ్యక్షుడి ఎంపికపై పార్టీ నిర్ణయం తీసుకోనంత వరకు తమ అభిప్రాయలు చెబుతామని, నియామకం జరిగిన తర్వాత.. ఎవరైనా తమ మనిషేనని స్పష్టం చేశారు. రైతు రుణమాఫీపై బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలపై సీఎం స్పందిస్తూ.. బీఆర్ఎస్ హయాంలో ఐదేళ్లలో నాలుగు వాయిదాలలో కూడా రుణమాఫీ పూర్తి చేయలేదని విమర్శించారు. రుణమాఫీ కాని రైతుల కోసం కలెక్టరేట్ కార్యాలయాల్లో కౌంటర్లు ఏర్పాటు చేశామని, రైతులు అక్కడి అధికారులను సంప్రదించాలని సూచించారు. బీజేపీ, బీఆర్ఎస్ వాళ్ల రోడ్డెక్కే బదులు గ్రీవెన్స్ సెల్‌లో సంప్రదించాలన్నారు. తమ వద్ద ఉన్న డేటా ప్రకారం రూ.26 వేల కోట్లు రైతు రుణమాఫీకి అవసరమని, కానీ.. అందరినీ దృష్టిలో ఉంచుకుని రూ.31 వేల కోట్లకు బడ్జెట్‌లో అప్రూవల్ ఇచ్చామని తెలిపారు. తనకున్న ప్రాధాన్యం ప్రకారం ఆగస్టు 15 లోపు రైతు రుణమాఫీ చేశానన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో రూ.20 వేల కోట్లు కూడా రుణమాఫీ చేయలేదని చెప్పారు. రైతు రుణమాఫీ చెల్లింపులతో ఇతర పథకాలకు ఎలాంటి కోత ఉండదని సీఎం స్పష్టం చేశారు. "కేసీఆర్ తనకు తోచింది చేసిండు. నచ్చిన కాంట్రాక్టర్లకు పైసలు ఇచ్చుకుంటు పోయిండు. కానీ, మేం అలా చేయడం లేదు. ప్రతి నెలా మొదటి రోజే ప్రభుత్వ ఉద్యోగుల జీతాలకు కోసం రూ.5 వేల కోట్లకు పైచిలుకు, లోన్ల కోసం రూ.6,500 కోట్లు బ్యాంకులకు చెల్లిస్తున్నాం. 2014లో ఏడాదికి రూ.6500 కోట్లు చెల్లిస్తే.. ఇప్పుడు నెలకు అంత డబ్బు కట్టాల్సి వస్తోంది" అని సీఎం చెప్పారు.

ఎవరికీ అన్యాయం చేయడం లేదు..

టీజీ న్యాబ్, హైడ్రా సమర్థంగా పనిచేస్తున్నాయని, హైడ్రాపై మొదట్లో కొన్ని విమర్శలు వచ్చాయని రేవంత్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో డ్రగ్స్‌ను అరికట్టడానికి తమ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని స్పష్టం చేశారు. ఏం చేసినా ఎవరో ఒకరి నుంచి వ్యతిరేకత వస్తుందని, తాను మాత్రం ఎవరికీ అన్యాయం చేయడంలేదని అన్నారు. వ్యవస్థలు సక్రమంగా పనిచేయాలని మాత్రమే చెబుతున్నానన్నారు. "రాజకీయ పార్టీలు మీడియా సంస్థలను స్థాపించుకున్న తర్వాత వారి ఇష్టారీతిన నడుపుకోవడానికి తప్పు.. మనం చెప్పడం అనవసరం, మనం చెప్పినదానికి ఉల్టాగా చేయడానికే అవి పనిచేస్తాయి" అని సీఎం వ్యాఖ్యానించారు. వరంగల్‌లో ఏర్పాటు చేసే రైతు రుణమాఫీ సభకు సంబంధించి రాహుల్‌గాంధీ అపాయిట్‌మెంట్‌ను ఫోన్లలోనైనా ఓకే చేసుకోవచ్చన్నారు. రాజ్యసభ అభ్యర్థిగా అభిషేక్ సింఘ్వీ పట్ల బీఆర్ఎస్ విమర్శలపై సీఎం స్పందిస్తూ.. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు ఢిల్లీలో ప్రత్యేక ప్రతినిధిగా ఉత్తరాది వ్యక్తికి, మీడియా సలహాదారుగా ప్రభుత్వంలో మహారాష్ట్ర వ్యక్తికి పదవులు ఇచ్చిన విషయం మర్చిపోయారా? అని ప్రశ్నించారు. కేసీఆర్ పంటి, కంటి నొప్పికి ఢిల్లీకి వచ్చేవారని, తెలంగాణలో వైద్యులు లేరా? అని నిలదీశారు. వి.హనుమంతరావు అసలు సిసలైన కాంగ్రెస్ నేత అని రేవంత్‌రెడ్డి అన్నారు. కేసీఆర్, జగన్ ప్రతిపక్ష నేతలను అణగదొక్కి.. ప్రజలిచ్చిన ఉద్యోగాలను కోల్పోయారన్నారు.

మా కుటుంబసభ్యులకు ఏ పదవీ ఇవ్వలేదు..

తమది 150 మంది తోబుట్టువులతో కూడిన పెద్ద కుటుంబం అని, అందులో సగం మందికి పైగా బంధువులు అమెరికాలో ఉన్నారని రేవంత్‌రెడ్డి తెలిపారు. తన కుటుంబ సభ్యులకు ప్రభుత్వంలో గానీ, కాంగ్రెస్ పార్టీలో గానీ చిన్న పదవి కూడా ఇవ్వలేదని చెప్పారు. "నా కుటుంబం అసలు తెలంగాణలో పెట్టుబడి పెట్టొద్దు అంటారు. ఆయనకు మెంటలా? 2000 సంవత్సరం తర్వాత కేటీఆర్ అమెరికా వెళ్లారు. కానీ, నా బ్రదర్స్ 1992, 93లోనే అక్కడ ఉన్నారు" అని అన్నారు. తాము ఏడుగురం సొంత అన్నదమ్ములమని, తాను సీఎంను అయితే.. మిగతా వాళ్ల అన్ని దందాలు బంద్ చేసుకొని కూర్చోవాలా? అని ప్రశ్నించారు. తన సోదరుడి మిత్రుడు గడ్డితో ఇథనాల్ చేయడంలో పేటెంట్ పొందారని, ఆయన హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. హైదరాబాద్‌లో పెట్టుబడులు పెడితే బీఆర్ఎస్‌కు వచ్చే ఇబ్బందేంటని ప్రశ్నించారు. తమ ప్రభుత్వం ఎవరికీ అప్పనంగా ఆస్తులు ఇవ్వడం లేదని చెప్పారు. రాజకీయాల్లో లేనప్పుడు తాను రూ.70 లక్షల ఖరీదైన ఫోన్ వాడానని, ఇప్పుడు ఆ ఫోన్ ఖరీదు రూ.కోటి ఉంటుందని అన్నారు. కేసీఆర్ సొంత విమానం కొనుక్కోవచ్చు కానీ, తాను ఖరీదైన చెప్పులు కొనుక్కోవద్దా? అని ప్రశ్నించారు.



ఢిల్లీలో సీఎం రేవంత్‌ను కలిసిన ఫాక్స్‌కాన్ ప్రతినిధి బృందం

ఫోర్త్ సిటీలో ఫాక్స్‌కాన్!

» మరో ప్లాంటును ఏర్పాటు చేసే యోచనలో సంస్థ

» సీఎం రేవంత్‌రెడ్డితో ఫాక్స్‌కాన్ చైర్మన్ భేటీలో చర్చ


» ఫోర్త్ సిటీ రూపకల్పనలో మీ విజన్ అద్భుతం

» త్వరలోనే హైదరాబాద్‌ను సందర్శిస్తా: యాంగ్ లియూ

హైదరాబాద్/న్యూఢిల్లీ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ పారిశ్రామిక దిగ్గజ సంస్థ 'ఫాక్స్‌కాన్'.. తెలంగాణలో తన కార్యకలాపాలను మరింత విస్తరించనున్నట్లు తెలిసింది. ఇప్పటికే కొంగరకలాన్ వద్ద ఆ సంస్థకు సంబంధించిన ఓ ప్లాంటు సిద్ధమవుతుండగా.. అదనంగా మరో ప్లాంటును ఏర్పాటు చేసే యోచనలో ఉందని సమాచారం. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతోంది. ఫాక్స్‌కాన్ చైర్మన్ యంగ్ లియూ నేతృత్వంలోని సంస్థ ప్రతినిధి బృందం శుక్రవారం ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశమైంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో కార్యకలాపాల విస్తరణపై ఇరువురి మధ్య చర్చ జరిగినట్లు తెలిసింది. యాపిల్ సంస్థ ఐఫోన్లకు సంబంధించిన ఎయిర్‌పాడ్స్, ఇతర యాక్ససరీస్‌ను ఫాక్స్‌కాన్ సంస్థ తయారు చేస్తుంటుంది. గత ఏడాది హైదరాబాద్‌లో ప్లాంటు ఏర్పాటుకు ఈ సంస్థ ముందుకురాగా.. ప్రభుత్వం నగర శివార్లలోని కొంగరకలాన్ వద్ద 120 ఎకరాల భూమిని కేటాయించింది. అందులో 16 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంతో భవనాన్ని నిర్మిస్తున్నారు. ఈ నిర్మాణ పనులు చివరి దశకు వచ్చాయి. ఇది అందుబాటులోకి వస్తే.. యాపిల్ సంస్థకు అవసరమైన ఎయిర్‌పాడ్స్, ఇతర యాక్ససరీస్‌ను తయారు చేయడాన్ని మొదలుపెడతారు. ఈ సంస్థ భవనాన్ని కూడా సీఎం రేవంత్‌రెడ్డి త్వరలో ప్రారంభించే అవకాశాలున్నాయి. దీనికి విస్తరణగా.. ముచ్చర్లలోని ఫోర్త్ సిటీలో మరో ప్లాంటును ఏర్పాటు చేసే యోచనలో ఫాక్స్‌కాన్ ఉన్నట్లు తెలిసింది. ఇదే విషయమై సీఎం రేవంత్‌రెడ్డితో ఆ సంస్థ చైర్మన్ యంగ్ లియూ చర్చించారని సమాచారం. ఫోర్త్ సిటీలో తమకు 500 ఎకరాలకు పైగా భూమిని కేటాయించాలని ఆయన అడిగినట్లు తెలిసింది. అందులో 64 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంతో భవనాలను నిర్మిస్తామని చెప్పినట్లు సమాచారం.

మీ దార్శనికత అద్భుతం..

తెలంగాణలో ఫోర్త్ సిటీ రూపకల్పన తీరు, రాష్ట్ర ప్రభుత్వ పారిశ్రామిక అనుకూల విధానాలు ఆకట్టుకునేలా ఉన్నాయని ఫాక్స్‌కాన్ చైర్మన్ యాంగ్ లియూ అన్నారు. ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి విజన్ అద్భుతంగా ఉందని ప్రశంసించారు. సీఎం రేవంత్‌రెడ్డితో భేటీలో ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌కు ఇండస్ట్రీ, సర్వీస్ రంగాల్లో విస్తరించే సత్తా ఉందని, త్వరలోనే తన బృందంతో కలిసి నగరాన్ని సందర్శిస్తానని తెలిపారు. అంతకుముందే తమ చీఫ్ క్యాంపస్ ఆపరేషన్స్ ఆఫీసర్ క్యాథీ యాంగ్, సంస్థ భారతదేశ ప్రతినిధి వీ లీ నేతృత్వంలోని బృందం హైదరాబాద్‌కు వస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా హైదరాబాద్ చరిత్ర, పారిశ్రామిక సంస్థల విస్తరణకు ఉన్న అనుకూలత, అద్భుతమైన వాతావరణ పరిస్థితులను ఫాక్స్‌కాన్ బృందానికి ముఖ్యమంత్రి వివరించారు. 430 ఏళ్ల క్రితం పునాది రాయి పడిన హైదరాబాద్.. కాలక్రమంలో మూడు నగరాలుగా అభివృద్ధి చెందిన తీరును తెలియజేశారు. ఆ అభివృద్ధిని మరింతగా పరుగులు పెట్టించేందుకే తాము ప్రస్తుత ప్రపంచ అవసరాలకు తగినట్లు ఫ్యూచర్ సిటీ పేరుతో నాలుగో నగరానికి (ఫోర్త్ సిటీ) రూపకల్పన చేస్తున్నామని చెప్పారు. ఇందులో ప్రముఖ పారిశ్రామికవేత్తలను భాగస్వాములను చేస్తున్నామని పేర్కొన్నారు. అందులో భాగంగానే యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ చైర్మన్‌గా ఆనంద్ మహీంద్రాను, వైస్ చైర్మన్‌గా మరో పారిశ్రామికవేత్త శ్రీనివాస రాజును నియమించామని తెలిపారు. ఫోర్త్ సిటీలో ఫాక్స్‌కాన్ సంస్థ పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు అవసరమైన అన్ని అనుమతులు, మద్దతు ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శులు జయేశ్ రంజన్ తదితరులు పాల్గొన్నారు.



జత చేయని పత్రాలను అప్‌లోడ్ చేయండి

» ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులకు అవకాశం

» 75 శాతం దరఖాస్తులు అసంపూర్తిగానే..

» కార్పొరేషన్లు, మునిసిపాలిటీలు, కలెక్టరేట్లలో హెల్ప్ డెస్కులు

» ఇప్పటికి 60,213 దరఖాస్తుల ఆమోదం

» ఫీజు కింద వచ్చిన ఆదాయం 96.6 కోట్లు

హైదరాబాద్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్)కు దరఖాస్తు చేసిన సందర్భంగా జత చేయని పత్రాలను తిరిగి అప్‌లోడ్ చేసేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ మేరకు సమాచారం అందుకున్న దరఖాస్తుదారులు పూర్తి వివరాలతో మరోసారి దరఖాస్తు చేసుకోవాలని పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దానకిశోర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల్లో 75 శాతం దరఖాస్తులకు పూర్తి స్థాయిలో పత్రాలను జత చేయలేదని, ఆయా పత్రాలను తిరిగి అప్‌లోడ్ చేసేందుకు దరఖాస్తుదారులకు అవకాశం కల్పించామన్నారు. ఎల్ఆర్ఎస్ పోర్టల్‌లో ఈ మేరకు అప్‌లోడ్ చేసేందుకు వెసులుబాటు కల్పించామని తెలిపారు. దరఖాస్తుతోపాటు సేల్ డీడ్, ఈసీ, మార్కెట్ విలువ సర్టిఫికెట్, లేఅవుట్ కాపీ వంటి పత్రాలను జత చేసి అప్‌లోడ్ చేయాలని పేర్కొన్నారు. దరఖాస్తుదారులు తమ మొబైల్ నంబరు, చిరునామా లేదా దరఖాస్తు వివరాలను మొబైల్‌కు వచ్చే ఓటీపీ ద్వారా సవరించుకోవచ్చని సూచించారు. సందేహాల నివృత్తి కోసం మునిసిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో, జిల్లా కలెక్టరేట్లలో హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేశారని తెలిపారు. ఇప్పటి వరకు 60,213 దరఖాస్తులను ఆమోదించినట్లు దానకిశోర్ తెలిపారు. ఫీజు కింద రూ.96.60 కోట్ల ఆదాయం సమకూరిందన్నారు. కాగా 2020 ఆగస్టు 31 నుంచి అక్టోబరు 31 వరకు గత ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను స్వీకరించింది. రాష్ట్రంలోని అన్ని పంచాయతీలు, మునిసిపాలిటీలు, కార్పొరేషన్ల నుంచి దాదాపు 25.70 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. హెచ్ఎండీఏ పరిధిలో 3.58 లక్షల దరఖాస్తులు, జీహెచ్ఎంసీ పరిధిలో 1.06 లక్షలు, మునిసిపల్ కార్పొరేషన్లు, మునిసిపాలిటీల నుంచి 13.69 లక్షలు, గ్రామ పంచాయతీల నుంచి 6 లక్షల దరఖాస్తులు, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల నుంచి 1.35 లక్షల దరఖాస్తులు అందాయి. గత నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులకు మూడు నెలల్లో మోక్షం లభించే అవకాశం ఉంది. ఎల్ఆర్ఎస్ ప్రక్రియ పూర్తయితే ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ.10 వేల కోట్లు జమ అవుతాయని అంచనా.

ఖర్గేతో సీఎం రేవంత్ భేటీ

» పీసీసీ చీఫ్, నామినేటెడ్ పదవులపై చర్చ

» రేవంత్‌రెడ్డిని కలిసిన అభిషేక్ సింఘ్వీ

న్యూఢిల్లీ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో సమావేశమయ్యారు. దాదాపు గంటకుపైగా జరిగిన ఈ భేటీలో రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితులు చర్చకు వచ్చినట్లు తెలిసింది. రూ.2 లక్షల వరకు రైతు రుణమాఫీ అంశంతోపాటు తన విదేశీపర్యటన గురించి ఖర్గేకు రేవంత్ వివరించినట్లు సమాచారం. వరంగల్‌లో జరిగే రైతు రుణమాఫీ సభకు సంబంధించి సోనియా, రాహుల్‌గాంధీ రాకపై చర్చించినట్లు సన్నిహిత వర్గాలు తెలిపాయి. రాష్ట్ర సచివాలయం ఎదుట రాజీవ్‌గాంధీ విగ్రహావిష్కరణ అంశాన్ని కూడా ఖర్గే దృష్టికి సీఎం తీసుకెళ్లినట్లు సమాచారం. పీసీసీ అధ్యక్ష నియమాకంతోపాటు నామినేటెడ్ పదవుల భర్తీ అంశంపైనా చర్చించినట్లు తెలిసింది. అనంతరం కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌ను సీఎం రేవంత్ మర్యాదపూర్వకంగా కలిశారు. అంతకుముందు.. తెలంగాణ నుంచి రాజ్యసభకు కాంగ్రెస్ అభ్యర్థిగా ఎంపికైన అభిషేక్ మను సింఘ్వీ.. రేవంత్‌రెడ్డిని కలుసుకున్నారు. ఇదిలా ఉండగా.. క్యాబినెట్ విస్తరణపై చర్చించేందుకే తాను ఢిల్లీకి వచ్చానన్న వార్తలను సీఎం రేవంత్ ఖండించారు. క్యాబినెట్ విస్తరణ మీడియా సృష్టేనని కొట్టిపారేశారు. తాను ఫాక్స్‌కాన్ చైర్మన్ యంగ్ లియూతో భేటీ కోసమే ఢిల్లీ వచ్చినట్లు చెప్పారు. క్యాబినెట్ విస్తరణపై చర్చించేందుకు వస్తే కీలక నేతలు కూడా వచ్చేవారు కదా! అని వ్యాఖ్యానించారు. కాగా, రాత్రి 10 గంటలకు సీఎం రేవంత్ హైదరాబాద్‌కు తిరుగు పయనమయ్యారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పని చేసిన కోట్ల విజయభాస్కర్‌రెడ్డి నీతి నిజాయితీలకు ప్రతిరూపమని సీఎం రేవంత్‌రెడ్డి కొనియాడారు. శుక్రవారం కోట్ల విజయభాస్కర్ రెడ్డి జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో సీఎం రేవంత్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.



రేవంత్‌రెడ్డిని కలిసిన అభిషేక్ మను సింఘ్వీ

మాఫీ పెండింగ్ ఖాతాలపై స్పెషల్ డ్రైవ్

5 అంశాలపై ఫిర్యాదుల నమోదు.. ఏవోలకు కీలక బాధ్యతలు

హైదరాబాద్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): రుణమాఫీకి అన్ని అర్హతలూ ఉండి.. మాఫీ కాని రైతులకు న్యాయం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నడుంబిగించింది. రేషన్ కార్డులు లేకపోవడం ద్వారా కుటుంబ నిర్ధారణ కాకపోవడం.. ఆధార్ కార్డుల్లో తప్పులుండటం.. బ్యాంకు-ఆధార్ వివరాల్లో తేడాలుండటం.. పట్టాదారు పాస్ పుస్తకం లేకపోవటం.. అసలు-వడ్డీ లెక్కల్లో తేడాలు ఉండటం కారణంగా చాలామంది రైతులకు రుణమాఫీ కాలేదని గుర్తించి స్పెషల్ డ్రైవ్‌కు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు గత జూలై 15న జారీచేసిన జీవో నంబరు 567కు అనుబంధంగా రాష్ట్ర వ్యవసాయశాఖ శుక్రవారం ఒక సర్క్యులర్ జారీచేసింది. ఫిర్యాదుల నమోదు, పరిష్కారానికి కొన్ని మార్గదర్శకాలు, సూచనలు జారీచేసింది. ఈ స్పెషల్ డ్రైవ్ చేపట్టే బాధ్యతను మండల వ్యవసాయ అధికారులకు (ఎంఏవో) అప్పగిస్తూ వ్యవసాయశాఖ డైరెక్టర్ డాక్టర్ గోపి ఆదేశాలు జారీచేశారు. ఆదేశాల్లో భాగంగా.. ఏవోలు రైతుల ఇంటింటికి తిరిగి ఫిర్యాదులు స్వీకరించాలి. తప్పులు సరిచేసి క్రాప్ లోన్ వీవర్ (సీఎల్ డబ్ల్యూ) పోర్టల్ www.clw.telangana.gov.in లో నమోదుచేయాలి. ప్రతిరోజు సాయంత్రం 5 గంటలకు జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయానికి మండలాల వారీగా ఫిర్యాదుల సంఖ్య, రోజువారీ నివేదిక పంపించాలని ఆదేశాలు జారీ చేశారు. ఆధార్ కార్డు తప్పుగా ఉంటే... రైతుల వద్దకు వెళ్లి ఆధార్ కాపీ మళ్లీ తీసుకోవాలి. పోర్టల్‌లో సరైన ఆధార్ కాపీని అప్‌లోడ్ చేయాలి. ఓటరు కార్డు, వాహన లైసెన్సు, రైతు రేషన్ కార్డు లాంటి ప్రత్యామ్నాయ గుర్తింపు పత్రాలను రైతుల నుంచి సేకరించి పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి. రేషన్ కార్డు లేక కుటుంబ నిర్ధారణ కాకపోతే.. మండల వ్యవసాయ అధికారి రైతుల ఇంటికి వెళ్లాలి. రైతు వెల్లడించిన ఆధార్ కాపీలు, కుటుంబసభ్యుల సంఖ్యను తప్పనిసరిగా తీసుకోవాలి. రైతు కుటుంబాన్ని నిర్ధారించి వివరాలను పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి. రైతుకు పట్టాదారు పాస్‌బుక్ లేదని పోర్టల్‌లో చూపిస్తే... రైతు నుంచి పట్టాదార్ పాస్‌బుక్ తీసుకొని పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి. ఆధార్ పేరు, లోన్ ఖాతా పేరు మధ్య లోపాలుంటే.. ఆధార్ కార్డులో రైతు పేరు, లోన్ ఖాతాలో పేరు మధ్య లోపాలు, అసమతుల్యత ఉన్న సందర్భాల్లో రుణం తీసుకున్న వ్యక్తి గుర్తింపును నిర్ధారణ చేయాలి. రుణం తీసుకున్న వ్యక్తి సరైన ఆధార్ నంబరును పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి. అసలు, వడ్డీ మొత్తం లెక్కల్లో తేడాలొస్తే రైతు నుంచి ఒక దరఖాస్తును తీసుకోవాలి. అప్పు ఎంత తీసుకున్నారు? ఎప్పుడు తీసుకున్నారు? వడ్డీ ఎంత అయింది? అసలు- వడ్డీ కలిపి ఎంత అయింది? అనే వివరాలను పేర్కొంటూ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి. నిర్ధారణ, దిద్దుబాటు కోసం సంబంధిత బ్యాంకులకు వివరాలను పంపించాలి.

2 లక్షలకు మించినవారికి 4వ విడతలో

రుణమాఫీలో భాగంగా ఇక రూ. 2 లక్షలకు మించి బకాయిలు ఉన్న రైతులకు గరిష్ఠంగా రూ.2లక్షల వరకు నాలుగో విడతలో మాఫీచేస్తారని తెలిసింది. రూ.2 లక్షల కంటే ఎక్కువ బాకీ ఉంటే.. ఆ ఎక్కువ ఉన్న మొత్తాన్ని రైతులు తొలుత చెల్లించాలి. ఆ తర్వాత ప్రభుత్వం రూ.2 లక్షలను మాఫీ చేస్తుంది. అయితే రైతులు 2 లక్షలకు మించి ఉన్న మొత్తాన్ని ఎప్పటిలోగా చెల్లించాలి? అనే విషయంలో స్పష్టతనివ్వలేదు. దీనిపై క్యాబినెట్‌లో చర్చించినిర్ణయం తీసుకుంటారని సమాచారం.

20న రాష్ట్రానికి రాహుల్?

» సచివాలయం ముందున్న రాజీవ్‌గాంధీ విగ్రహావిష్కరణలో పాల్గొనే అవకాశం

» వరంగల్ సభపై రాని స్పష్టత

హైదరాబాద్, వరంగల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఈ నెల 20న రాష్ట్రానికి వచ్చే అవకాశమున్నట్లు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం సచివాలయం ముందు ఏర్పాటు చేసిన రాజీవ్ గాంధీ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొంటారని కాంగ్రెస్‌వర్గాలు పేర్కొంటున్నాయి. 20న రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఆయన విగ్రహావిష్కరణకు, వరంగల్‌లో నిర్వహించతలపెట్టిన సభకు హాజరవ్వాలని ఢిల్లీ వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి.. రాహుల్‌గాంధీని ఆహ్వానించారని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కాగా శుక్రవారం విగ్రహావిష్కరణ పనులను మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్‌తోపాటు సీఎం సలహాదారు వేం.నరేందర్ రెడ్డి పరిశీలించారు. విగ్ర హ ప్రాంగణంలో మిగిలిన పనులను త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఇక రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేసిన క్రమంలో వరంగల్‌లో రైతు కృతజ్ఞత సభను ఈ నెలలో నిర్వహించేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమవుతున్నట్లు సమాచారం. అయితే దీన్ని నిర్వహించే తేదీపై స్పష్టత రాలేదు. ఈ నెల 20న సభను నిర్వహించాలని భావిస్తున్నారు. లేకపోతే ఈ నెల 24న నిర్వహించాలనుకుంటున్నట్లు తెలిసింది. గతేడాది అసెంబ్లీ ఎన్నికల సమయంలో వరంగల్‌లోని ఆర్ట్స్ కాలేజీ మైదానంలో కాంగ్రెస్ రైతు డిక్లరేషన్ సభను నిర్వహించింది. ఆ సభకు ముఖ్య అతిథిగా వచ్చిన రాహుల్ గాంధీ.. తమ పార్టీ అధికారంలోకి వస్తే అర్హులైన రైతులకు రూ.2లక్షల వరకు రుణమాఫీ చేస్తుందని ప్రకటించారు. అనంతరం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. రైతులకు ఇచ్చిన హామీ మేరకు ఆగస్టు 15 నాటికి రూ.2లక్షల రుణాలను మాఫీ చేసింది. ఈ క్రమంలో శుక్రవారం ఢిల్లీ పర్యటనకు వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్‌లో నిర్వహించే సభకు రావాల్సిందిగా ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్, సోనియా, ఖర్గేలను ఆహ్వానించినట్లు సమాచారం. వారి నుంచి సానుకూల వ్యక్తమైనట్లు తెలుస్తోంది. అయితే సభ తేదీ అధికారికంగా ఖరారు కాలేదని పార్టీ నాయకులు చెబుతున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.


JOS ALUKKAS
A TRADITION OF FINE JEWELLERY
స్వాగతం
బ్రహ్మాండమైన సరికొత్త
ఆభరణాల షోరూమ్‌కి
వరంగల్
హనుమకొండ,
నక్కలగుట్టలో
ప్రారంభోత్సవం ఈరోజు ఉ.11.00లకు
జోస్ ఆలుక్కాస్ అద్భుతమైన ఆభరణాల షాపింగ్ అనుభవానికి మిమ్మల్ని హృదయపూర్వకంగా ఆహ్వానిస్తోంది.
బంగారు ఆభరణాలు, వజ్రాభరణాలు, ప్లాటినం మరియు వెండి ఆభరణాల బ్రహ్మాండమైన కలెక్షన్‌ల నుంచి షాపింగ్ చేసి ఆనందించండి.
ప్రారంభోత్సవ ప్రత్యేక ఆఫర్
ఉచితం
బంగారు
నాణెం
రూ.60,000
విలువగల
బంగారు ఆభరణాలు మరియు
వజ్రాల కొనుగోలుపై
ఆఫర్ ఆగస్టు 17 - 21 వరకు మాత్రమే
INAUGURATION
Naini Rajender Reddy
(MLA - Warangal West)
CHIEF GUEST
Gundu Sudharani
Ex-MP, GWMC Mayor
CELEBRITY GUEST
Keerthy Suresh
Chairman
JOS ALUKKA
Managing Directors, Jos Alukkas Group
VARGHESE ALUKKA
PAUL J. ALUKKA
JOHN ALUKKA
వివాహ ఆభరణాల కొనుగోలుపై ప్రత్యేక తగ్గింపు
వజ్రాలపై
20%
తగ్గింపు
ప్లాటినంపై
7%
తగ్గింపు
మీ పాత బంగారు ఆభరణాలను
HUID బంగారు ఆభరణాలకు
ఎక్స్‌ఛేంజ్ చేసుకోండి అధిక లాభాలతో
ఉచిత బహుమతి
ప్రతి కొనుగోలుపై
Push360
JOS ALUKKAS
CELEBRATES
60
ANNIVERSARY
6
కోట్ల
విలువైన
బహుమతులు
మెగా బంపర్ బహుమతులు*
6 కార్లు
వీక్లీ బహుమతులు*
గృహోపకరణాలు & బంగారు నాణేలు
లక్కీ డ్రా ద్వారా
WARANGAL: Nakkala Gutta, Hanamkonda. Ph: 70757 05916, 70757 75916. Shop online at www.josalukkasonline.com
TELANGANA | ANDHRA PRADESH | KARNATAKA | TAMIL NADU | PUDUCHERRY | KERALA
జోస్ ఆలుక్కాస్

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
హైదరాబాద్ ● శనివారం 17 ఆగస్టు 2024
diksuchi@andhrajyothy.co

ఆంధ్ర యూనివర్సిటీలో

డిస్టెన్స్, ఆన్‌లైన్ కోర్సులు

విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీకి చెందిన సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్(ఏయూ-సీడీఓఈ) ఆధ్వర్యంలోని స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్(ఎస్‌డీఈ)- ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్, ఆన్‌లైన్ మోడ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. అడ్మిషన్ తీసుకున్న అభ్యర్థులకు సంబంధిత స్టడీ మెటీరియల్ అందిస్తారు. ప్రోగ్రామ్‌లకు నిర్దేశించిన సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.



అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులు

- బీఏ, బీకాం, బీఎస్సీ డిగ్రీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఆరు సెమిస్టర్లు ఉంటాయి. బీఎస్సీ ప్రోగ్రామ్‌ను ఇంగ్లీష్ మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది. మిగిలినవాటిని ఇంగ్లీష్, తెలుగు మాధ్యమాల్లో చదువుకోవచ్చు.
- **బీఎస్సీ గ్రూప్ సబ్జెక్టులు:** మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, స్టాటిస్టిక్స్, బోటనీ, జువాలజీ
- **అర్హత:** బీఏ, బీకాం కోర్సులకు ఏదేని గ్రూప్‌తో ఇంటర్/రెండేళ్ల ఐటీఐ/పాలిటెక్నిక్ డిప్లొమా ఉత్తీర్ణులు; వెటర్నరీ/అగ్రికల్చర్ డిప్లొమా పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఏపీఓఎస్/ఎన్ఐఓఎస్ అభ్యర్థులు కూడా అర్హులే. బీఎస్సీ(ఎంపీసీ/ఎంపీసీఎస్/ఎంస్టాట్‌సీఎస్) కోర్సులకు పాలిటెక్నిక్ డిప్లొమా/ఇంటర్(ఎంపీసీ)ఉత్తీర్ణులు; మేథమెటిక్స్‌లో బ్రిడ్జ్ కోర్సు పూర్తిచేసిన ఒకేషనల్ అభ్యర్థులు అర్హులు. బీఎస్సీ(సీబీజడ్) కోర్సుకు ఇంటర్(బైపీసీ)/డిప్లొమా(వెటర్నరీ/అగ్రికల్చర్) ఉత్తీర్ణులు; సైన్స్‌లో బ్రిడ్జ్ కోర్సు పూర్తిచేసిన ఒకేషనల్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులు

- ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఎంబీఏ, ఎంసీఏ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్‌లను ఇంగ్లీష్ మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది.
- **ఎంఏ స్పెషలైజేషన్‌లు:** తెలుగు, ఇంగ్లీష్, ఎకనామిక్స్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, హిస్టరీ, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్స్, ఫిలాసఫీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, మేథమెటిక్స్
- **ఎమ్మెస్సీ స్పెషలైజేషన్‌లు:** సైకాలజీ, మేథమెటిక్స్, బోటనీ, ఫిజిక్స్, ఆర్గానిక్ కెమిస్ట్రీ, జువాలజీ
- **ఎంబీఏ స్పెషలైజేషన్‌లు:** హెచ్ఆర్ఎం, ఫైనాన్స్, మార్కెటింగ్
- **అర్హత:** ఎంసీఏలో ప్రవేశానికి బీటెక్(సీఎస్ఈ)/బీసీఏ ఉత్తీర్ణులు; ఇంటర్ స్థాయిలో మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివి బీఎస్సీ/బీకాం/బీఏ పూర్తిచేసినవారు; బీఏ/బీకాం ఉత్తీర్ణతతోపాటు ఏయూ నుంచి పీజీడీసీఏ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. మిగిలిన ప్రోగ్రామ్‌లకు ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. (ఎంఏ/ఎమ్మెస్సీ)(మేథమెటిక్స్), ఎమ్మెస్సీ(బోటనీ/ఫిజిక్స్/ఆర్గానిక్ కెమిస్ట్రీ/జువాలజీ), ఎంఏ(హిందీ) ప్రోగ్రామ్‌లకు మాత్రం డిగ్రీ స్థాయిలో సంబంధిత స్పెషలైజేషన్ సబ్జెక్ట్ చదివి ఉండాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **ప్రింట్ మెటీరియల్ కోసం చెల్లించాల్సిన ఫీజు:** సెమిస్టర్‌కు రూ.600
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 31
- **వెబ్‌సైట్:** www.andhrauniversity-sde.com

రిమైండర్స్

సెస్‌లో పీహెచ్‌డీ



విభాగాలు: ఎకనామిక్స్ సోషియాలజీ/ఆంత్రోపాలజీ/సోషల్ వర్క్, డెవలప్‌మెంట్ స్టాటిస్టిక్స్ పొలిటికల్ సైన్స్/పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, కామర్స్/బిజినెస్ మేనేజ్‌మెంట్

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సంబంధిత స్పెషలైజేషన్‌తో పీజీ పూర్తిచేసి ఉండాలి. కనీసం 55 శాతం మార్కులు ఉండాలి. యూజీసీ జేఆర్ఎఫ్/యూజీసీ నెట్ అర్హత తప్పనిసరి.

బేగంపేట(హైదరాబాద్)లోని సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్(సెస్)- పీహెచ్‌డీ ప్రోగ్రామ్ ఇన్ డెవలప్‌మెంట్ స్టడీస్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ప్రోగ్రామ్‌నకు నిజామాబాద్‌లోని తెలంగాణ యూనివర్సిటీ సహకారం అందిస్తోంది. మొత్తం 12 సీట్లు ఉన్నాయి. రీసెర్చ్ ప్రపోజల్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. తెలంగాణ ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్లు వర్తిస్తాయి. స్థానికేతరులకు హాస్టల్ సౌకర్యం ఉంది. అర్హులైన అభ్యర్థులకు ఫైనాన్షియల్ అసిస్టెన్స్/ఫెలోషిప్స్ అందిస్తారు.

ప్రోగ్రామ్ వివరాలు: ప్రోగ్రామ్ వ్యవధి ఆరేళ్లు. మొదటి ఏడాది రెండు సెమిస్టర్లు ఉంటాయి. వీటిలో కోర్సు వర్క్‌లు ఉంటాయి. మొదటి సెమిస్టర్‌లో రీసెర్చ్ మెథడాలజీ, పర్‌స్పెక్టివ్స్ అండ్ పారాడైమ్స్ ఆఫ్ డెవలప్‌మెంట్, ఫండమెంటల్స్ ఆఫ్ ఎకనామెట్రిక్స్/డెవలప్‌మెంట్ స్టాటిస్టిక్స్ పేపర్లు; రెండో సెమిస్టర్‌లో ఇండియాస్ డెవలప్‌మెంట్ డిబేట్, అప్లయిడ్ ఎకనామెట్రిక్స్/అప్లయిడ్ స్టాటిస్టిక్స్, పారాడైమ్స్ ఇన్ సోషల్ సైన్సెస్ పేపర్లు ఉంటాయి. ఈ రెండు సెమిస్టర్లు పూర్తయిన తరవాత అభ్యర్థులు ప్రీ పీహెచ్‌డీ టెస్ట్ రాయాల్సి ఉంటుంది. ఇందులో కనీసం 50 శాతం మార్కులు సాధించినవారిని మాత్రమే పీహెచ్‌డీ రిజిస్ట్రేషన్‌కు అనుమతిస్తారు. పీహెచ్‌డీలో చేరినవారు అయిదేళ్లపాటు రీసెర్చ్/థీసిస్ వర్క్ చేయాల్సి ఉంటుంది.

ఎంపిక: అభ్యర్థులు దరఖాస్తుతోపాటు కనీసం 1500 పదాలతో రీసెర్చ్ ప్రపోజల్ సబ్మిట్ చేయాలి. దీని ఆధారంగానే అభ్యర్థులను షార్ట్‌లిస్ట్‌చేసి పర్సనల్ ఇంటర్వ్యూకి పిలుస్తారు. రీసెర్చ్ ప్రపోజల్ సబ్మిట్ చేయనివారి దరఖాస్తులను పరిశీలించరు.

- యూజీసీ జేఆర్ఎఫ్ అర్హత ఉన్నవారికి పర్సనల్ ఇంటర్వ్యూలో సాధించిన స్కోర్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. యూజీసీ నెట్ అర్హత ఉన్నవారికి నెట్ స్కోర్‌కు 70 శాతం, ఇంటర్వ్యూ స్కోర్‌కు 30 శాతం వెయిటేజీ ఉంటుంది.

ముఖ్యసమాచారం

- **దరఖాస్తు:** రూ.1000
- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** ఆగస్టు 20
- **పర్సనల్ ఇంటర్వ్యూలు:** ఆగస్టు 30
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** సెప్టెంబరు రెండో వారంలో
- **చిరునామా:** డీన్, డివిజన్ ఆఫ్ గ్రాడ్యుయేట్ స్టడీస్, సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్, నిజామియా అబ్జర్వేటరీ క్యాంపస్, బేగంపేట్, హైదరాబాద్-500016.
- **వెబ్‌సైట్:** www.cess.ac.in

నార్త్ రైల్వేలో అప్రెంటిస్‌లు

ఖాళీలు: 4,096

న్యూఢిల్లీలోని రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్(ఆర్ఆర్‌సీ)-నార్త్ రైల్వే... ఎన్ఆర్ పరిధిలోని డివిజన్/వర్క్‌షాప్/యూనిట్లలో అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

ఆర్ఆర్‌సీ వర్క్‌షాప్‌లు: క్లస్టర్ లఖ్‌నవూ, క్లస్టర్ అంబాలా, క్లస్టర్ మొరాదాబాద్, క్లస్టర్ ఢిల్లీ, క్లస్టర్ ఫిరోజ్‌పూర్

పోస్టు: యాక్ట్ అప్రెంటిస్

అర్హత: పదో తరగతితోపాటు సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.

ట్రేడ్‌లు: మెకానికల్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, కార్పెంటర్, ఎంఎంవీ, ఫోర్జర్ అండ్ హీట్ ట్రీటర్, వెల్డర్, పెయింటర్, మెషినిస్ట్, టర్నర్, ట్రిమ్మర్, రిఫ్రిజిరేటర్ అండ్ ఏసీ మెకానిక్, డేటా ఎంట్రీ ఆపరేటర్, హామర్‌మన్, టర్నర్, క్రేన్ ఆపరేటర్, స్టెనోగ్రాఫర్ తదితరాలు.

వయోపరిమితి: 2024 సెప్టెంబరు 16 నాటికి 15 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.

ఎంపిక విధానం: మెట్రిక్యులేషన్, ఐటీఐ మార్కులు, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు.

దరఖాస్తు రుసుము: రూ.100. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళా అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 16

వెబ్‌సైట్: https//www.rrcnr.org/

బిలాస్‌పూర్ ఎయిమ్స్‌లో టెక్నీషియన్స్

ఖాళీలు: 68

బిలాస్‌పూర్‌లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్)... ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు

1. ల్యాబ్ టెక్నీషియన్: **36 పోస్టులు**
2. టెక్నీషియన్(ఓటీ/పెర్ఫ్యూజన్ టెక్నాలజీ): **32 పోస్టులు**

అర్హత: ఇంటర్మీడియట్, పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఎస్సీ(మెడికల్ ల్యాబొరేటరీ టెక్నాలజీ/మెడికల్ ల్యాబొరేటరీ సైన్స్) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

జీతం: నెలకు రూ.35,400

వయోపరిమితి: 18 - 35 ఏళ్లు మించకూడదు

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ దరఖాస్తులను ప్రాజెక్ట్ మేనేజర్(హెచ్ఆర్), బ్రాడ్‌కాస్ట్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్(బీఈసీఐఎల్), బీఈసీఐఎల్ భవన్, సీ-56/ఏ-17, సెక్టార్-62, నోయిడా చిరునామాకు పంపాలి.

ఆఫ్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: ఆగస్టు 19

వెబ్‌సైట్: https://www.becil.com/vacancies

ఇన్‌స్పేస్‌లో డైరెక్టర్ పోస్టులు

ఖాళీలు: 16

అహ్మదాబాద్‌లోని ఇండియన్ నేషనల్ స్పేస్ ప్రమోషన్ అండ్ ఆథరైజేషన్ సెంటర్(ఇన్‌స్పేస్)... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. డిప్యూటీ డైరెక్టర్: **5 పోస్టులు**
2. అసిస్టెంట్ డైరెక్టర్: **9 పోస్టులు**
3. సెక్షన్ ఆఫీసర్: **2 పోస్టులు**

విభాగాలు: ఇండస్ట్రీ ఔట్‌రీచ్, కో ఆర్డినేషన్, లీగల్, ఎర్త్ అబ్జర్వేషన్ అప్లికేషన్, శాటిలైట్ ఎర్త్ స్టేషన్ అండ్ గ్రౌండ్ సెగ్మెంట్, అడ్మినిస్ట్రేషన్ తదితరాలు.

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో కనీసం 65 శాతం మార్కులతో డిప్లొమా, డిగ్రీ(లా), బీఈ/బీటెక్(ఐటీ/కంప్యూటర్ సైన్స్), ఎంబీఏ(మార్కెటింగ్/బిజినెస్/ఎకనామిక్స్/కామర్స్), పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: డిప్యూటీ డైరెక్టర్ పోస్టుకు 45 ఏళ్లు, అసిస్టెంట్ డైరెక్టర్ పోస్టుకు 40 ఏళ్లు, డిప్యూటీ డైరెక్టర్(లీగల్) పోస్టుకు 50 ఏళ్లు, సెక్షన్ ఆఫీసర్ పోస్టుకు 30 ఏళ్లు, సెక్షన్ ఆఫీసర్(అడ్మినిస్ట్రేషన్) పోస్టుకు 38 ఏళ్లు మించకూడదు.

పని ప్రదేశాలు: బెంగళూరు, అహ్మదాబాద్

ఎంపిక ప్రక్రియ: ఇంటర్వ్యూ, మెడికల్ టెస్ట్ తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 2

వెబ్‌సైట్: www.inspace.gov.in/inspace

ఆన్‌లైన్ మెటీరియల్ కంటే పాఠ్య పుస్తకాలే బెటర్..!

దశాబ్దకాలంగా విద్యారంగంలో చోటు చేసుకుంటున్న భారీ మార్పులు నిపుణులను ఆందోళనలకు గురిచేస్తున్నాయి. ఇందుకు రోజురోజుకూ విస్తరిస్తున్న ఆన్‌లైన్ విధానమే ప్రధాన కారణం. విద్యార్థులు పాఠ్యపుస్తకాల కంటే ఆన్‌లైన్ మెటీరియల్ వైపే ఎక్కువగా ఆసక్తి కనబరుస్తున్నారు. అయితే.. ఆన్‌లైన్ మెటీరియల్ ఏ మేరకు ప్రామాణికమో ప్రతి ఒక్కరూ గమనించాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు.



ఆన్‌లైన్‌లో కావాల్సినంత మెటీరియల్ లభిస్తుండగా, పాఠ్యపుస్తకాల అవసరం ఏమిటనేది కొంత మంది అభిప్రాయం. పుస్తకాలు కొనడం ఖర్చుతో కూడిన వ్యవహారం. అదే ఆన్‌లైన్ మెటీరియల్ అయితే ఉచితంగా లభిస్తుంది. కొన్ని పదాలు టైప్ చేస్తే చాలు మనకు కావాల్సిన సమాచారం క్షణాల్లో కళ్ల ముందే కనిపిస్తుంది. అయితే ఇదంతా సులువైన వ్యవహారం కాదని, పాఠ్య పుస్తకాల మాదిరిగా ఇంటర్నెట్‌లో లభించేదంతా ప్రామాణికమైన సమాచారం కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అలాగే విద్యార్థుల దృష్టి మరల్చే పలు విషయాలు అక్కడ ఉంటాయి. దీంతో అసలుకే మోసం వస్తుందని వారు చెబుతున్నారు.

ప్రామాణికత: సాధారణంగా పాఠ్య పుస్తకాలను నిపుణులు రాస్తారు. దాన్ని అనేకసార్లు సమీక్షిస్తారు. ఆ తరవాతే ప్రచురణకు పంపిస్తారు. కాబట్టి వీరు రాసే పాఠ్య పుస్తకాలకు ప్రామాణికత ఎక్కువ. అదే ఇంటర్నెట్‌లో ఎవరైనా ఆర్టికల్స్ లేదా మెటీరియల్ అప్‌లోడ్ చేయవచ్చు. ఇలాంటి సమాచారంతో విద్యార్థులు మిస్ గైడ్ అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

క్షుణ్ణంగా, విస్తృతంగా: పాఠ్య పుస్తకాల్లో సమాచారం చాలా క్షుణ్ణంగా, విస్తృతంగా ఉంటుంది. ప్రతి టాపిక్‌ని క్రమపద్ధతిలో, సవివరమైన ఉదాహరణలతో, బ్యాక్ గ్రౌండ్ సమాచారంతో వివరిస్తారు. ఈ విధమైన నిర్మాణాత్మక విధానం వలన విద్యార్థులు పాఠ్యాంశాలను సమగ్రంగా అవగాహన చేసుకుంటారు.

ప్రణాళికాయుత అభ్యసన - పాఠ్యంశాల అమరిక: సాధారణంగా తరగతి గదిలో బోధించే ఉపాధ్యాయులే పాఠ్య పుస్తకాలను రచిస్తారు. వారినే ప్రచురణకర్తలు సంబంధిత సబ్జెక్టుల పుస్తకాల ప్రచురణ కోసం సంప్రదిస్తారు. అందువల్ల వారు రాసే పాఠ్య పుస్తకాలు నిర్దేశించిన పాఠ్యప్రణాళిక ప్రమాణాల మేరకు ఉంటాయి. అదే ఇంటర్నెట్‌లో లభించే మెటీరియల్ దీనికి భిన్నంగా ఉండే అవకాశాలే ఎక్కువగా ఉంటాయి.

పరధ్యానాన్ని తగ్గించడం: బ్రౌజింగ్, ఆవలించడం, మరో ట్యాబ్‌ను ఓపెన్ చేయడం, సోషల్ మీడియా పేజీని సందర్శించడం ఇంటర్నెట్‌లో సర్వసాధారణం. దీని బారిన పడిన విద్యార్థులు క్రమంగా అభ్యసన సామర్థ్యాలు కోల్పోతున్నారు. ఫలితంగా తరచుగా తమ దృష్టిని చదువు మీద నుంచి ఇతర వ్యాపకాలవైపు మళ్లిస్తున్నారు. ఇంటర్నెట్‌కు దూరంగా ఉండే విద్యార్థులే చదువుపై శ్రద్ధ వహిస్తుంటారు.

స్థిరమైనది-శాశ్వతమైనది: పాఠ్యపుస్తకాల్లో ఉండే సమాచారమే స్థిరమైనది, శాశ్వతమైనది. ఆన్‌లైన్ సమాచారం స్థిరంగా ఉండదు. నమ్మశక్యమైనదీ కాదు. ఏదైనా సమాచారం కోసం బ్రౌజింగ్ చేస్తుండగా పేజీ ఎర్రర్ అని వచ్చినప్పుడు, సంబంధిత కంటెంట్ కూడా మారిపోయి కన్పిస్తుంది. కరెక్ట్ వెర్షన్ ఏదో తెలియక విద్యార్థులు అయోమయానికి లోనయ్యే అవకాశం ఉంది. కాబట్టి ఆన్‌లైన్ మెటీరియల్‌తో పోల్చితే పాఠ్యపుస్తకాల్లోని సమాచారమే స్థిరమైనది, శాశ్వతమైనదని నిస్సందేహంగా చెప్పొచ్చు. ఎందుకంటే ఒకసారి పుస్తకం ప్రచురణ అయిన తరవాత ఆందులోని సమాచారాన్ని ఆన్‌లైన్‌లో మార్చినట్లుగా మార్చడం కుదరదు. అందువల్ల విద్యార్థుల పటిష్ఠమైన జ్ఞాన సముపార్జనలో ఈ స్థిరత్వమే అత్యంత క్రియాశీల పాత్రను పోషిస్తుంది. త్వరగా సెర్చ్ చేయడం, ప్రత్యామ్నాయ సమాచార సేకరణలో ఇంటర్నెట్ అమూల్య వనరు అయితే... ప్రభావశీల అధ్యయనంలో పాఠ్య పుస్తకమే మూల స్తంభం. ప్రామాణికత, విస్తృత సమాచారం, నిర్మాణాత్మక విధానం, పరధ్యానానికి లోనుగాకపోవడం వంటివి కేవలం పాఠ్యపుస్తకాల ద్వారానే సాధ్యమవుతుంది. ఇవే విద్యలో మూల సాధనాలు.

చావు తెచ్చిన మామిడి పండ్లు

తెనాలి రామలింగ కవి ఒక రోజు కృష్ణ దేవరాయల కొలువుకు వెళుతూ ఉండగా భటుడు ఒకరు బంగారు పళ్లెం నిండా మామిడిపండ్లను వాటితో పాటు ఒక లేఖను లోపలికి తీసుకెళ్లడం చూసాడు. ఆ మామిడి పండ్ల తియ్యని వాసనకు తెనాలి రామలింగ కవికి నోరు ఊరింది. ఆ పండ్లలో ఒక పండైనా తింటే బాగుండు అనుకున్నాడు. రాజు గారికి ఆ పండ్లు అందగానే ఒక పండును తీసి కొంచెం కొరికాడు. అది చూసిన రాజుగారు 'నీకెంత ధైర్యం? నా కోసమని పొరుగు దేశపు రాజు కానుకగా పంపిన పండ్లను, అది కూడా నా అనుమతి లేకుండా తింటావా? నీ తల తీయిస్తాను' అని కోపంగా అన్నాడు. వెంటనే రామలింగ కవి గట్టిగా ఇలా అరవసాగాడు' ఇవేమి పండ్లురా బాబోయ్; ఒక్కపండు కొంచెం తిన్నందుకే నాకు చావు మూడింది.



ఇక మొత్తం పండ్లు తిన్న మహారాజు గారికి ఏ గతి పట్టనుందో' అని కేకలు వేసాడు. ఆ చేష్టలకు నవ్వుకున్న రాయలు కవికి వేసిన శిక్షను రద్దు చేయడమే కాకుండా అతనికి కొన్ని మామిడి పండ్లను కూడా ఇచ్చి పంపాడు. తన చమత్కారంతో పండ్లను సాధించిన విధానం చూసి సభలో అందరూ రాజుగారితో పాటే వికటకవి తెలివికి నవ్వుకున్నారు.

దారి కనుక్కోండి



6 తేడాలు గుర్తించండి



సరైన నీడ కనుక్కోండి



డైలీ సుడోకు - 386

3					
		1	3	6	
1			6		
		6			2
	5	2	1		
					6

సుడోకు - 385 సమాధానం

4	6	7	2	3	5	1	8	9
1	2	3	6	9	8	7	4	5
8	9	5	7	1	4	2	6	3
6	8	1	5	2	9	4	3	7
2	3	4	8	7	1	5	9	6
5	7	9	3	4	6	8	2	1
9	5	6	1	8	2	3	7	4
3	4	8	9	5	7	6	1	2
7	1	2	4	6	3	9	5	8

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.